అపరాధ పరిశోధన

రూ. 4 | జూన్ '80

Blank Page

సంపుటి: 30
సంచిక: 5

ఫోన్ నెం
64043

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 49 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 325 రూపాయలు.

జూన్, 1980

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ శీలాదేవి

మీ ఉత్తరాలు

ఈ నెల వసుంధరగారి 'మరణశిక్ష' నవల మమ్మల్ని తెలియని అనుభూతికి గురిచేసింది. ప్రతిపేజీ ఒక విలువైన కావ్యంలా మలచబడింది. ఇంతమంచి నవలను అందించిన రచయిత్రికి, సంపాదకులకు మా హృదయపూర్వకాభివందనములు.

—యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి.

అపనలో మల్లాది, ప్రతాపరవిశంకర్‌గారల కథలు చాలా బాగున్నాయి. జోక్స్ తక్కువ వేస్తున్నారు. ఈ నెల పత్రిక, సంప్లిమెంట్‌లపై వున్న ముఖచిత్రాలు చాలా బావున్నాయి.

—విజేంద్రనాథ్ ప్రసాద్, ఆదోని.

మే నెల సప్లిమెంట్‌లో 'మరణశిక్ష' నవల అద్భుతం. కథలలో నగ్నచిత్రాలు, ఫస్ట్‌నైట్, నిప్పులేని పొగ మమ్మెంతో ఆకర్షించాయి. సీరియల్స్ శరవేగంతో ముందుకు సాగుతున్నాయి.

—యం. ఏ. సలీమక్తర్, మంచిర్యాల.

అపనలో ప్రచురించే థ్రిల్లింగ్ కథలంటే నాకెంతో ఇష్టం. నవలలు అసభ్యతకు అతీతంగా, చదవడానికి ఇంట్రెస్టింగ్‌గా వుంటున్నాయి. పోటీలలో పాఠకులు పాల్గొనేటట్లు చెయ్యటం ద్వారా పాఠకుల బ్రెయిన్‌కు పదును పెడ్తున్నారు. ముఖ్యంగా మీ బుక్స్‌లో మంచి 'నాలెడ్జి' వుంది. ఇంతమంచి పత్రికను అందిస్తున్న సంపాదకులకు పాఠకులం మేం ఎంతో ఋణపడి వున్నాము.

—ఎమ్. అనసూయదేవి, విజయనగరం.

మే నెల సంచికలో కథలన్నీ బాగున్నాయి. 'క్రైం రివాల్వర్' కథలో దోషిని సులభముగా పాఠకుడు గుర్తించగలడు. అలాగే అపోహను కథావస్తువుగా ఎన్నుకొన్న వాణిశ్రీగారి 'ఫస్ట్‌నైట్' బాగుంది. అన్ని కథలకు గీసిన చంద్రగారి చిత్రాలు మరీ బాగున్నాయి.

—కందికట్టు శ్రీధర్, నెల్లూరు.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. మతిలేని భార్య—కృష్ణచైతన్య.
26. కత్తిమనిషి—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
45. కుక్కలమేడ—యం. దుర్గావళి.
76. కొత్తదొంగ—వసుంధర.
94. ఉరి—ఎమ్. వి. వి. సత్యనారాయణ.
104. కక్ష— వాణిశ్రీ.
124. వెర్రి అభిమాని—వి. లక్ష్మీదేవి.
144. రిజర్వాయరులో శవాలు—ఎమ్. డి. చైతన్య
164. తప్పుదారి—ప్రతాప రవిశంకర్.
181. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. నల్లకారు—ఎమ్. వి. వి. సత్యనారాయణ.
58. మృత్యుమందిరం—వసుంధర.
104. సినీతార (ఆత్మ) హత్య—వాణిశ్రీ.
142. రెండు శవాలు—ప్రతాప రవిశంకర్.
174. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!

కృష్ణచైతన్య

మతిలేని భార్య



జయంతి స్నానంచేసి వచ్చేసరికి పరశురామ్ ఎవరికో ఫోన్ చేస్తూ కన్పించాడు. ఫ్లాస్కులో వున్న కాఫీ కప్పులో పోసుకొని హాల్లోకి వచ్చింది. పరశురామ్ మాట్లాడడం పూర్తిచేసి, ఫోన్ పెట్టేసి అలసటగా కుర్చీలో కూర్చున్నాడు.

జయంతి కాఫీ అందించింది. కాఫీ త్రాగడం పూర్త

య్యాక అడిగింది, "అక్కయ్య సంగతి ఏమైనా తెలిసిందా?"

పరశురామ్ చిన్నగా నిట్టూర్చి, "లేదమ్మా! చూస్తున్నావుగా, అన్ని చోట్లా తిరిగాను. తెల్సిన వాళ్ళందరికి చెప్పాను. పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాను. ఇంతవరకు మీ అక్కయ్య జాడ తెలియలేదు." అన్నాడు నీరసంగా.

జగన్నాథం, పార్వతమ్మ లోపల్నుంచి వచ్చారు. ఇద్దరి ముఖాలు దుఃఖంతో బాగా వాడిపోయాయి.

"అదికాదు బాబూ! అసలే అమాయకురాలు. లోకజ్ఞానం బొత్తిగా లేదు. పైగా పిచ్చితల్లికి మనస్థిమితం కూడ లేదు. ఎక్కడుందో? ఎన్ని కష్టాలు పడుతుందో!" జగన్నాథం గొంతు దుఃఖంతో జీరబోయింది.

"నా బాధ కూడ అదేనండీ! ఏ రోజూ నేను పక్కన లేకుండా కనీసం బజారుకు కూడా వెళ్ళి ఎరగదు. పైగా మతిస్థిమితం తప్పాక, ప్రత్యేకించి ఆమె కోసం మరో ఇద్దరు నౌకర్లను నియమించాను. కాని మన దురదృష్టం. అందరి కళ్ళు కప్పి ఎలా బయటకు వెళ్ళిందో ఏమో? మూడు రోజులైనా పోలీసులకు కూడా యెలాంటి ఆచూకీ తెలియలేదు" నిరాశగా, నిర్లిప్తంగా అన్నాడు పరశురామ్.

జయంతి ఏదో అనబోయింది. అంతలోనే టెలిఫోన్ మ్రోగింది. పరశురామ్ ఆతృతగా రిసీవర్ ఎత్తి "హల్లో!" అన్నాడు.

"మిస్టర్ పరశురామ్! నేను ఇనస్పెక్టర్ని మాట్లాడుతున్నాను. మీరిచ్చిన వివరాలనల్ల మీ శ్రీమతి ఆచూకి ఇంతవరకు తెలియలేదు. కాని, నార్త్ రైల్వే కాబిన్ దగ్గర పట్టాలమీద ఒక స్త్రీ శవం వుందని ఇప్పుడే వార్త

అందింది. మిమ్మల్ని కూడ ఒకసారి పిలవడం మంచి దని...."

"ఇప్పుడే వస్తున్నా!" ఇనస్పెక్టర్ మాటల్ని మధ్యలో ఆపేసి, రిసీవర్ క్రిందపడలి బయటకు పరుగెత్తాడు. విషయం తెల్సుకున్న మిగతా ముగ్గురూ నెత్తీ నోరు బాదు కున్నారు.

పది నిముషాల్లో ఇనస్పెక్టర్‌తో కలిసి, స్త్రీ శవం పడి వున్న చోటుకి వెళ్లాడు పరశురామ్. అప్పటికే జనం గుంపు లుగా చేరి శవాన్ని చూస్తున్నారు. పోలీసుల్ని చూడగానే అందరూ పక్కకు తప్పుకున్నారు. పరశురామ్ ఆతృతగా ముందుకు వెళ్ళి చూచాడు. మరుక్షణంలో భరించలేని భయంతో తల తిప్పుకున్నాడు.

శవం చాల భయంకరంగా వుంది. మెడ దగ్గర నుంచి శరీరం అంతా రెండు పట్టాల మధ్య పడి వుంది. పట్టాల కవతల చితికిపోయి, రక్త మాంసాలు బయటకు వచ్చి, రూపులేనంతగా, భరించలేనంత భయంకరంగా వుంది.

ఇనస్పెక్టర్ పిలిచేంతవరకు ఆ షాక్ నుంచి కోలుకోలేక పోయాడు పరశురామ్.

"మిస్టర్ పరశురామ్, ప్లీజ్! శవం వైపొకసారి చూచి, పోల్చుకోగలిగితే, మా మిగతా కార్యక్రమం పూర్తిచేసు కుంటాం!" అన్నాడు ఇనస్పెక్టర్.

పరశురామ్ భయంభయంగా చూచాడు శవం వైపు.

శవం వొడ్డు పొడుగు అంతా సావిత్రిలాగే వుంది. ఆమెకెన్ని చీరలున్నాయో, మాయమయిన రోజు ఏ చీర కట్టు కుందో తెలియదు. కాబట్టి శవానికి వున్న చీరనుబట్టి గుర్తించే వీలులేదు. శవాన్ని గుర్తించడానికి వీల్లేకుండా మొహం ఛిన్నాభిన్నం అయింది. ఎంతసేపు చూచినా, అది

తన భార్య శవమో కాదో నిర్ణయించుకోలేకపోయాడు.

"సారీ! ఇనస్పెక్టర్! నేనెటూ నిర్ణయించుకోలేక పోతున్నాను" అన్నాడు నీరసంగా.

ఇనస్పెక్టర్ తల ఊపి, "ఇట్సాల్‌రైట్! మేము శవాన్ని మార్చురీకి పంపిస్తాం! మీ మామగారిని వాళ్ళను తీసుకొని తర్వాత రండి! బహుశా వాళ్ళయినా గుర్తుపట్టగలరేమో చూద్దాం!" అన్నాడు తన సిబ్బందిని పురమాయిస్తూ.

పరశురామ్ తిరిగివచ్చి, విషయం అంతా చెప్పి, జయంతిని, జగన్నాధాన్ని, పార్వతమ్మను తీసుకొని మర్చ్యూరీ దగ్గరకు బయలుదేరాడు.

శవాన్ని చూడగానే పార్వతమ్మ ఘొల్లుమంది. ఆమెతో పాటు మిగతా ఇద్దరూ ఘొల్లుమన్నారు.

ఇనస్పెక్టర్ వాళ్ళను వారించి, "ఈమె మీ అమ్మాయే అనడానికి ఆధారాలేమైనా వున్నాయా?" అడిగాడు.

జగన్నాధం కళ్ళు తుడుచుకొని, "ఆధారాలంటే....పుట్టు మచ్చల్లాంటివి నాకు తెలిసి, శరీరం మీదెక్కడా లేవు. మెడమీద, చెవి క్రిందుగా పుట్టుమచ్చ వుండేది....కాని.... కాని....అసలు తలే లేదుగా...." ఘొల్లుమన్నాడు.

"శరీరచ్ఛాయ, వొడ్డు అంతా మా అక్కయ్యే! సందేహం లేదు. అదీగాక, ఇలాంటి చీర అక్కయ్యకు ఉన్నట్లు నాకు బాగా గుర్తు. ఇంతకు మించి గుర్తు పట్టడానికేముంది?" అంది-జయంతి ఏడుస్తూ.

ఇనస్పెక్టర్ తల ఊపి, "ఆల్‌రైట్! మీరిక వెళ్ళండి. శవపరీక్ష కాగానే శవాన్ని మీ కందించే ఏర్పాట్లు చేస్తాం!" అని పరశురామ్‌వైపు తిరిగి, "సారీ! మిస్టర్ పరశురామ్!" అన్నాడు నెమ్మదిగా భుజం తట్టి.

పరశురామ్ మాట్లాడలేదు. ప్రాణంలేని శవంలా నిర్లిప్తంగా బయటకు నడిచాడు.

2

రాత్రి పన్నెండుగంటలు దాటింది.

పరశురామ్ తన గదిలో అసహనంగా అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. రెండు నిముషాల తర్వాత చటుక్కున ఆగి, వరండాలోకి వచ్చి చూచాడు.

క్రింద హాలు పక్కగదిలో లైటు వెల్గడంలేదు. అంటే.. జగన్నాధం, పార్వతమ్మ, జయంతి, నిద్రపోయి వుండాలి. చిన్నగా నిట్టూర్చి చకచక లోపలికి వెళ్ళి, బీరువాలో క్రింద సొరుగులో బట్టలమధ్య వున్న తాళంచెవి జేబులో వేసుకొని, లైటార్పి రెండు నిముషాలు చీకట్లో అలాగే నిలబడ్డాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నెమ్మదిగా గది బయటకు వచ్చి, తలుపులు దగ్గరకు లాగి చకచక మెట్లెక్కి మూడో అంతస్థుకు చేరుకున్నాడు.

మూడంతస్థుల మేడ అది. పై రెండు అంతస్థులు ఎవ్వరూ ఎక్కువగా ఉపయోగించరు. ఎవరైనా గెస్టులు వచ్చినప్పుడు మాత్రమే వాటితో పని వుంటుంది.

చివరి అంతస్థులో మూలగా వున్న గది దగ్గరకు వెళ్ళి ఒక్క క్షణం నిలబడి చుట్టూ చూచి, చటుక్కున తాళం తెరిచి లోపలికి వెళ్ళి తలుపు మూసాడు.

మంచం మీద కూర్చున్న సావిత్రి భయంగా చూచింది భర్తవైపు.

పరశురామ్ నవ్వి, "కులాసాగా వున్నావా?" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

సావిత్రి రెండు చేతులెత్తి నమస్కారం చేస్తూ, "నీకు పుణ్యం వుంటుంది నన్ను వొదిలెయ్యి. నీకేవిధంగానూ

అడ్డురాను. నా ఆస్తంతా నీపేర వ్రాస్తాను. నన్ను ప్రాణాల్తో వదిలితే మళ్ళీ నీ కంటికి కన్పించనంత దూరం వెళ్ళిపోతాను" అంది ఏడుస్తూ.

"ఛ! ఛ! మరీ అంత బేలలా మాట్లాడకు. నువ్విప్పుడు చచ్చిపోయావ్! నీ అంత్యక్రియలు జరిగి కూడ రెండు రోజులయింది. మీ అమ్మ, నాన్న, చెల్లెలు కూడ నీ శవాన్ని గుర్తుపట్టి భోరున ఏడ్చారు" అన్నాడు వికటంగా నవ్వుతూ.

"ఆ! మా అమ్మ వాళ్ళు వచ్చారా!" అంటునే పెద్దగా 'అమ్మా!' అని అరిచింది.

పరశురామ్ పకపక నవ్వాడు. "ఇంకా పెద్దగా అరువ్! నీ గొంతు చిరిగేలా అరువ్! కాని నీ మాట ఈ గది దాటి బయటకు పోదు. కారణం ఇది సౌండ్‌ప్రూఫ్ గది. ఆ!.... ఇంకో శుభవార్త మరచిపోయాను. నీకు కారు ఏక్సిడెంట్‌లో మతి కొద్దిగా చలించటం కూడ నాకు చాల మేలయింది. నీవు మతి స్థిమితం లేక పొరపాటున రైలు క్రిందపడి మరణించటంవల్ల, నీపేర చేసిన లక్షరూపాయల ఇన్సూరెన్స్ కూడ రేపో, ఎల్లుండో రాబోతుంది!"

"ఛీ! దుర్మార్గుడా! నువ్వు మనిషివి కాదు రాక్షసుడివి. ఆస్తికోసం భార్యను చంపే పరమ నీచుడివి" అంటూ భోరున ఏడ్చి, "నీ కాళ్ళకు మొక్కుతాను. నన్ను వదిలెయ్యి. నీ గురించి ఎవ్వరికి చెప్పను. ఎక్కడికో దూరంగా పోయి బ్రతుకుతాను!" అంది దీనంగా.

పరశురామ్ భుజాలెగరవేసి, "సారీ సావిత్రీ! అది సాధ్యమయ్యే పనికాదు. రెండ్రోజుల్లో మీవాళ్ళు వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళిన రోజు రాత్రే నీ అంతిమ ప్రయాణం. ఈ రెండు రోజులు మంచి భోజనం తెచ్చిస్తాను. హాయిగా తిని విశ్రాంతగా నిద్రపో! తప్పించుకోవాలని ప్రయత్నం

చెయ్యకు?" అంటూ గదంతా పరీక్షగా చూచాడు.

గదిలో ఒక మంచం, టీపాయ్ తప్పించి ఇంకేమీ వస్తువులు లేవు. "ఈ రెండు రోజులు నీ భర్తను భక్తితో పూజించుకో. ఆ తర్వాత చూడడానికి నువ్వుండవు!" అంటూ నవ్వి "మళ్ళీ రేపు భోజనం తెస్తాను!" చటుక్కున బయటకు వచ్చి గది తలుపు తాళం వేసి, క్రిందకు దిగివచ్చి గదిలోకి వెళ్లి మంచంమీద వాలాడు.

అతని కళ్ళముందు లక్షల ఆస్తి, అందమైన నీరజ మొహం మెదిలాయి. చిన్నగా నవ్వుకున్నాడు. దేవుడు దయామయుడు. తనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తన కోరికలు తీరుస్తున్నాడు. 'సావిత్రి పని పూర్తయ్యాక దేవుడికి పది టెంకాయలు కొట్టాలి!' మనసులోనే అనుకున్నాడు.

3

వారం రోజుల తర్వాత సావిత్రి తల్లితండ్రులు, చెల్లెలు జయంతి పుట్టెడు దుఃఖంతో వెళ్ళిపోయారు.

ఆ రోజు సాయంత్రం పరశురామ్ ఆఫీసునుంచి వస్తూ అక్కడి దృశ్యంచూచి, కారాపి, ఆలోచనల్లో పడ్డాడు.

అది టౌన్ ఎక్స్టెన్షన్ ఏరియా. అందుకే అక్కడ కొత్తగా డ్రయినేజి వేస్తున్నారు. పెద్దపెద్ద గుంటలు తవ్వి పెద్ద సిమెంటుపైపులు అందులో దించి, మిగతా ఖాళీలను పూడుస్తున్నారు. ఇంకా కొన్ని చోట్ల పూడ్చవలసిన పని వుంది. ఆ దృశ్యం చూడగానే మెరుపులాంటి అయిడియా వచ్చింది.

ఇంతకాలం సావిత్రిని చంపాక శవం ఎక్కడ దాచి పెట్టాలా అని ఆలోచిస్తూ వచ్చాడు. ఇప్పుడు బ్రహ్మాండమైన అవకాశం వచ్చింది. సావిత్రి శవాన్ని తెచ్చి ఇక్కడ



పడేసి పైన మట్టి కప్పేస్తే ఎవ్వరూ తెల్సుకోలేరు. ఒకవేళ డ్రైనేజి రిపేరొచ్చి రెండు మూడేళ్ళ తర్వాత త్రవ్వినా అప్పటికేమీ మిగలదు. అంతటితో ఆ సమస్య వదిలిపోతుంది. అలా కాకుండా, శవాన్ని ఎక్కడో పాతిపెట్టినా నీళ్ళలో వేసినా, అదృష్టం బాగలేకపోతే దొరికిపోయే ప్రమాదం వుంది. అందుకే ఒక నిర్ణయానికి వచ్చి హుషారుగా ఇంటికి బయలుదేరాడు.

ఇంటికి వెళ్ళాక హాయిగా స్నానంచేసి, నౌఖర్లను పంపేసి, భోజనంచేసి, తలుపులన్నీ వేసి, గదిలోకి వెళ్ళి రివాల్వర్ తీసి పాకెట్‌లో వేసుకొని మళ్ళీ కిచెన్‌లోకి వచ్చాడు. ఇంకో ప్లేటులో భోజనం పెట్టుకొని, చకచక సావిత్రి వున్న గదిలోకి వెళ్లాడు. భోజనం టీపాయ్ మీద

పెట్టి మంచంమీద కూర్చున్నాడు.

"సావిత్రీ! రాత్రి భోజనం చెయ్యలేదేం?" అడిగాడు గదిలో మూలగా పడివున్న అన్నంవైపు చూస్తూ.

"ఈ రోజో, రేపో చనిపోయేదానికి భోజనం ఎందుకు" అంది నిబ్బరంగా.

పరశురామ్ పకపక నవ్వి, "పదిరోజులు ఈ గదిలో వుండేసరికి నీకు వేదాంతం బాగా వంటబట్టింది. గుడ్. నీ కింక శ్రమ ఇవ్వదల్చుకోలేదు. ఇంకొద్దిసేపట్లో నీకీ చెర విడిపించదలిచాను?' అన్నాడు నవ్వుతూ.

సావిత్రి అదిరిపడింది. కళ్లల్లో భయం కొట్టవచ్చినట్లు కన్పించింది నిజంగా చంపేస్తారా?" దీనంగా అడిగింది.

"సావిత్రీ! ఎప్పుడూ కాకపోయినా అప్పుడప్పుడు నాకు మాటమీద నిలబడాలని అన్పిస్తుంది. ఎందుకో ఈసారి ఆ అభిప్రాయం మరింత గట్టిగా ఏర్పడింది. ఎక్కువ రోజులు నిన్నీ దీనస్థితిలో చూడలేక పోతున్నాను. అందుకే ఏమైనా సరే ఈరోజు నా శక్తి వంచనలేకుండా ప్రయత్నించి, నీకీ చెర విడిపించదలిచాను!" నాటక ఫక్కీలో వ్యంగ్యంగా అన్నాడు.

సావిత్రి మాట్లాడలేదు. ఒక్కసారి దీనంగా ఎదురుగా వున్న ఫోటోలో వున్న తనవైపు చూచుకుంది.

రెండేళ్ళ క్రిందట ఎన్నో ఆశలతో ఈ ఇంట్లో అడుగు పెట్టిన తను, ఈరోజు అన్ని ఆశలు అడుగంటి చావడానికి సిద్ధంగా వుంది.

"ఢాం!" శబ్దంతో పాటే, గుండె పెట్టుకొని కుప్పలా కూలిపోయింది మంచంమీద. రెండు నిముషాలుకూడ గడ వక ముందే సావిత్రిలో చలనం ఆగిపోయింది. అది సౌండ్ ప్రూఫ్‌గది కావటంవల్ల రివాల్వర్ శబ్దం ఎవరికీ వినిపించ

లేదు.

పరశురామ్ సిగరెట్ వెల్గించి, తాపీగా గదిలో పచార్లు చేస్తూ గడిపాడు. అయిదు నిముషాల తర్వాత శవంనుంచి రక్తస్రావం ఆగిపోయిందని తెలిసాక, సావిత్రి వొంటిమీద నగలన్నీ తీసిపెట్టి, శవాన్ని దుప్పటిలో చుట్టాడు. రక్తంతో తడిసిన పరుపు కవర్‌ను తీసుకెళ్లి పక్కనే బాత్‌రూంలో వున్న బకెట్‌లో పడేశాడు. టాప్ తిప్పి బకెట్ నిండాక టాప్ కట్టేసాడు.

అంతలోనే అదిరిపడ్డాడు: "మైగాడ్! సర్వనాశనం అయింది" చటుక్కున బయటకు వచ్చి వరండా చివరవున్న కిటికీ దగ్గరకు వెళ్లి క్రిందకు చూచాడు. నీళ్ళు పెద్దగా నిలిచీ లేవు అక్కడ. 'అమ్మయ్య!' గుండెమీద చెయ్యి వేసుకొని తృప్తిగా నిట్టూర్చాడు.

సావిత్రి అంత తెలివి కలది కాదు. అందుకే తను బ్రతికిపోయాడు. సావిత్రి గనక కాస్త తెలివి కలదయి టాప్ తిప్పి పెడితే, నీళ్ళన్నీ క్రిందకువెళ్లి మరీ ఎక్కువగ మడుగు కట్టేది. నౌకర్లు అనుమానించి పైకివచ్చి వుండే వాళ్లు. కొద్దిలో గండం తప్పింది.

శవాన్ని గదిలోనే వుంచి, తలుపు గడియపెట్టి వచ్చి క్రిందహాల్లో కూర్చున్నాడు.

రాత్రి పన్నెండు గంటలు దాటింది. లేచివెళ్లి బట్టలు మార్చుకుని, నైట్ గౌన్ తొడుక్కున్నాడు. పెన్‌టార్చి పాకెట్‌లో వేసుకొని క్రిందకువచ్చి, కారు షెడ్‌లోంచి తీసి, వాకిలిముందు నిలబెట్టి మేడమీద గదిలోకి వెళ్ళాడు. శవానికి చుట్టిన దుప్పటి ఊడి రాకుండా, చిన్న తాళ్ళతో కట్టి సావిత్రి శవాన్ని భుజాన వేసుకొచ్చి కారు డిక్కీలో పడుకోబెట్టాడు.

ఇంటికి తాళంవేసి, కారుని నెమ్మదిగా బయటకు పోనిచ్చాడు.

అర్ధరాత్రి కావడంవల్ల, లారీలు తప్ప యితర వాహనాలు యెక్కువగా తిరగడంలేదు. అయినా చాలా నెమ్మదిగా పోనిచ్చాడు. ఎందుకంటే ఇలాంటి పరిస్థితులలో ఏ చిన్న ఆక్సిడెంటు అయినా కొంప మునిగిపోతుంది.

'డ్రెయినేజ్ ఛానల్స్' కొద్దిదూరంలో వుండగానే హెడ్ లైట్లు ఆర్పి, కారును నెమ్మదిగా వాటిపక్కకు పోనిచ్చేడు. టౌన్ ఎక్స్‌టెన్షన్ ఏరియా కావటంవల్ల పెద్దగా యిళ్లు లేవు. వీధి దీపాలుకూడ యెక్కడో దూరంగా వెలుగుతున్నాయి.

రెండు నిమిషాలు కార్లోనే కూర్చొని పరిసరాలు జాగ్రత్తగా పరీక్షించాడు. చుట్టుపక్కల యెవ్వరూ వున్న జాడ లేదు. శవాన్ని పూడ్చి పెట్టాల్సిన స్థలం ఎక్కడో సాయంత్రమే నిర్ణయించుకున్నాడు.

క్రిందకు దిగి నిలబడి, చుట్టూ చూచి గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు.

ఇంట్లో నాల్గు గోడల మధ్య హత్య అయితే సులభంగా, ధైర్యంగా చేయగలిగాడు కాని, ఆరుబయట శవాన్ని కప్పిపెట్టాలంటే గుండె దడదడ లాడిపోయింది. ఇప్పుడేమాత్రం పొరపాటు చేసినా, తన ప్రయత్నాలు సర్వనాశనం కావడమే కాదు. జీవితాంతం కటకటాలు లెక్కపెట్టవలసి వస్తుంది. ఆ ఆలోచన రాగానే శరీరం అంతా చెమటలు పట్టింది.

రెండు నిముషాల తర్వాత చిన్నగా ధైర్యం కూడగట్టుకుని, డిక్కీ తెరిచి, శవాన్ని బయటకు లాగి, భుజంమీద వేసుకొని వెళ్ళి, డ్రయినేజ్ పైపుకి.... పైపులు దించడానికి త్రవ్విన స్థలానికి మధ్య ఖాళీస్థలంలో శవాన్ని పడేసి,

పక్కనే యెత్తుగా వున్న మట్టిని చకచక నెట్టాడు.

మట్టితో శవం పూర్తిగా కప్పబడిపోయాక, పెన్ టార్చితో ఒక్కసారి పరీక్షించాడు. అంతకుముందు వాళ్ళు పూడ్చినది, తను పూడ్చినస్థలం ఒక్కలాగే వున్నాయి. ఎవ్వరికీ అనుమానం రాదు. ఉదయాన్నే కూలీలొచ్చి మిగతా భాగాన్ని పూడ్చేస్తారు. ఈ స్థలంలో ఓ శవం వున్నట్లు ఎవ్వరికీ అనుమానం రాదు.

తృప్తిగా నిట్టూర్చి కారు వెనక్కు తిప్పాడు.

ఇంటికి రాగానే మేడమీదికెళ్ళి, బకెట్లో నానబెట్టిన పరుపు కవరు బాగా పిండాడు. కాని యింకా రక్తపు మరకలు వున్నాయి. వీటిని ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

చకచక పెరట్లోకి వెళ్ళి, అడుగులోతున చిన్నగుంట తవ్వాడు. పరుపు కవరు అందులో పడేసి, బకెట్‌లోవున్న రక్తపునీరు అందులో పోసాడు. అర్ధగంట గడిచేసరికి చాలావరకు నీరు ఇంకిపోయింది. చకచక ఆ గుంటను పూడ్చేసి, ఎవ్వరికి అనుమానం రాకుండా, పైన గడ్డి కప్పి వచ్చి పడుకున్నాడు.

మరుసటిరోజు ఆఫీసుకు వెళుతూ రాత్రి సావిత్రి శవాన్ని పూడ్చిపెట్టిన స్థలంవైపు చూసాడు. అప్పటికే కూలీలు అక్కడ చాలవరకు పూడ్చేసారు. డ్రయినేజ్‌వల్ల యేర్పడ్డ మిట్ట పల్లాల్ని రోడ్‌రోలర్ చదరం చేస్తోంది.

పరశురామ్ చిన్నగా నవ్వుకున్నాడు. ఆ రోడ్‌రోలర్ క్రింద ఓ శవం వుందని ఆ పాలాకుడికి కూడా తెలియదు.

సావిత్రి చరిత్ర అలా ముగిసింది. మూడేండ్లు గడిచాయి. పరశురామ్ ఇప్పుడు లక్షల ఆస్తితో స్టెనో నీరజను పెళ్లిచేసుకొని హాయిగా వున్నాడు. సావిత్రి సంగతి అతనిప్పుడు పూర్తిగా మర్చిపోయాడు.

4

ఉదయం పదిగంటలయింది. ఇన్స్పెక్టర్ రవీంద్ర పెండింగ్ కేసు తాలూకు ఫయిల్సు చూచుకుంటున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ యెత్తి రెండు నిము షాలు విన్నాక 'ఇప్పుడే వస్తున్నా' అంటూ ఫోన్ పెట్టేసి హడావుడిగా బయటకు నడిచాడు.

పది నిముషాల తర్వాత జీపులోంచి క్రిందకు దిగి రోడ్డు పక్కగా నడిచాడు. అప్పటికే అక్కడ చాలవరకు రోడ్డు తవ్వి వున్నారు.

ఇన్స్పెక్టర్ని చూడగానే ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"నా పేరు సత్యం. నేనే మీకు ఫోన్ చేసింది!" వగ రుస్తూ చెప్పాడు తను.

రవీంద్ర తలవూపి, విషయం యేమిటన్నట్లు కళ్లెగ రేసాడు.

"నేను డ్రెయినేజి సూపర్వైజర్ని. ఈ ప్రాంతములో డ్రెయినేజ్ లీక్ అవడంవల్ల, దాన్ని తెలుసుకోడానికి డ్రెయినేజ్ కాలువ తవ్వుతుంటే ఒక అస్తిపంజరం బైట పడింది" కంగారుగా చెప్పాడతను.

"పదండి చూద్దాం." చకచక ముందుకు నడిచాడు ఇన్స్పెక్టర్ రవీంద్ర. అక్కడ ఒక పక్కగా గుమికూడి చూస్తున్న కూలీలు పక్కకు తొలిగారు. ఇన్స్పెక్టర్ ముందుకు వెళ్లిచూసాడు. అస్థిపంజరం కన్పించింది.

కాని అది అస్థిపంజరంలా లేదు. విడి యెముకలన్నీ అస్థిపంజరం రూపంలో ఏర్పరచినట్లుగా వుంది. మనిషి పుర్రెనుబట్టి అది మనిషిదని అనుకోవాలిగాని, అది లేకుంటే ఏ జంతువు యెముకలో అని పొరబడే అవకాశం వుంది.

"దీన్ని యెవరయినా కదిలించారా?" యిన్స్పెక్టరు అడిగాడు.

"లేదు. అది కన్పించగానే అందర్నీ దూరంగా వెళ్ళమని చెప్పి, మీకు ఫోన్ చేసాను. మీరు వచ్చేలోగా దాన్ని కదిలించకుండా మట్టిమాత్రం కాస్త పక్కకు నెట్టించాను" సత్యం చెప్పాడు.

ఇన్స్పెక్టర్ రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించి, సార్జంట్‌ను పిలిచి, "నువ్వెళ్ళి ఫోర్నెసిక్ ఎక్స్‌పర్ట్‌కు కబురుపంపి, ఇక్కడకు రమ్మనిచెప్పి, వస్తూ వస్తూ డిటెక్టివ్ మిస్. శిరీషగార్ని కూడా పిలుచుకురా!" అన్నాడు.

సార్జంటు తలవూపి వెళ్ళిపోయాడు.

"మీరుపోయి మిగతా పనులు చూచుకోండి," అని కూలీలకు చెప్పి, సత్యాన్ని దగ్గరగా పిలిచి, "ఈ డ్రెయినేజి వేసి ఎంతకాలం అయింది?" అడిగాడు.

"మూడు సంవత్సరాలయింది" చెప్పాడతను.

"అప్పుడు కూడా మీరే వున్నారా?"

"ఆ! ఉన్నాను!"

"డ్రెయినేజి వేసే సమయంలో పొరపాటున ఎవరైనా కూలీ పడిపోయి మరణించి వుండవచ్చేమో. మీకేమయినా అనుమానం వుందా?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

సత్యం నవ్వి "అలాంటిదేం లేదు! ప్రతిరోజూ సాయంత్రం మేము 'మస్టర్' వేసుకుంటాం. ఏ కూలీ రాకపోయినా మాకు తెలుస్తుంది" అన్నాడు.

"పోనీ, ఎవరయినా దారినవెళ్ళే వాళ్ళు పొరపాటున కాలుజారి పడిపోతే మీ కూలీలు తెలియకుండా మట్టి పూడ్చే అవకాశం వుందికదా!"

"నో! నో! డ్రెయినేజి పంపుకు మేము త్రవ్విన కాలువకు మధ్య అంత స్థలంలేదు. పొరపాటున యెవరయినా పడినా వుదయాన్నే స్పష్టంగా కన్పించేవారు" అన్నాడు సత్యం.

ఇన్స్పెక్టర్ తలవూపి ఆలోచనల్లో మునిగిపోయాడు.

పావుగంట తర్వాత ఫొరెన్సిక్ నిపుణులు, డిటెక్టివ్ శిరీష వచ్చారు. ఈ లోపల ఫోటోగ్రాఫర్ అస్థిపంజరాన్ని ఫోటోలు తీసాడు.

"హల్లో! ఇన్స్పెక్టర్! ఏమిటీమధ్య మీకు శవాలు దొరకడం మాని అస్థిపంజరాలు దొరకడం మొదలెట్టాయి" నవ్వుతూ అడిగింది డిటెక్టివ్ శిరీష.

ఇన్స్పెక్టర్ రవీంద్ర చిన్నగా నవ్వి, విషయం అంతా చెప్పి, "అస్థిపంజరం చూస్తూంటే హతుడు చనిపోయి చాలకాలం అయినట్లుంది. ఏక్సిడెంటల్‌గా చనిపోయాడో, లేక హత్య చెయ్యబడ్డాడో యెలా తెల్సుకోవడం?" నీరసంగా అన్నాడు.

డిటెక్టివ్ మిస్. శిరీష అస్థిపంజరం వేపు పరీక్షగాచూచి "ఇన్స్పెక్టర్! సందేహంలేదు. ఇతను చంపబడ్డాడు!" అని ఫోరెన్సిక్ నిపుణునివేపు తిరిగి, "మిస్టర్ రాబర్ట్! కుడివేపు ఆ ఎముకను చూడండి. సగం తెగినట్లుగా వుంది కదూ! మట్టి యెముకను కొరికేస్తే అలావుండదు. అంటే దీన్నిబట్టి హతుడు పిస్టల్‌తో కాల్చబడి వుండాలి. యేమంటారు?" అడిగింది.

రాబర్టు తలవూపి, "ఎస్! యువార్ కరెక్ట్! యింకో విషయం. ఈ అస్థిపంజరం పురుషుడిది కాదు. స్త్రీది," అన్నాడు.

ఇనస్పెక్టర్ ఆశ్చర్యపోయాడు.



రాబర్టు లేచి నిలబడి, "దీన్ని జాగ్రత్తగా నా 'లాబ్'కు చేర్పించగలిగితే మీకు మరికొన్ని వివరాలు చెప్పగలను!" అన్నాడు ఇన్స్పెక్టర్ వైపు తిరిగి.

ఇన్స్పెక్టర్ తల వూపి, సిబ్బందిని పురమాయించాడు. అస్థిపంజరాన్ని జాగ్రత్తగా తరలించే ప్రయత్నంలో వారికి ఆ మట్టిలో ఒక రివాల్వర్ తూటా లభించింది. దాన్నికూడ కెమికల్ ఎగ్జామినేషన్‌కు పంపారు.

5

"ఈ అస్థిపంజరం కేసు నన్ను ముప్పుతిప్పలు పెట్టేలా వుంది!" అన్నాడు ఇన్స్పెక్టర్ రవీంద్ర.

శిరీష నవ్వి, "డోంట్ వర్రీ. రాబర్టు తెలివిగలవాడు. ఎక్స్పర్టు. నీ ప్రాబ్లమ్ చాలా సులభంగా సాల్వ్ చేస్తాడు" అంది.

"ఎలా? అసలు హతుడెవరో తెలియదే! ఇక హంతకుడిని ఎలా పట్టుకోవడం?"

శిరీష నవ్వి "తెలుస్తుంది. రాబర్టు ఆ పని చెయ్యగలడు. 'మార్టిన్స్ మాన్యువల్ ఆఫ్ ఆంత్రోపాలజీ'లో

సూచించినట్లు పుర్రెలో వున్న ఇరవయిమూడు వివిధ స్థలాల్లోకల కండరాల మందాన్ని బట్టి, 'స్టాటిస్టికల్ మాన్ వాల్యూ' అనే పద్ధతిమీద, లింగభేదాన్ని అనుసరించి.పుర్రె మీద ఆ పరిమాణంలో బంకమట్టి పూస్తారు, దట్సాల్.... హతుడి మొహం తెల్సిపోతుంది. ఈ పద్ధతి చాలాకాలం క్రిందట జపాన్‌లో కనుగొన్నారు. రాబర్టు బ్రెయిన్డు ఎక్స్పర్టు. అతనీ పని చెయ్యగలడు" అంది.

ఇన్స్పెక్టర్ ఏదో అనబోయాడు.

టెలిఫోన్ మ్రోగింది. రవీంద్ర రిసీవర్ అందుకున్నాడు. అవతలినుంచి రాబర్టు కంఠం విన్పించింది.

"ఇన్స్పెక్టర్! ఈమెకు సుమారు ఇరవయ్యేనిమిదేళ్లు వుండవచ్చు. సన్నగా, పొడుగ్గా వుంటుందని చెప్పవచ్చు. స్కెలిటన్‌లో వుండవలసిన ఇంకాకొన్ని యెముకలు లేవు. బహుశా మట్టి తినేసి వుండవచ్చు. ఎనీ హౌ! రెండ్రోజుల్లో మీకు ఆవిడ ఫోటోగ్రాఫ్ ఇవ్వగలను!" అన్నాడు రాబర్టు.

"ఓ. కే." రవీంద్ర ఫోన్ పెట్టేసి, శిరీషవేపు తిరిగి "రెండ్రోజుల్లో ఫోటోగ్రాఫ్ యిస్తానన్నాడు" అని చెప్పాడు.

"సో! నీ వేటకింకా రెండ్రోజులు టైం వుంది. ఫోటోగ్రాఫ్ రాగానే నాకు తెలియజెయ్యి!" అంది లేచి నిలబడుతూ.

రెండ్రోజుల తర్వాత రాబర్టు ఒక ఫోటో అందించాడు ఇన్స్పెక్టర్ రవీంద్రకు. ఫోటోవేపు పరీక్షగా చూసాడు రవీంద్ర. అందంగానే వుంది. గుండ్రటి మొహం, పెద్ద పెద్ద కనులు, సన్నటిముక్కు, కొద్దిగా పైకి వచ్చిన క్రింది పెదిమ ఆకర్షణీయంగా వుంది.

శిరీషతో సంప్రదించాక, మరుసటి రోజు ఆ ఫోటోను అన్ని పేపర్లలో ప్రకటించారు ఆ వ్యక్తికి చెందినవాళ్ళు యెవరయినా వచ్చి ఇన్స్పెక్టర్ని కలుసుకోమని.

6

ఆ మరుసటిరోజే ఒక ముప్పై ఏళ్ళ స్త్రీ హడావుడిగా వచ్చింది స్టేషన్లోకి. ఆ సమయంలో, ఇన్స్పెక్టర్ రవింద్ర, శిరీష కేసు విషయం చర్చించుకుంటున్నారు.

"ఎవరు మీరు? ఏంకావాలి?"అడిగాడు రవింద్ర ఆమెను చూడగానే.

ఆమె చేతిలోఉన్న పేపరు మడతవిప్పి ఫోటో చూపించి,''ఈమె మా అక్క సావిత్రి. నా పేరు జయంతి. మీతో మాట్లాడాలని వచ్చాను?" అంది.

"కూర్చోండి" అని కుర్చీచూపించి," ఇప్పుడు ఈమె ఎక్కడుంది?" అడిగాడు ఇనస్పెక్టర్.

జయంతి పెదిమవిరచి, "లేదు చనిపోయింది మూడేళ్ళ క్రిందట రైలుక్రిందపడి చనిపోయింది?"

శిరీష, రవీంద్ర ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"రైలుక్రింద పడి చనిపోయిందా?" ఆశ్చర్యంగా అడిగాడు రవీంద్ర.

"అవును? మా అక్కయ్యకు మతిస్థిమితం తప్పి, మూడేళ్ళక్రిందట ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది. పోలీసు రిపోర్టు ఇచ్చాం. మా బావగారు కూడ చాలచోట్ల వెదికారు. కప్పించలేదు. ఒకరోజు పోలీసులు ఫోన్చేస్తే వెళ్లాం. రైలు క్రిందపడి చనిపోయిన మా అక్కయ్య శవం కప్పించింది. మొహం గుర్తుపట్టడానికి వీల్లేకుండా తల బాగా చితికిపోయింది. శవం పొడుగు, శరీరం రంగు, కట్టుకున్న చీరనుబట్టి మా అక్క అని నిర్ణయానికొచ్చాం?" అని

క్షణం ఆగి "మా అక్కయ్య ఫోటో మీకెక్కడిది? పత్రికల్లో ప్రకటించాల్సిన అవసరం ఏమిటి?" అడిగింది.

శిరీష్ చిన్నగా దగ్గి, "ఈమె మీ అక్కయ్యే అయితే, ఆ రోజు రైలు క్రింద పడి చనిపోయింది మీ అక్కయ్య కాదు. మీ అక్కయ్య అస్థిపంజరం మాకు రెండ్రోజుల క్రిందట దొరికింది. అంతేకాదు. మీ అక్కయ్య పిస్తోలుతో కాల్చి చంపబడింది" అంది.

జయంతి ఆశ్చర్యపోయి "అసంభవం. మొహం లేకపోయినా మా అక్కయ్య శరీరం నాకు బాగా తెల్సు. మా బావ కూడ చూచాడు. రైలు క్రిందపడి చనిపోయింది మా అక్కయ్యే!" అంది ఆవేశంగా.

ఇనస్పెక్టర్ నవ్వి, "ఓకె! అలాగే అనుకోండి. ఇంకో విషయం. మీ అక్కయ్యకు ఎవరైనా శత్రువులున్నారా?" అడిగాడు.

జయంతి తల అడ్డంగా ఊపింది.

"పోనీ! మీ అక్కయ్య చావువల్ల ఎవరికైనా లాభం వుందా?" అడిగాడు రవీంద్ర.

"లేదు!" అంది జయంతి.

"ఆల్‌రైట్! మీ బావగారేం చేస్తున్నారు!" అడిగాడు.

"వాల్మీకి ఫైనాన్స్ కార్పొరేషన్ మా బావగారిదే! మా అక్కయ్య పోయాక నీరజ అనే ఆవిడను మరలా పెండ్లి చేసుకున్నాడు." చెప్పింది జయంతి.

ఇన్స్పెక్టర్ కళ్ళు యెగురువేసి, "మీ అక్కయ్య పోయినందువల్ల మీ బావగారికి ఏదయినా లాభం కల్గిందా"

జయంతి కనులు చిట్లించింది. "లాభం అంటే....మా అక్కయ్యపేర వున్న నాలుగులక్షల ఆస్తి మా బావకే వచ్చింది. అదిగాక, ఆమెపేర చేసిన ఇన్సూరెన్సు కూడా

లక్షకుపైగా వచ్చింది" అంది.

సన్నగా ఈల వేసాడు రవీంద్ర. "మీ బావగా రిప్పుడు యిక్కడే వున్నారా?" అడిగాడు.

"లేరు! నేనిక్కడకు రాగానే ముందు మా బావగారి యింటికే వెళ్లాను. వారిద్దరూ యేదో పనిమీద బెంగుళూరు వెళ్లారట. రెండ్రోజుల్లో వస్తారని నౌఖరు చెప్పాడు"అంది.

ఇన్‌స్పెక్టరు శిరీషవైపు చూసాడు ప్రశ్నార్థకంగా.

శిరీష లేచి నిలబడి, "మీ బావగారింటికి ఒకసారి వెళ్దాం రండి" అంది.

ముగ్గురూ బయటకు వచ్చి, శిరీష కారులో ఎక్కారు. పదినిముషాల తర్వాత కారుదిగి ముగ్గురూ లోపలికి నడిచారు. వీళ్ళను చూడగానే నౌఖరు పరుగెత్తుకొంటూ వచ్చి "అయ్యగారు లేరు? రెండ్రోజుల్లో వస్తారు" కంగారుగా అన్నాడు.

"ఇంట్లో ఎవరున్నారు?" అడిగాడు రవీంద్ర.

"ఎవ్వరూ లేరు! నేను వంటమనిషి ఇద్దరమే వున్నాం"

ఇన్‌స్పెక్టర్ తలవూపి, "మే మొకసారి యిల్లంతా చూడాలి. అయ్యగారొచ్చాక నీకు మాట రానివ్వంలే" అంటూ లోపలికి నడిచాడు.

నౌఖరు చేసేదిలేక అక్కడే నిలబడిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, శిరీష కలిపి క్రిందగదులన్నీ వెదికారు. ఏమీ కన్పించలేదు. పరశురామ్ గదిలోమాత్రం రివాల్వర్ కన్పించింది.

"ఇది మీ బావగారిదేనా?" జయంతిని అడిగింది శిరీష.

"ఏమో నాకు తెలియదు. నే నెప్పుడూ చూడలేదు!"

"మనకు లభించిన తూటా దీనిలోంచే ప్రయోగించబడిందని నా అనుమానం. దీన్ని పరీక్షకు పంపించు" చెప్పింది

శిరీష, ఇన్‌స్పెక్టర్ రవీంద్రకు.

క్రింద అన్ని గదులూ వెదకడం పూర్తయ్యాక పైకి వెళ్ళారు. మూడవ అంతస్థులో వరండా చూడగానే తెలుస్తోంది, దాన్ని యెవ్వరూ ఉపయోగించడం లేదని.

"మీరెప్పుడయినా ఇక్కడకు వచ్చారా?" జయంతిని అడిగింది.

"లేదు! మేమెవ్వరం ఇక్కడకు రాలేదు. ఎవరన్నా గెస్టులు వస్తేనే ఇక్కడి గదులతో అవసరం కలిగేది!" అంది.

నౌకర్ని పిలిచి పైనున్న గదులన్నీ తాళాలు తీయించి చూసారు. అన్ని గదులూ ఖాళీగా వున్నాయి. చివరిగదిలో మాత్రం మంచం వుంది. దానిమీద పరుపు, దుప్పటి వున్నాయి. గదిలో మూలగా టీపాయ్‌వుంది. దానిని ఎవరైనా అతిధులు వచ్చినప్పుడు వాడుతారని చెప్పాడు నౌకరు.

శిరీష దృష్టి గోడమీదవున్న ఫోటోవేపు మళ్ళింది! ఆ ఫోటోకు వాడి యెండిపోయిన మల్లెదండ వ్రేలాడుతుంది.

"మా అక్కయ్య ఫోటో!" చెప్పింది జయంతి.

రాబర్టు తమకిచ్చిన ఫోటో, ఈ ఫోటో ఒక్కలాగే వున్నాయి. ఫోటో చేతిలోకి తీసుకొని చూస్తూ యెందుకో వెనక్కి తిప్పి చూచింది.

ఒక్కసారిగా శిరీష కళ్ళు పెద్దవయ్యాయి. ఫోటోఫ్రేం వెనక రేకుమీద మేకుతో వ్రాసిన అక్షరాలు ఇంకా స్పష్టంగానే కన్పిస్తున్నాయి. జయంతి ఆతృతగా చదివింది.

"నన్ను నా భర్తే చంపాలని ఈ గదిలో బంధించాడు. ఈరోజో, రేపో చంపేస్తాడు."

జయంతి కళ్ళు భయంతో పెద్దవయ్యాయి.

"ఇప్పటికయినా తెల్సిందా? మీ అక్కయ్య రైలుకింద

పడి చనిపోలేదని. మీబావ ఆ స్తికోసం ఆమెను ఈ గదిలో బంధించి, ఆమెకు మతిచలించి వెళ్ళిపోయిందని నమ్మించాడు. సరిగ్గా అదే సమయంలో ఎవరో అనామకురాలు రైలుకింద పడి చావటం మీ బావకు మరింత మేలుచేసింది. బహూశా, మీరంతా వెళ్ళిపోయాక మీ అక్కయ్యను కాల్చి చంపి, శవాన్ని అక్కడ పడేసాడు" చెప్పింది శిరీష.

6

అస్థిపంజరం వద్ద దొరికిన రివాల్వర్ బుల్లెట్, పరశురామ్ రివాల్వర్‌నుండే ప్రయోగించబడిందని నిర్ధారణ అయింది.

రెండ్రోజుల తర్వాత పరశురామ్, నీరజ బెంగుళూరు నుంచి రాగానే, పోలీసులు పరశురామ్‌ను సావిత్రిని హత్య చేసినందుకు అరెస్ట్ చేసారు.

మూడేళ్ళ తర్వాత తను హత్య చేసినట్లు పోలీసులు యెలా తెల్సుకో గలిగారో పరశురామ్‌కు అర్థంకాలేదు. అమాయకురాలు ఏమీ చెయ్యలేక పోయింది అనుకున్న సావిత్రి, తనను చచ్చి సాధించిందనే విషయం మాత్రం అనుభవానికి వచ్చింది పరశురామ్‌కు.

అ ప్ర తి ఘ ట న

"అయితే నా క్లైంట్ నిన్ను చూస్తూనే బీర్ బాటిల్‌తో నీ మీద దాడిచేశా డంటావా? అతన్ని ప్రతిఘటించడానికి నీ చేతుల్లో ఏమీ లేదా?"

"ఉంది." చెప్పా డా వాది. "అతడి భార్య! అంత అందమైన ఆమెని ఆ బాటిల్ దెబ్బలకు ఎరచేయడానికి నా మనసొప్పలేదు."

—యస్. వాహిద్, బొంబాయి-22.

"కత్తిమనిషి"

మల్లాది వెంకట కృష్ణమూర్తి



"త్వరపడి పెళ్ళిచేసుకుని, విశ్రాంతిగా బాధపడతారు."

ఓ వారపత్రికలోని కథ చదువుతున్న శివజ్ఞానం ఆ కథలోని రచయిత చెప్పిన మాటలు చదివాడు.

తర్వాత వాక్యం చదవటం ఆపేసి ఆ మాటల గురించే ఆలోచించ సాగాడు. తర్వాత చిన్నగా నవ్వుకున్నాడు.

నిజమే.

పెళ్ళికాదు. త్వరపడి ఏ పనీ చేయకూడదు. ముఖ్యంగా నేరం. త్వరపడి పెళ్ళి చేసుకుంటే అందువల్ల వచ్చే బాధలనుంచి విముక్తి చెందడానికి చట్టరీత్యా అనేక మార్గాలున్నాయి?

కాని నేరం, అందులోనూ హత్య త్వరపడి చేస్తే, ఆ తర్వాత కలిగే బాధలు,ఇబ్బందులనుంచి విముక్తి చెందడానికి ఎలాంటి మార్గంలేదు.

పట్టుబడితే జీవితాంతం జైల్లో కూర్చోవాలి. లేదా దుర్దృష్టం ఇంకా పగబడితే వురిశిక్షే పడచ్చు.

అందుకే శివజ్ఞానం తొందరపడ దలచుకోలేదు. హత్య చేయాలని నాలుగువారాల క్రితమే నిర్ణయించుకున్నాడు. కాని ఆ తర్వాత డిటెక్టివ్ కథల్లోలాగా పోలీసులకు పట్టుబడ దలచుకోలేదు. నిజ జీవితంలో యెంతమంది హంతకులు తప్పించుకోవటం లేదు?

ఫలానా వ్యక్తే హత్య చేసాడని రూఢిగా తెలిసినా ఆధారాలు దొరక్కపోవటంతో దోషులు తప్పించుకుంటున్నారు. ఆ తర్వాత విశ్రాంతిగా వుంటున్నారు.

శివజ్ఞానం తనుకూడా ఆ విధంగా వరూధినిని హత్య చేసి ప్రస్తుతం జీవితంలో తను పొందుతున్న అశాంతినించి విడుదలవాలనుకుంటున్నాడు.

ఇంగ్లీష్‌లో, హిందీలో, తెలుగులో వచ్చే అనేక డిటెక్టివ్ పత్రికలు నవలలు చదివాడు. ప్రతి కథలో చివర హంతకుడు చేసే తప్పుని డిటెక్టివో, పోలీస్ ఇన్‌స్పెక్టరో గర్వంగా అతనికి వివరించడం, హంతకుడు నిస్సారంగా నేలకూలిపోవడం జరుగుతూంటుంది.

కథల్లో హంతకుడు ఖచ్చితంగా చట్టానికి దొరకాలి. రచయితలు అలా రాస్తేనే బహుశ ఆ కధకి పాఠకుల సంపాదకుల దృష్టిలో, విలువ వుంటుంది. పాఠకుడికి ఫలానావాడు హంతకుడనీ, ఫలానా క్లూ ద్వారా అతన్ని పట్టుకోవచ్చని తెలిసి, ఆ ఆధారం అపరాధ పరిశోధకుడు కనుక్కోలేక, ఫలితంగా పాఠకుడికి తెలిసినా హంతకుడిని డిటెక్టివ్ కనుక్కోలేక....ఆ విధంగా కధని యెందుకు ముగించకూడదు?

శివజ్ఞానం తన ఆలోచనలకి తనలో తాను నవ్వుకున్నాడు. రచయితలు కేవలం కలం మనుషులు. వారికి చంపే ధైర్యంలేక, యెవరిమీద కోపం వుంటే వాళ్ళమీద వో కధ రాసి తృప్తిపడతారు.

తను చేతల మనిషి. కలం మనిషి కాడు. కత్తిమనిషి తను!

"హలో చాలా సేపయిందా వచ్చి?" క్లబ్‌లోకి అడుగు పెట్టిన విశాలరావు పలకరించాడు శివజ్ఞానాన్ని.

శివజ్ఞాం తన ఆలోచనలలోంచి తేరుకున్నాడు. విశాల రావు వంకచూసి చిరునవ్వు నవ్వేడు.

"ఓ పావుగంట అయింది. కూర్చోండి."

విశాలరావు శివజ్ఞానం ఎదురుగా వున్న కుర్చీలో కూచుని చిన్నగా నిట్టూర్చాడు.

"ఆడతారా?" అడిగాడు శివజ్ఞానం.

విశాలరావు తల అడ్డంగా వూపి చెప్పాడు.

"మూడ్ లేదు."

"అదేమిటి! ఎప్పుడూలేనిది పేకాటకి మూడ్ లేదంటు న్నారు ఇవాళ?" నవ్వుతూ అడిగాడు శివజ్ఞానం.

విశాలరావు నవ్వలేదు. సీరియస్‌గా చూసాడు శివజ్ఞానం

వంక.

"నాలుగయిదు రోజులక్రితం మీరు చెప్పిన విషయం గురించి ఆలోచిస్తున్నాను."

శివజ్ఞానం చురుగ్గా చూసాడు.

"ఏ విషయం?" అడిగాడు.

"అదే ప్రపంచ జనాభాలోంచి ఓ అంకెను తీసేయటం గురించి" గొంతు తగ్గించి రహస్యంగా చెప్పాడు.

"ఇంట్లో గొడవపడి వచ్చారా?"

"అవును. డబ్బు అడిగితే ఇవ్వలేదు."

"ప్చ్! మీకు డబ్బు వుండీ దాన్ని ఖర్చుపెట్టలేరు. నాకు లేక ఖర్చు పెట్టలేను. ఓ విధంగా మనిద్దరం ఒకటే."

"మనిద్దరం ఒకటయితే మీరన్నది సాధించవచ్చు."

"అంటే?"

"మీ భార్యవల్ల మీకు చాలాచాలా ఇబ్బందులున్నాయని ఆవిడని చంపడానికి కూడా వెనకాడరనీ అన్నారు మీరు నాలుగురోజుల క్రితం. కోపంలో అన్నారా? లేక నిజంగానా?"

"పచ్చి నిజం. వరూధినిని చంపాలని వుంది నాకు. కాని ఆ తర్వాత జైలుకి వెళ్ళడం నాకు ఇష్టంలేదు."

"జైలుకి కాదు. ఉరి కంబానికి. నా దగ్గర బుర్రుంది. కాని భయం కూడా వుంది. కావాలంటే మీకు ఆలోచనలను యివ్వగలను."

"నిజంగానా? హాస్యంగానా?" అనుమానంగా అడిగాడు శివజ్ఞానం.

"ఏమిటి నిజంగానా? హాస్యంగానా?" నవ్వలేదు సీరియస్‌గా అడిగాడు విశాలరావు.

"ఐమీన్....నా భార్యని నేను హత్య....చంపే పక్ష

ములో నాకు మీ సహాయం లభిస్తుందా?"

"తప్పకుండా."

"అయితే బయటకు రండి. ఇక్కడ కాదు."

"ఏమిటి?" కంగారుగా అడిగాడు విశాలరావు చటుక్కున లేచి నిలబడ్డ శివజ్ఞానాన్ని చూచి.

విశాలరావు మొహం వంకచూపి నవ్వి అన్నాడు శివజ్ఞానం.

"నిజమే, బుర్రగురించి తెలియదు కాని మీలో భయం మాత్రం బాగావుంది. బయట చెట్లనీడలో కూర్చొని మాట్లాడుకుందాం. ఇక్కడకాదు. ఎవరయినా వినవచ్చు"

ఇద్దరూ క్లబ్ హాలునుంచి బయటకు వెళ్ళారు. విశాలమయిన రావిచెట్టు కిందకి చేరుకున్నారు. శివజ్ఞానం కర్చీఫ్ వేసి నేలమీద పరచుకుని దానిమీద కూర్చున్నాడు. విశాలరావు ఓసారి చెట్టుమీదకు చూసాడు. దానిమీద యెవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక శివజ్ఞానం యెదురుగా కూర్చున్నాడు.

"నిజంగా మీరు నాకు సహాయం చేయదలచుకున్నారా" అడిగాడు శివజ్ఞానం సూటిగా విశాలరావు కళ్ళలోకిచూస్తూ.

"నిజంగా" జవాబు చెప్పాడు విశాలరావు.

"నా భార్య ప్రాణం అంటే అంత చేదా మీకు?"

"ఆవిడవల్ల మీకు ఇబ్బంది అని తెలిసాక ఆవిడ ప్రాణం నాకు చేదే. ఎంత విసిగిపోతే హత్య గురించి ఆలోచిస్తారు?"

"నాకు సహాయం చేయడంలో మీ స్వార్థం?"

విశాలరావు చిన్న నవ్వు నవ్వి చెప్పాడు.

"ఆ విషయానికి తర్వాత వద్దాం. నిజంగా మీకు హత్య చేసే ధయిర్యం వుంటే నా దగ్గరో ప్లాన్ వుంది. ఓ

ఇంగ్లీష్ సినిమాలో చూసానది...."

"మీరు సినిమా ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు కాబట్టి మీరు చూసిన సినిమాల్లోని ప్లాన్స్ గురించి నాకు చెప్పకండి. నాకు ధైర్యంతోపాటు బుర్రకూడా వుంది. కాని మీ రెండుకు సహాయం చేస్తానంటున్నారో చెప్పండి ముందర? డబ్బా?"

"ఛ. కాదు."

"ఇంకేమిటి?"

"నాకు మీరు కూడా సహాయం చేయాలి."

"ఏ సహాయం?"

"మీ భార్యని చంపాక, నా భార్యని కూడా హత్యచేసి పెట్టాలి."

నలభై అయిదేళ్ళ విశాలరావు ఆ మాటలు పలికిన ధోరణికి నవ్వొ వచ్చింది, ఇరవై యేడేళ్ళ శివజ్ఞానానికి.

"ఇంకా?"

"అంతే."

"అంటే నేను రెండు హత్యలు చేయాలన్న మాట."

విశాలరావు మౌనంగా వుండిపోయాడు.

"ఇక్కడ భార్యలని హత్యచేయబడును అనే బోర్డ్ పెట్టుకోవచ్చు నా ఇంటి ముందర" పకపకా నవ్వాడు శివజ్ఞానం.

విశాలరావు మొహం కోపంతో ఎర్రబడింది.

"నే వెళ్తాను."

లేవబోతున్న ఆయన్ని శివజ్ఞానం చేత్తో నొక్కిపట్టి ఆపి చెప్పాడు.

"ఓకె. మీ సహాయం పొందాక నేను మీ భార్యని చంపడానికి ముందుకు రాకపోతే?"

"ఆ అనుమానం నాకూ వుంది. కాని ప్రయత్నం చేయటంలో నష్టం లేదుగా? ఐ వాంట్ టు టేక్ ఏ ఛాన్స్.. కాని మీ భార్యని హత్యచేసే విషయంలో డైరెక్ట్‌గా నేను మీకు సహాయపడను. ఒకవేళ మీ నేరం రుజువయితే నన్ను పోలీసులు పట్టుకోని పద్ధతిలోనే మీకు నేను సహాయపడేది."

"ఆల్‌రైట్. ఇందాకే చెప్పానుగా మీకు భయం అని. ఆలోచిస్తాను."

"ఏమిటి? మీ భార్యని హత్యచేయాలా వద్దా అనా?"

"కాదు. అందుకు పథకం గురించి."

2

"అదీ సంగతి" చెప్పాడు శివజ్ఞానం విశాలరావుకి వారంరోజుల తర్వాత క్లబ్‌లో మళ్ళీ కలుసుకుని.

విశాలరావు కాసేపు ఆలోచిస్తూండిపోయాడు శివజ్ఞానం వేసిన పథకం గురించి.

"మీరెవరి కంటయినా పడితే?" అడిగాడు.

శివజ్ఞానం చిన్నగా నవ్వి చెప్పాడు.

"అవకాశం లేదు. అసలు ఇంటినించి బయటకి రానుగా నేను."

"థియేటర్ దగ్గరకే రారా?"

"ఊహూ. మీరు ఫస్ట్‌షో టిక్కెట్ ఒకటి కొని ఆ కౌంటర్ ఫాయిల్ నా కివ్వాలి."

"అంటే రాత్రి మీ ఇంటికి రావాలా నేను?"

శివజ్ఞానం కొద్దిసేపు ఆలోచించాడు.

"ఇలా చేద్దాం. పకడ్‌బందీగా వుండాలి ప్లాన్. మీరు పోలీసులకి నేను చెప్పిన విధంగా చెప్పాలి. ఏమాత్రం పొరబడకూడదు. చిన్న విషయంలో తేడా కనబడితే చాలు. నన్ను వురికంబం ఎక్కించిన వారవుతారు...." శివజ్ఞానం



మరోసారి తన ప్లాన్‌ని వివరించాడు విశాలరావుకి.

అంతా విన్నాక విశాలరావు అడిగాడు.

"కేవలం హత్యాసమయంలో ఎలిబీకోసమేనా మీరు నన్ను ఈ విషయంలో వాడుకునేది?"

"కరెక్ట్. నేను చెప్పిందాంట్లో అతి చిన్న విషయంలో మీరు పప్పులో కాలు వేసినా నా ఎలిబీ పటాపంచలయి పోతుంది. కాబట్టి జాగ్రత్తగా గుర్తుంచుకోండి."

"కాపీ రాసుకోనా?"

"వద్దు. ప్రమాదం."

"రాసుకుని రాత్రి ఆ టైం దాటాక కాల్చేస్తాను."

"వద్దు. నాలుగు పాయింట్లేగా మీరు గుర్తుంచుకో వాల్సింది. అవేమిటో ఓసారి చెప్పండి."

ఆ నాలుగు పాయింట్లు అప్పచెప్పాడు విశాలరావు. తృప్తిగా నిట్టూర్చి అన్నాడు శివజ్ఞానం.

"గుడ్."

చిన్నగా దగ్గాడు విశాలరావు.

"ఏమిటి మీ అనుమానం?" రావిచెట్టు నీడలో కూర్చున్న శివజ్ఞానం అడిగాడు విశాలరావుని, లేచి నిలబడి.

"మీ ప్లాన్ విన్నాక మిమ్మల్ని బ్రహ్మదేముడు కూడా పట్టుకోలేడనిపిస్తోంది."

"అనే అనుకుందాం. కాని కొన్ని వందల డిటెక్టివ్ కథలు చదివాక అనిపిస్తూంటుంది అప్పుడప్పుడు, ఇంత వరకు ఆ కథల్లో ఎక్కడా ఏ రచయితలు రాయని ఏదో లోపం దొర్లి పట్టుబడతానేమోనని."

భయంగా చూసాడు విశాలరావు.

చిరునవ్వు నవ్వాడు శివజ్ఞానం.

"అలా జరగదు. జరగనివ్వను."

"ఐ విష్ యు ఆల్ ది బెస్ట్....పట్టుబడరు మీరు. ఆ తర్వాత నా భార్యని ఎన్ని వారాల్లో మట్టుబెడతారు?" అడిగాడు ఆశగా.

"ముందర ఇది కానివ్వండి."

అనుమానంగా చూసాడు విశాలరావు. శివజ్ఞానం ఆయన అనుమానం గ్రహించి నవ్వి చెప్పాడు.

"మీ భార్య హత్యగురించి మనం ఇప్పుడే ఆలోచించడం మొదలుపెడితే ఇది చేయలేను."

"మిమ్మల్ని నమ్ముతున్నాను" విశాలరావు కంఠంలో విచారం తొంగిచూపింది. "నమ్మే ఈ సహాయం చేస్తున్నాను. నా భార్య చస్తే కాని నేను ఆ స్తిలో ఒక్క పైస కూడా ఖర్చు చేయలేను. ఇప్పటికే నలభై అయిదు దాటింది. అంటే జీవితంలో దాదాపు ముప్పావువంతు ఖర్చయిపోయింది. మిగతా జీవితమయినా దర్జాగా గడపా

అని నా కోరిక."

"మీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది."

"థాంక్స్."

"రేపు రాత్రే."

"అవును."

"నేను మళ్ళీ మీకు కనబడేది ఎల్లుండి వుదయమే."

"గుర్తుంది మీరు చెప్పిందంతా. రేపు వేసే కొత్తసినిమా ప్రింట్స్ ఇందాకే డెలివరీ తీసుకున్నాను. ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమా...."

"డయల్ 'ఎమ్' ఫర్ మర్డర్. ఇదివరకు మద్రాస్‌లో చూసాను."

3

శివజ్ఞానం వుదయం తొమ్మిదిన్నరకి ఇంట్లోంచి బయటకి వచ్చాడు. అతని వెనకే అతని భార్య వరూధిని అలవాటుగా గుమ్మందాకా వచ్చింది.

"ఇవాళ తొందరగా వస్తారా?" అడిగింది.

"ఏం?"

"ఈశ్వర్ మహల్‌లో కొత్త సినిమా వచ్చింది. చూద్దాం."

"ఏమిటది?" అడిగాడు.

"డయల్ 'ఎమ్' ఫర్ మర్డర్."

"సారీ వరూ. ఇవాళ ఆలస్యంగా వస్తాను. ఆఫీస్‌లో పనుంది. రేపెళదాం."

"మీ ఇష్టం."

శివజ్ఞానం ఆఫీసుకి వెళ్ళాడు. సాయంత్రం అయిదుదాకా మామూలుగా పనిచేసాడు. ఇంక కొద్ది గంటల్లో తన భార్యని హత్య చేయబోతున్నాడు. మనసంతా ఆందోళనగా

వుంది. బయటికి మాత్రం మామూలుగా కనపడే ప్రయత్నం చేసాడు.

అకౌంటెంట్‌ని లంచ్ అవర్‌లో పదిరూపాయలు అప్పడిగాడు.

"దేనికి?" అడిగాడాయన.

"ఈశ్వర్ మహల్‌లో కొత్త సినిమా వచ్చింది. చూద్దామని."

"లేదు."

శివజ్ఞానానికి తెలుసు ఆ సమాధానం వస్తుందని.

ఇంకో స్నేహితుడిని అడిగాడు. అయిదు మాత్రమే ఇచ్చాడతను.

అయిదుంపావుదాకా ఆఫీసులోనే వున్నాడు. బయటకి వచ్చి చీకటి పడేదాకా కాలవగట్టున గడిపాడు ఎవరికంటా పడకుండా. తర్వాత ఇంటివైపు నడవసాగాడు చకచకా.

పావు గంటలో ఇంటికి చేరుకున్నాడు. సందు మొదట్లో వున్న లైటు స్థంభానికున్న లైటు వెలగడంలేదు చాలా రోజులుగా. శివజ్ఞానికి తెలుసు పక్కన వుండే ఇంట్లో వాళ్లు పెండ్లికి విజయవాడ వెళ్ళటంవల్ల ఆ ఇల్లు తాళంపెట్టి వుంటుందని, ఎదురుగా సిమెంట్ గొడౌన్స్ వున్నాయి. ఆ సమయంలో ఎవరూ వుండరు అక్కడ.

తలుపు లోపల గడియ వేసుకుంది వరూధిని ఎప్పటిలాగానే.

తలుపు తట్టాడు శివజ్ఞానం. కొన్ని క్షణాల్లో తలుపు తెరిచింది వరూధిని.

నవ్వుతూ లోపలకి అడుగువేసాడు శివజ్ఞానం.

"విడకులివ్వవు. నీ వుబ్బస రోగంవల్ల నా జీవితమంతా

అడవికాచిన వెన్నెల—అలాగే అంటారా—అవుతోంది వరూ. నిన్ను చంపబోతున్నాను." చెప్పాడు నవ్వుతూనే.

4

"యస్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని చూసి. అతని మొహంలో ఆందోళన తాలూకు ఛాయలు కనపడుతున్నాయి.

"నా భార్య.... నా భార్య...."

ఏడుస్తున్నాడు వెక్కి వెక్కి.

"కూర్చోండి ముందర."

అతను నిలబడలేక కుర్చీలో కూలబడిపోయాడు భయంతో వణకుతూ.

"మీ పేరు?"

"శివజ్ఞానం."

"శివజ్ఞానం. అసలేం జరిగిందో వివరంగా చెప్పండి.... మీ భార్య? కనబడటం లేదా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్.

"చచ్చిపోయింది."

"ఎలా?"

"ఎవరో కత్తితో చంపారు."

"హత్య చేయబడిందా?"

"అవును. మీరు రావాలి...."

ఏడుస్తున్న శివజ్ఞానం వంక జాలిగా చూసాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్. లేచి నిలబడి అన్నాడు.

"పదండి."

పది నిముషాల్లో ఇంద్రనీల్ పోలిస్ జీప్‌లో శివజ్ఞానం ఇంటికి చేరుకున్నాడు. దారిలో శివజ్ఞానాన్ని ఏ ప్రశ్నలు అడగలేదు ఏడుస్తూండటంతో.

ఇంటి బయట పదిమందిదాకా గుమిగూడి వున్నారు. వీధి గుమ్మం తలుపు బయట గొళ్ళెం పెట్టబడి వుంది.

"రండి. లోపలకి యెవరూ వెళ్ళకూడదని నేనే గడియ పెట్టాను" శివజ్ఞానం వీధి గుమ్మం గొళ్ళెం తీసి లోపలకి నడిచాడు.

ముందుగదిలో నాలుగు కుర్చీలు తప్ప మరేం లేవు. లోపల గది బెడ్‌రూంగా గుర్తించాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్ర నీల్. ఓ యువతి శవం మంచంమీద అడ్డదిడ్డంగా పడి వుంది. కంఠం ముప్పాతికవంతు పైగా తెగివుంది. తల వెనక్కి తిరిగి వుంది. రక్తం కారి, కంఠం దగ్గర, పరుపు మీద గడ్డకట్టి వుంది.

"పేరు?" అడిగాడు ఇంద్రనీల్ ఆ శవాన్ని నిశితంగా చూస్తూ.

"వరూధిని?"

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ పరీక్షగా చూసాడు ఆ గది వంక. బీరువా తలుపు తెరచి వుంది. ఎవరో లోపల వెతి కిన గుర్తుగా బట్టలన్నీ చిందరవందరగా వున్నాయి.

"నగలన్నీ పోయాయి. వరూధిని మెడలో ఆరుకాసుల గొలుసుకూడా మాయమయింది.పట్టుచీరలన్నీపొయ్యాయి."

"డబ్బుకోసం ఈ హత్య జరిగినట్లుంది."

"రాస్కెల్. డబ్బుతీసుకుని వెళ్ళకుండా వాడు.... వాడు"

"ఉద్రేకపడకండి. వాడెవరో మీకు తెలుసా?" అడిగాడు ఇంద్రనీల్.

"ఊహూ. నిన్న రాత్రి, మొన్న రాత్రి ఎవరో వీధి తలుపు కొట్టి పారిపోయారు. తలుపుతీసి చూస్తే మనుషులు కనపడలేదు. వాడే అయివుండాలి."

"ఏం జరిగిందో వివరంగా చెప్పండి."

"ఉదయం మామూలుగానే ఆఫీస్‌కి వెళ్ళాను. సాయంకాలం ఆఫీస్‌నించి సరాసరి ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమా 'డయల్ ఎమ్ ఫర్ మర్డర్'కి వెళ్ళాను. అది చూసి...."

"ఏ థియేటర్‌లో ఆడుతోంది?"

"ఈశ్వర్ మహల్."

"కేరీ ఆన్. ఎన్ని గంటలకి వచ్చారు ఇంటికి?"

"ఎనిమిదిన్నర .... ఎనిమిదీ నలభై కనుకుంటాను సినిమా విడిచిపెట్టారు. నడిచే వచ్చాను. తొమ్మిదీ ఇరవై కి వచ్చి వుండచ్చు. సరిగ్గా చెప్పలేను టైం. తలుపు దగ్గరకి వేసి వుంది. లోపలకి వచ్చి చూస్తే...."

శివజ్ఞానం కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"తర్వాత నా దగ్గరకి వచ్చారా?"

"ఊహూ. వెనకవుండే వాళ్ళని పిలిచాను. వాళ్ళే మీ దగ్గరకి వెళ్ళమని పంపించారు....నా వరూధిని...."

శివజ్ఞానం భార్యని తన స్వహస్తాలతో చంపినా, అఘై

మరణం జరిగి కొద్ది గంటలే అవడంతో ఆమె కోసం నిజంగా ఏడుస్తున్నాడు. హంతకుడయినా, అతనిలో కూడా మానవత్వం వుంది.

ఇన్ స్పెక్టర్ ఇంద్రనీల్ శవం దగ్గరకి వెళ్ళి వేలితో వంటిని ముట్టుకుని చూసాడు. రెండు గంటల క్రితం ఆ హత్య జరిగి వుండచ్చని షుమారుగా అంచనా వేసాడు.

వరూధిని పక్కనే నీళ్ళ గ్లాసు నేలమీద పడివుంది. అందులోంచి మంచినీళ్ల నేలమీదకి వలికివున్నాయి.

"ఎవరో వచ్చి తలుపు కొడితే మీ ఆవిడ తలుపు తెరచి వుంటుంది. మంచినీళ్ల అడిగివుంటారు. వంటగదిలోకి వెళ్ళి గ్లాసులో నీళ్ల తీసుకు వచ్చేసరికి ఆ తలుపు కొట్టినవాళ్ల ముందుగదిలోంచి ఈ గదిలోకి వచ్చి ఆవిడమీద కలియబడి వుంటారు. చేతిలో గ్లాసు కిందపడింది. నీళ్ల వలికాయి. ఆ తర్వాత...."

శివజ్ఞానం కళ్ల తుడుచుకున్నాడు.

ఇంద్రనీల్ శివజ్ఞానంతో ముందుగదిలోకి వచ్చాడు. తననో కుర్చీలో కూర్చుని శివజ్ఞానాన్ని కూర్చోమని సైగ చేసాడు.

"మీరు ఆఫీస్‌నించి వెళ్లినప్పటినుంచి ఇక్కడికి వచ్చే దాకా జరిగింది వివరంగా చెప్పండి. మీరు చెప్పింది నేను రాస్తుంటాను. తర్వాత మీరు సంతకం పెట్టాలి. అంటే మీనుంచి స్టేట్ మెంట్ వ్రాతపూర్వకంగా తీసుకుంటున్నానన్న మాట."

ఇంద్రనీల్ ఓ అరటావు కాగితంమీద రాయసాగాడు.

"ఆఫీస్‌నించి సరాసరి ధియేటర్‌కి వెళ్లాను" చెప్పాడు శివజ్ఞానం.

"అలాకాదు. పేరు చెప్పండి. పూర్తి వివరాలు కావాలి.

రిషాలో వెళ్లారా?"

"ఊహూ. ఆఫీస్‌నుంచి అయిదుంపావుకి బయటకి వచ్చాను. నడిచే థియేటర్‌కి చేరుకున్నాను. నలభై నిము షాలసేపు నడిచివుంటాను కనీసం. మూడు రూపాయల టిక్కెట్ కొన్నాను...."

"కౌంటర్‌ఫాయల్ మీ జేబులో వుందా?"

"లేదు. బయటకు వచ్చాక దాన్ని మడిచి....నాలుగు మడతలుచేసి....వెయింగ్ మెషన్ స్లాట్‌లో వేసాను. పది పైసలకి చుట్టి."

"ఎందుకలా చేసారు?"

"అదో సరదా. ఎప్పుడూ అలా చేస్తూంటాను."

"చెప్పండి. ఆ సినిమా ఇదివరలో ఎప్పుడయినా చూసారా?"

"లేదు. కథ చెప్పనా టూకీగా?"

"చెప్పండి తప్పులేదు."

"ఓ భార్య ఓ భర్త వుంటారు. భర్త ఓ హంతకుడిని బ్లాక్‌మెయిల్‌చేసి తన భార్యని చంపడానికి పురమాయిస్తాడు. భార్యని హత్య చేయించడానికి కారణం ఆ అమ్మాయికి మరెవరితోనో సంబంధం వుంటుంది. క్లబ్‌నించి ఓ నిర్ణీత సమయానికి భర్త భార్యకి ఇంటికి ఫోన్ చేస్తాడు. ఆవిడ ఫోన్ దగ్గరకి రాగానే ముందరే అక్కడ దాక్కున్న హంత కుడు ఆవిడని చంపాలి. కాని ఆవిడే అతన్ని చంపేస్తుంది. ఆ సంగతి భర్తకి ఫోన్‌లో చెప్తుంది...."

ఇన్‌స్పెక్టర్ ఇంద్రసీల్ కథ పూర్తిగా స్టేట్‌మెంట్‌లో రాసాక అడిగాడు.

"ఆఖరి దృశ్యం ఏమిటో గుర్తుందా?"

"ఆ హంతకుడిని పురమాయించిన భర్తని పట్టుకున్న

డిటెక్టివ్ గర్వంగా దువ్వెన తీసి మీసం దువ్వుతుంటాడు."

"కాబట్టి మీకు బలమయిన ఎలిబీ వుంది. ఐయామ్ సారీ. అనుమానించడం మా వృత్తిలో ఓ భాగం."

"నన్ను అనుమానించారా?" వులికిపాటుగా అడిగాడు శివజ్ఞానం.

"తప్పదు" నవ్వాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్.

"ఇందాక ఓ సంగతి చెప్పటం మరచాను. ప్రొజెక్షన్ ఆపరేటర్ పొరపాటున మొదటిరీలు అయాక రెండోదివేయ బోయి మూడవది వేసాడు. రెండుమూడు నిముషాల తరువాత పొరబాటు గ్రహించి మూడో రీలు ఆపి రెండో రీలు వేసాడు."

ఆ సంగతి స్టేట్‌మెంటులో రాసాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్.

శివజ్ఞానానికి తెలుసు విశాలరావు ఆ విధంగా చేసి వుంటాడని. ముందరే చెప్పాడు తను. ఇలాంటి పాయింట్లే నమ్మకాన్ని కలిగిస్తాయి.

"తర్వాత యింటికి నడిచే వచ్చాను. తలుపు దగ్గరకు వేసివుంది. నా భార్య శవం బెడ్‌రూంలో పరుపుమీద వుంది. గట్టిగా కేకవేస్తూ బయటకు వచ్చాను."

"గుడ్, ఇక్కడ సంతకం పెట్టండి."

శివజ్ఞానం, ఇద్దరు సాక్షులు స్టేట్‌మెంటుమీద సంతకం చేసాక చెప్పాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ శివజ్ఞానంతో.

"మైడియర్ యంగ్ ఫెలో. యువార్ అండర్‌అరెస్ట్."

శివజ్ఞానం మొహం మరుక్షణం పాలిపోయింది. కత్తి వాటుకు నెత్తురు చుక్కలేదు.

"దేనికి?" అడిగాడు వణికే కంఠంతో.

"వరూధినిని హత్య చేసినందుకు."

"డామిట్. నేనుకాదు."

"మీరు ఇవాళ ఫస్టుషో సినిమాకి వెళ్ళలేదు. ఎందుకు అబద్ధం చెప్పారు?"

"వెళ్లాను. ఆ రీలు పొరబాటున...."

"మీరు చెప్పినదంతా తు.చ. తప్పకుండా కరక్టే. ఇవాళ రీలు పొరబాటుపడింది. అయినా మీరు అబద్ధం చెప్పారు."

"దేముడి తోడు. ఈశ్వర్ మహల్‌లో ఇవాళ...."

"మీరు ఆ సినిమా ఇదివరకు చూడలేదన్నారు?"

"నిజం."

"మరి పూర్తికథ యెలా చెప్పగలిగారు?"

"ఇందాకే చూసాను కాబట్టి."

"ప్రొజెక్షన్ ఆపరేటర్ మీ స్నేహితుడా?"

"....అవును."

"ఐసీ....ఈశ్వర్ మహల్‌లో నిన్న మీరు కొన్న టిక్కెట్ కౌంటర్‌ఫాయిల్ వెయింగ్ మెషన్‌లో వుండచ్చు పది పైసలికి చుట్టి. కాని దాన్ని మీరు వుపయోగించి ఆ థియేటర్ లోకి వెళ్లారో లేదో తేలికగా కనుక్కోవచ్చు."

"ఎలా?"

నవ్వాడు ఇంద్రనీల్.

"మూడు రూపాయల క్లాస్‌లోని గెట్‌కీపర్ గుమ్మం దగ్గర చింపి మీకు కౌంటర్ ఫాయిల్ యిస్తే, ఆ రెండో సగం యివాళ ఫస్టు షోలో అతను కలెక్టుచేసిన వాటితో పాటు వుండాలి. చెక్ చేస్తాను."

శివజ్ఞానం నాలిక కొరుక్కున్నాడు. తను ఆ సంగతే మర్చిపోయాడు. తన దగ్గర కౌంటర్‌ఫాయిల్ వుండాలను కున్నాడు గాని థియేటర్ వాళ్లదగ్గర వుండాలన్న సంగతి మరిచిపోయాడు....కాదు అసలు ఆలోచించలేదు,

"వాళ్లు పారేస్తే అందుకు నేనా బాధ్యుణ్ని?"

"కాని మీ స్టేట్ మెంటులో ఓ ముఖ్యమయిన పొరబాటు దొర్లింది. మీరు ఆడిన అబద్ధం పట్టించింది మిమ్మల్ని."

"ఏమిటది?"

"మూడోరీలు అసలు చూపించనే లేదు."

"ఆ?"

"అవును. పొరబాటున బాక్సులో మూడోరీలు రాలేదు. సాధారణంగా ఇంగ్లీష్ సినిమా యెవరికీ అర్థంకాదు కాబట్టి థియేటర్ వాళ్ళు అలాగే చూపించారు మేట్నీ, ఫస్టు షో"

శివజ్ఞానం ఇదివరకు తను చదివిన కథల్లో డిటెక్టివ్‌కి దొరికిన హంతకుడిలా కుప్ప కూలిపోలేదు.

తెల్లబోయి చూసాడు.

"మూడోరీలు చూపించక పోయినా అందులో కథ ఎలా చెప్పగలిగారు మీరు?ఇదివరలో ఆ సినిమా మీరు చూసారు. నగరంలో ఆఖరిసారి ఎప్పుడు వచ్చిందో విచారిస్తే మీరు చూసి యెంతకాలమయిందో తెలుస్తుంది."

"మీకెలా తెలుసా సంగతి?" అడిగాడు శివజ్ఞానం.

"నేను ఫస్టుషోకి అదే సినిమాకి—అంటే, 'డయల్ ఎమ్ ఫర్ మర్డర్'కి వచ్చాను కాబట్టి. చూసాను కాబట్టి."

శివజ్ఞానం అస్పష్టంగా అన్నాడు.

"అవును, మిమ్మల్ని చూసాను."

"ఏనీవే థాంక్స్. ఆ కథ అర్థంగాక దాని గురించే ఆలోచిస్తున్నాను. మీవల్ల ఇప్పుడా చిత్రం పూర్తిగా అర్థమయింది. ప్లీస్...."

చిన్నగా నవ్వి పూర్తి చేసాడు.

"నేను సాల్వుచేసిన మర్డర్ కేస్ సంఖ్య మరొకటి పెరిగింది." □

ముకటాల వేట

యం. దుర్గావళి

టూటౌన్ పోలీస్ స్టేషన్‌లోకి సరాసరి వచ్చేసిందా స్త్రీ.

ఎదురుగావున్న ఇన్‌స్పెక్టర్ సత్యానంద్‌కి నమస్కారం చేసింది.

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు సత్యానంద్.

"మీరు ఏం పనిమీద వచ్చారు?"

"నాపేరు వర్ధనమ్మ. సాగర్ టాకీస్ వెనుకవీధిలో వుంటున్నాము. మావారు మెయిన్ బజారులో వున్న నాదిరా అండ్ నాదర్షా కంపెనీలో వుద్యోగం చేస్తున్నారు. నిన్న వుదయం ఆఫీసుకు వెడుతూ సాయంత్రం సినిమాకి వెడదా మని, ఐదుగంటలకల్లా వచ్చేస్తాననీ చెప్పారు. కానీ ఆరు గంటలు దాటినా మనిషి జాడలేదు. వేరే పనిమీద ఏమైనా వెళ్లారేమో అనుకున్నాను. ఆయన రాత్రంతా యింటికి రాలేదు. ఇవాళ వుదయంనుంచి ఇప్పటిదాకా యెదురు చూసాను. కానీ వారు ఇంతవరకూ రాలేదు. నిన్నటినించి ఆయన కన్పించటంలేదు" అంది గద్గద స్వరంతో.

వర్ధనమ్మ వయసు ముప్పయ్యారు సంవత్సరాలు వుంటాయి. మనిషి నల్లగా లావుగా మోటుగా వుంది. ఏదో నేతచీర కట్టుకుంది. మెడలో పసుపుతాడు తప్ప ఏం లేవు. మాటమాత్రం గట్టిగా యెదుటి మనిషిని కొట్టేటట్లు మాట్లాడుతుంది. తెలియని వాళ్ళయితే పోట్లాడుతోంది కాబోలు అనుకుంటారు.

"బహుశా ఏదయినా అర్జంటు పని తగిలి ఊరు వెళ్ళా రేమో?" అన్నాడు సత్యానంద్.

"ఆయన నాతో చెప్పకుండా యెప్పుడూ యెక్కడికీ వెళ్ళరు. పైగా నిన్న సాయంకాలం ఆరుగంటలకి ఆయన కోసం ఎదురింట్లో వారి ఆఫీసుకి ఫోన్ చేసాను. ఆయన ఆఫీస్ ప్యూన్ చేత కొత్త సినిమాకి టిక్కెట్లు తెప్పించి ఆయిదు గంటలకే ఆఫీసునుంచి బయలదేరారట."

"మీవారి పేరు ఏమిటి?"

"సుందర్రావుగారు."

"వయసెంత?"

"నలభై సంవత్సరాలు వుంటాయి."

"మనిషి యెట్లావుంటారో చెప్పగలరా?"

సుందర్రావును వర్ణించి చెప్పింది వర్ధనమ్మ.

"చిన్న వుదయం మీరు, మీవారు ఏదయినా మాటా మాటా అనుకున్నారా?"

"లేదు. మేం అసలు ఎప్పుడూ పోట్లాడుకోము. ఇంత వరకూ యెప్పుడూ అలా జరగలేదు," అంది వర్ధనమ్మ.

"మీ వారికి స్నేహితులు ఎవరయినా వున్నారా?"

"ఆయనతో పనిచేసే శ్రీనివాసులు అనే ఆయన తప్ప ఇంకెవరూ స్నేహితులు లేదు."

"శ్రీనివాసులు ఎలాంటి మనిషి?" అన్నాడు సత్యానంద్.

"ఏమో నాకు తెలియదు. ఎందుకంటే మావారి నోటి వెంట ఆయన పేరు వినటమే కానీ ఆయన్ని యెప్పుడూ చూడలేదు" అంది వర్ధనమ్మ.

"మీవారి ప్రవర్తన ఎటువంటిది. అంటే ఎవరిమీద నయినా అతిగా కోపగించుకోవటంకానీ, అతి మంచితనం చూపించటం కానీ...."

"అలాంటివేం లేవు. ఆయన పని ఆయనది తప్ప ఇతరుల విషయంలో జోక్యం కల్గించుకోరు."

"సుందర్రావుగారికి శత్రువులు ఎవరయినా వున్నారా?"

"మా పెళ్ళయి పది సంవత్సరాలు అయింది. అప్పటి నుంచీ చూస్తున్నాను, ఆయనకి శత్రువులు అంటూ ఎవరూ లేరు," అంది వర్ధనమ్మ భారంగా నిట్టూరుస్తూ.

"సరే మీరు రిపోర్టురాసి, ఇచ్చి వెళ్ళండి" అన్నాడు సత్యానంద్.

వర్ధనమ్మ రిపోర్టురాసి, సత్యానంద్‌కి అడ్రస్ యిచ్చి

నమస్కారంచేసి వెళ్ళిపోయింది.

"ఈవిడ భర్త యెవరో కాని చాలా అదృష్టవంతుడు," అన్నాడు హెడ్ కానిస్టేబుల్ నాయుడమ్మ.

"ఏం అలా అంటున్నావ్," అన్నాడు సత్యానంద్.

"ఈవిడ నోటి వాడికి జడిసిపోయి సన్యాసం పుచ్చుకుని వుంటాడు" అన్నాడు నవ్వుతూ.

"కొందరి మాటతీరే అంత. అంత మాత్రంచేత వాళ్ళని రాక్షసులుగా అంచనా వేయకూడదు" అంటూ కోప్పడ్డాడు సత్యానంద్.

దాంతో నోరు మూసుకోక తప్పలేదు నాయుడమ్మకి.

2

సాయంత్రం సుందర్రావ్ పనిచేసే కంపెనీకి వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్ సత్యానంద్.

మేనేజర్ని కల్సుకున్నాడు.

"మీ దగ్గర పనిచేసే సుందర్రావ్ యెలాంటి వాడు?" అంటూ ప్రశ్నించాడు.

"ఆయన మా కంపెనీలో పదిసంవత్సరాలుగా పని చేస్తున్నాడు. మనిషి నెమ్మదయిన వాడు, మంచివాడు. వర్క్ విషయంలో చాలా సిన్సియర్. ఏం అలా అడుగుతున్నారు?" అన్నాడు మేనేజర్.

"నిన్న సాయంత్రం నుంచీ ఆయన కన్పించటం లేదని ఆయన భార్య వర్ధనమ్మ పోలీస్ రిపోర్టు ఇచ్చింది" అని చెప్పాడు సత్యానంద్.

"మైగాడ్! కన్పించక పోవటం ఏమిటి? తప్పిపోవటానికీ, పారిపోవటానికీ అతనేమైనా చిన్నపిల్లవాడా? ఈ రోజు రాకపోతే సెలవు పెట్టాడేమో అనుకున్నాను" మేనేజరు అన్నాడు ఆశ్చర్యపోతూ.

"అదే నాకూ అర్థంకావటంలేదు. సుందర్రావు నిన్న సాయంత్రం మీ ఆఫీసునుంచి ఎప్పుడు బయలుదేరాడో చెప్పగలరా?"

"మాది పేరుకి ప్రయివేట్ కంపెనీయే అయినా గవర్న మెంటు ఆఫీసుతో సమానంగా అయిదుగంటలకే మూసి వేయటం జరుగుతుంది. కంపెనీ టైమింగ్స్,వర్కు అంతా పంచ్యుయల్‌గా వుండాలి. నేను నిన్న సాయంత్రం బేంక్ పనివుండి మూడున్నరకే బయటకి వెళ్ళాను. పనిచూసు కుని అటునుంచి అటే ఇంటికి వెళ్లిపోయాను. అందు వల్ల ఎప్పుడు బయలదేరిందీ నాకు తెలియదు," అంటూ ప్యూన్ యాదయ్యని పిలిచాడు.

"నిన్న సాయంత్రం సుందర్రావుగారు ఇంటికి బయల దేరేటప్పటికి టైం యెంతయింది?"

"పది నిమిషాలు తక్కువ ఐదుగంటలు అయిందండీ. నిన్న సినిమాకు పోవాలని నా చేత టిక్కెట్లు తెప్పించు కున్నారండీ. నేను తీసుకురాగానే ఎల్లిపోయారండీ," అన్నాడు యాదయ్య.

"నువ్వు అప్పుడు అక్కడే వున్నావా?"

"లేదండీ. ఆ ఎంటనే నేను టైపిస్టుగారికి కాఫి తేను పోయానండి."

సుందర్రావు పక్కసీట్లో పనిచేసే శ్రీనివాసుల్ని పిలిచి అడిగితే యాదయ్య దగ్గర టిక్కెట్లు తీసుకుని వెంటనే వెళ్ళిపోయినట్లు చెప్పాడు.

మిగిలిన గుమాస్తాల దగ్గర మరికొన్ని వివరాలు అడిగి తెల్సుకున్నాడు సత్యానంద్.

"సరే అవసరం అయితే మళ్లీ కలుస్తాను. సుంద

(రావుగారు కనుక వచ్చేస్తే నాకు తెలియచేయండి" అంటూ బయటకి వచ్చేసాడు ఇన్స్పెక్టర్ సత్యానంద్.

బయటకి వచ్చాక గేటుదగ్గరున్న గూర్ఖాను సుంద రావు విషయమై ప్రశ్నించాడు.

"సుందర్రావ్ సాబ్ పోయిన టైమ్ నహీ మాలూమ్. ఆ సాబ్ అటుపోయిన ఐదునిమిషాల తర్వాత స్టాఫ్ అంతా వెళ్లిపోయారు" అన్నాడు.

అంటే అయిదు నిమిషాలు తక్కువ అయిదు అయి వుండాలి.

"వెళ్లేముందు ఆయనకోసం ఎవరయినా రావటంకానీ, మాట్లాడటం కానీ జరిగిందా?"

"నై సాబ్....కుచ్ భీ నై" అన్నాడు.

అంతకంటే వివరాలు యేమీ లభించక పోవటంతో వెనుతిరిగి జీప్ యెక్కాడు.

3

"మా నాన్నగారు కన్పించటం లేదండీ," అన్నాడు కిరణ్ దీనంగా.

"మీ నాన్నగారు యెవరు? ఎప్పటినుంచి కన్పించటం లేదు?" అన్నాడు సత్యానంద్ అతన్ని పరికించి చూస్తూ.

అతను ఇరవై సంవత్సరాల యువకుడు. సన్నగా పొడవుగా కాలేజి స్టూడెంటులా వున్నాడు.

"మా నాన్నగారి పేరు విశ్వనాధంగారు. ట్రాన్స్పోర్టు కంపెనీలో పనిచేస్తారు. ఉదయం యెనిమిది గంటలకు వెడితే రాత్రి యేడుగంటలకు ఇంటికి వచ్చేవారు. నిన్న మధ్యాహ్నం పన్నెండు గంటలకు యింటికి వచ్చారు. అర్జంటుగా ఆఫీసు పనిమీద వెడుతున్నాననీ, సరుకు తేవాలనీ వచ్చేసరికి రాత్రి పొద్దుపోతుందనీ చెప్పారు. కానీ



రాత్రంతా ఇంటికి రాలేదు. మాకు చాలా భయం వేసింది. ఈరోజు వుదయం కంపెనీ నుంచి మా నాన్నగారి కోసం మనిషి వచ్చాడు. నిన్న రాత్రి యింటికి రాలేదని చెప్పాం. అతను వెళ్ళిపోయాడు. ఇదివరకు చాలాసార్లు ఇలా వెళ్ళేవారు. కానీ చెప్పిన టైమ్‌కి వచ్చేవారు. ఈసారి అట్లా జరగకపోవటంతో మాకు భయం వేస్తోంది. మా నాన్నగారు యెక్కడికి వెళ్ళారో మీరు యెలాగయినా కనుక్కోవాలి సార్" అన్నాడు కిరణ్ యెర్రబారిన కళ్ళు తుడుచుకుంటూ.

"ఏదయినా అర్జంటు పనివల్ల అటునుంచి అటే వెళ్ళి వుంటారు. బహుశా మీతో చెప్పే అవకాశం ఉండక పోవచ్చు" అన్నాడు సత్యానంద్.

"ఎప్పుడూ ఇలా జరగలేదండీ. పైగా ఆ కంపెనీ తాలూకు మనుష్యులు ఇప్పటికి రెండుసార్లు వచ్చి వెళ్లారు.

నాన్నగారు ఇంకా ఆఫీసుకు రాలేదట. ఆయన వంట్లో బాగుండకపోతే తప్ప ఎప్పుడూ ఆఫీసుకి శెలవుకూడా పెట్టరు."

"మీ నాన్నగారి వయసెంత?" అన్నాడు సత్యానంద్.

"నలభై మూడు సంవత్సరాలు."

"మీ నాన్నగారికి యెవరితో అయినా విరోధముందా?"

"లేదండీ. ఆయన చాలా మంచివారు. ఈ మాట ఇంట్లో బయటా చాలా మంది అంటూ వుంటారు" అన్నాడు కిరణ్.

"ఎవరయినా స్నేహితులతో కలసి వెళ్ళారేమో?"

"మా నాన్నగారికి స్నేహితులు ఎవరూ లేరండి. ఒక రిద్దరు చుట్టుపక్కల వాళ్లు వున్నా ఇంటి దగ్గరే మాట్లాడు కుంటారు."

"మీ ఇల్లు యెక్కడ?"

చెప్పాడు కిరణ్.

"మీ ఇంట్లో యెంతమంది వుంటారు?"

"అమ్మా, నాన్నగారూ, నేను, చెల్లాయి నలుగురము వుంటాము."

మరికొన్ని వివరాలు అడిగాడు సత్యానంద్.

"మీరు రిపోర్టు రాసి ఇచ్చి వెళ్ళండి. నేను కనుక్కుం టాను" అన్నాడు.

సత్యానంద్ చెప్పినట్లే చేసాడు కిరణ్.

"మిస్టర్ కిరణ్, మీ నాన్నగారి ఫోటో ఏదైనా వుందా?"

"సారీ సార్, నేను మీకు ఇద్దామనే తెచ్చాను. కానీ మరిచేపోయాను" అని జేబులోంచి ఫోటోతీసి ఇచ్చి వెళ్ళి పోయాడు కిరణ్.

"ఇదేమిటి సార్, వింత కేసుల్లా వున్నాయి. అడ

పిల్లలు మాయమవటం విన్నాం. కాని ఇక్కడ మాయమైన వారిద్దరూ మగవారు. చిత్రంగా లేదూ?" అన్నాడు నాయుడమ్మ.

"అదే నాకు ఆశ్చర్యంగా వుంది. పైగా వీరు చిన్న పిల్లలు కాదు. వయసులో వున్నవాళ్లూ కాదు. సుందర్రావు మాయమై అప్పుడే మూడురోజులయింది. ఆచూకీ యేం తెలియలేదు. పాపం సుందర్రావు భార్య ఆయన జాడ తెలిసిందేమోనని ప్రతి పూటా స్టేషన్‌కి వచ్చిపోతోంది" అన్నాడు సత్యానంద్ ఆలోచిస్తూ.

4

"ఇలా ఎప్పుడూ జరగలేదు. విశ్వనాధంగారిని యిదివరలో ఇలాంటి పనులమీద చాలాసార్లు పంపాం. ఖచ్చితమయిన మనిషి. అక్కడివారు ఆయన అక్కడకు రాలేదని చెబుతున్నారు. ఆయనతోపాటు రెండువేల రూపాయలు యిచ్చి పంపాం" అన్నాడు మేనేజరు.

"డబ్బూలేదు, సరుకూలేదు, మనిషే పత్తాలేడు" అంటూ కంపెనీలో అంతా చెప్పసాగారు.

"ఇలా ఇదివరలో ఎప్పుడైనా జరిగిందా?" అన్నాడు సత్యానంద్.

"లేదు. మొదట్లో ఆయనకి డబ్బు ఇచ్చి, నమ్మకమైన మనిషిని వెంట పంపేవాళ్ళం. అలా కొన్నిసార్లు జరిగాక చివరికి ఆయన్ని ఒక్కడినే పంపుతున్నాం, మనిషిమీద బాగా నమ్మకం కుదిరాక. కానీ ఇలా జరగటం మాత్రం యిదే ప్రథమ్మం" అన్నాడు మేనేజరు కొంచెం కోపంగా.

"విశ్వనాధంగారు మీ కంపెనీలో చేరి ఎన్నేళ్ళయిందీ?"

"పదకొండు సంవత్సరాలు అయింది. కానీ ఎన్నడూ పనిలోకానీ, డబ్బు విషయంలోకానీ తేడాలు రాలేదు."

"అలాంటి మనిషి ఇప్పుడు డబ్బు తీసుకుని పారిపోయా డంటే మీరు నమ్ముతున్నారా?"

"ఏమో డబ్బు పాపిష్టిది, ఏ క్షణంలో ఏం జరుగు తుందో తెలియదు."

విశ్వనాథం గురించి ఆఫీసులో అంతా తలో రకంగా ఊహాగానాలు చేస్తున్నారు.

"ఆయన మీ కంపెనీలో చేరకముందు ఎక్కడ పనిచేసే వారు?" అన్నాడు సత్యానంద్.

"ఏదో హార్డ్‌వేర్ కంపెనీలో ఐదునెలలు పనిచేశాడట."

"విశ్వనాథంగారు డబ్బు తీసుకుని పరారి అయినట్లు మీరు భావిస్తున్నారా?"

"అలా భావించేందుకు అవకాశాలు కన్పిస్తున్నాయి కదండీ. కనీసం ఇంటికైనా మనిషి వచ్చేవారు. రెండు రోజులుగా ఇంటికే రాలేదు. ఇంట్లోవాళ్ళు ఆఫీసుకి కబురు పెట్టారు. ఒకవేళ డబ్బు పోగొట్టుకున్నా మనిషి అయినా తిరిగి రావాలి. అదీ లేదు. అలాంటప్పుడు ఇలా జరిగిం దంటే అనుమానం రాకుండా ఎట్లా వుంటుంది చెప్పండి?" అంటూ మేనేజరు సత్యానంద్‌నే ఎదురు ప్రశ్నించాడు.

"ఒకవేళ డబ్బు పోగొట్టుకుని, మీరు తనను అపార్థం చేసుకుంటారని భయంచేత దాక్కొని వుండచ్చుగా?"

"ఏమో జరిగినా జరగచ్చు. కానీ ఇదివరలో ఇలాగే విశ్వనాథంగారిని సరుకుతెచ్చే పనిమీద పంపుదాం అను కుంటే ఆయనకి సుస్తీ చేయటంవల్ల ఆ పనికి మరొకర్ని పంపాం. కానీ అతడు డబ్బు పోగొట్టుకున్నాడు. అప్పుడు కంపెనీయే ఆ నష్టాన్ని భరించింది. అందువల్ల దాక్కొని వుంటాడని అనుకోము. ఒకవేళ మీరు అన్నట్లుగా జరిగినా అలా ఎన్నాళ్లు వుండగలడు?"

"పోతే ఎవరైనా ఆ డబ్బుకోసం అతన్ని చావగొట్టి ఎక్కడో పడేసి వుండచ్చు, లేకపోతే ఎక్కడైనా కొంత కాలం బంధించి వుండచ్చు. ఏమంటారు?" అన్నాడు సత్యానంద్.

"మేము ఏ విషయం నిశ్చయంగా చెప్పలేకపోతున్నాం. అలాంటిదేదైనా వుంటే కనుక్కోవల్సిన బాధ్యత మీదే" అన్నాడు మేనేజరు.

"ఆఫీసులో మిగిలిన వాళ్ళద్వారా మరికొన్ని వివరాలు సేకరించాడు సత్యానంద్. కానీ ఆ వివరాలద్వారా విశ్వనాథం ఉనికి తెలియటం లేదు. పోలీస్ జీప్ వెళ్లి విశ్వనాథం ఇంటిముందు ఆగింది.

"మా నాన్నగారి విషయం ఏమైనా తెల్సిందా?" అంటూ వచ్చాడు కిరణ్.

"ఇంకా ఏం తెలియలేదు. ఆ విషయం కనుక్కోటానికే ఆఫీసుకి వెళ్ళి వస్తున్నాను."

"వాళ్లు ఏమంటారు?" అంది నలభై సంవత్సరాల వయసున్న ఆడమనిషి.

"ఈవిడ మా అమ్మగారు, పేరు పార్వతమ్మ" అన్నాడు కిరణ్.

"నమస్కారం" అంటూ అన్ని సంగతులు చెప్పి మరికొన్ని వివరాలు అడిగాడు సత్యానంద్.

ఆఫీసులో వాళ్లు విశ్వనాథం మీద దొంగతనంచేసి పరారి అయినట్లు నేరం ఆరోపించిన విషయం తెలియచేశాడు.

"కాదు....కాదు ఆయన అలాంటివారు కాదు. చాలా నిక్కచ్చి అయిన మనిషి" అంటూ ఏడవటం మొదలు పెట్టింది పార్వతమ్మ.

వాళ్ళకి కాసేపు ధైర్యంచెప్పి జీప్‌ను ఆఫీసువేపు మళ్ళిం

చాడు సత్యానంద్.

మెయిన్‌రోడ్డుమీద యాక్సిడెంట్ జరగటంతో దారిలోనే ఆగిపోయింది పోలీస్ వాహనం.

సరుకుతో నిండిన లారీ రోడ్డుమీద నడిచి వెళ్ళే వ్యక్తి మీద నిర్దాక్ష్యణ్యంగా ఎక్కేసి అతన్ని నామరూపాలు లేకుండా చేసింది.

సత్యానంద్ ఎక్కువసేపు ఆ దృశ్యాన్ని చూడలేక పోయాడు.

చనిపోయిన వ్యక్తి ఎవరయింది ఎవరూ చెప్పలేక పోతున్నారు. రెండుకాళ్ళూ తప్పించి గుర్తుపట్టటానికి మిగిలిన శరీరభాగాలు ఏమీ మిగలలేదు.

యాక్సిడెంట్ చేసిన లారీ డ్రైవర్ని అరస్టుచేసి మిగిలిన వ్యవహారాలన్నీ చూడసాగాడు.

ఉన్నట్లుండి సత్యానంత్ మెదడులో ఏదో ఆలోచన మెరిసింది.

నాయుడమ్మను పిలిచి ఏదో చెప్పి పంపించాడు సత్యానంద్.

మరో పావుగంటకల్లా జనాన్ని తోసుకుంటూ నాయుడమ్మ, అతని వెనుక ఆదుర్దాగా వర్ధనమ్మ ప్రవేశించారు.

"చూడండి వర్ధనమ్మగారూ, ఈయన యెవరో మీరు గుర్తుపట్టగలరా?"

పరీక్షగా చూపింది వర్ధనమ్మ భయంభయంగానే.

కానీ ఒక స్థిరనిశ్చయానికి రాలేకపోయింది.

"మనిషి ముఖం చూడందే గుర్తుపట్టటం కష్టం అనుకోండి. కానీ సుందర్రావుగార్ని నేను చూడలేదు. మీరుగానీ ఈ వ్యక్తిని గుర్తించగలరేమో అని పిలిపించాను."

వర్ధనమ్మ ఎటూ చెప్పలేకపోయింది. రక్తంతో తడిసిన



కాళ్ళను చూపి మనిషిని గుర్తించటం సాధ్యం కాలేదు.

"ఆయన అయి వుండరండీ. ఒకవేళ నాతో చెప్ప కుండా వెళ్ళిన మనిషి, అర్ధాంతరంగా ఇలా రావటం, ఈ లారీకింద పడి చచ్చిపోవటం నమ్మశక్యంగా లేవు. కానీ ఆయన ఇంటినుంచి వెళ్ళిన ఆఖరురోజు మాత్రం పంచె కట్టుకునే వెళ్ళారు" అంది.

అనామకుడి శరీరంమీద పంచెమాత్రం మాసిపోయి, ఇప్పుడు రక్తంతో తడిసిపోయి చీలికలుగా వుంది.

"ఆల్‌రైట్ మీరు వెళ్ళచ్చు" అన్నాడు సత్యానంద్.

5

రోజులు గడిచిపోతున్నాయి.

యాక్సిడెంట్‌లో నలిగి నజ్జయిన శరీరం సుందర్రావుదే అన్న అనుమానం పట్టి పీడిస్తోంది సత్యానంద్‌ని. ఎక్కడే యాక్సిడెంటయినా శ్రద్ధగా గమనిస్తున్నాడు.

ఎందువల్లనంటే యాక్సిడెంటయి ఇన్ని రోజులు గడిచి పోయినా అనామకుడి తాలూకు మనుష్యులుకానీ, మరెవరూ

కానీ ఇంతవరకూ రాలేదు.

రిపోర్టులు ఇచ్చినవాళ్లు, వారి తాలూకు బంధువులు వచ్చి కేసులు యెటూ తేలనందుకు మీ పోలీసులవల్ల ఏం కాదు అని ముఖాన్నే అనేసి పోతున్నారు.

సత్యానంద్‌కి ఏం చేయాలో తోచటంలేదు. ఈ కేసుల సంగతి తల్చుకుంటే మతిపోతోంది. ఎక్కడా చిన్న ఆధారంకూడా కన్పించటంలేదు. డ్రాయరుమీద నుంచి తెల్లకాగితం తీసి రాయసాగాడు.

ఇంతవరకూ మాయమైన మనుష్యులు ముగ్గురు.

1. మొదటి వ్యక్తి సుందర్రావు:— వయస్సు నలభై సంవత్సరాలు. మనిషి మంచివాడు. శత్రువులు ఎవరూలేరు. ఆఫీసునుంచి ఇంటికివస్తూ మాయం అయ్యాడు. యాక్సిడెంట్ అయి మరణించాడేమో అన్నదికూడా కేవలం అనుమానం మాత్రమే. అంతకంటే అతని విషయంలో, అనుమానించతగిన ఆధారాలు ఏం లేవు. అతన్ని ఎవరైనా దాచి వుంచేందుకు తగిన కారణాలు ఏవీ కన్పించటంలేదు.

2. విశ్వనాధం:—వయస్సు నలభై మూడు సంవత్సరాలు. ఇతనూ మంచివాడే. కానీ ఆఫీసు డబ్బు దొంగిలించి యెక్కడో దాక్కున్నాడు అనే అనుమానాన్ని కలుగచేస్తోంది అతను చేసినపని. ఎవరైనా అతన్ని కొట్టి డబ్బు లాక్కుపోయి వుంటే కనీసం దెబ్బలుతిన్న మనిషి అయినా కన్పించి వుండాలి. అటువంటిదేమీ లేదు. కనుక డబ్బు దొంగిలించి పారిపోటానికి ఆస్కారం వుంది. కాబట్టి ఇతని ఉనికి కనుక్కోవటం ముఖ్యం. కానీ సుందర్రావుకీ, విశ్వనాధంకి యెటువంటి స్నేహం లేదు. ఇద్దరూ మాయం అయినా అందుకు కారణాలు వేరువేరుగా వున్నాయి.

3. రామలింగం:—వయస్సు నలభై రెండు సంవత్స

రాలు. భార్యా ముగ్గురు పిల్లలు వున్నారు. ఒకరకంగా వున్న వాడే. బట్టలకొట్టు. ఓరోజు రాత్రి బట్టలకొట్టు మూసి ఇంటికి బైలుదేరాడు. కానీ ఇల్లు చేరలేదు. మనిషి మంచి వాడని పేరు వుంది. రామలింగం చేతిలో కేష్‌బేగ్ దారిలో దొరికింది. దాంట్లో కరెన్సీ మాత్రం, యెకౌంట్ పుస్తకాల ప్రకారం చూస్తే ఒక్క పైసా తేడా లేకుండా కరెక్టుగా వుంది. రామలింగం మాయం కావటానికి కారణం డబ్బు మాత్రం కాదని తేలుతోంది.

సుందర్రావు, రామలింగం ఒకే రకంగా మాయం అయ్యారు. విశ్వనాథం తీరు వేరుగా వుంది. వీళ్ళ ముగ్గుర్నీ యెవరు మాయం చేశారు? లేకపోతే చెప్పా పెట్టకుండా ముగ్గురూ యెక్కడికి పోతారు? ఎవరైనా ముగ్గుర్నీ యెత్తుకుని పోయారా? ఏదైనా అదృశ్యశక్తి మాయం చేపిందా? అసలు పరిశోధన యెక్కడినుంచి ప్రారంభించాలి?

ముగ్గురు వ్యక్తులూ మాయం అయినప్పటినుంచీ ఊళ్లో జరిగిన యాక్సిడెంట్స్ గురించి విచారిస్తూనే వున్నాడు. కానీ వాటికి, ఈ ముగ్గురు వ్యక్తులకీ పోలికలు కన్పించటలేదు. పైగా వాళ్ళ తాలూకు మనుష్యులు వారిని గుర్తించటం జరిగిపోయింది.

అతను ఆలోచనల్లో సతమతం అవుతుండగానే హెడ్ కానిస్టేబుల్ నాయుడమ్మ నురుగులు కక్కుకుంటూ, పరుగులు పెడుతూ వచ్చాడు.

"ఏమిటి, ఏం జరిగింది?" అంటూ ప్రశ్నించాడు సత్యానంద్.

"సార్, భౌ....భౌ....భౌ...." అంటూ అరిచాడు ఆయాసపడుతూ.

"ఏమిటి....ఏమిటి నాయుడూ, కుక్క అరుపు చేస్తున్నా

వేమిటి?" అన్నాడు సీరియస్‌గా అతనివంక చూస్తూ.

ఒక్క క్షణ ఆగమన్నట్లు సైగచేసి కూజాలో నీళ్లు వంచుకుని మూడు గ్లాసులు గటగటా త్రాగేసి ఐదు నిముషాలు ఊపిరి పీల్చుకుని చెప్పటం మొదలుపెట్టాడు, నాయుడమ్మ.

"సార్ ఆ సుందర్రావు కుక్కగా మారిపోయి వచ్చేశాడు సార్," అన్నాడు గట్టిగానే.

"నీకేమైనా పిచ్చిపట్టిందా! లేకపోతే బాలనాగమ్మ సినిమా చూశావా?" అంటూ విసుక్కున్నాడు సత్యానంద్.

"నేను చెప్పింది నిజం సార్. ఆ సుందర్రావు పాపం కుక్క అయిపోయాడు సార్" అన్నాడు నెమ్మదిగా.

"కుక్క అయిపోవటం ఏమిటి నీ తలకాయ్. ఇంకోసారి ఆ మాట అన్నావంటే నిన్ను సస్పెండ్ చేయిస్తాను" అన్నాడు కళ్ళెర్రచేస్తూ బెదిరింపుగా.

"నేను చెప్పేది పూర్తిగా వినండి సార్. సాయంత్రం సుందర్రావు భార్య ఆవిడపేరు అదేదోసార్...." అంటూ బుర్ర గోక్కోసాగాడు పేరు గుర్తురాక.

"వర్ధనమ్మలే....అసలు సంగతి ఏమిటో చెప్పు."

"ఆవిడ, ఆ వర్ధనమ్మ సార్ కూరగాయలకి మార్కెట్‌కి వెళ్ళి తిరిగి వస్తూంటే ఆ సుందర్రావు పిచ్చివాడిలా వుండి, కుక్కలా భౌ....భౌ....అంటూ కాళ్లూ చేతులూ వంచి నేల మీద నడుస్తూ అరుస్తున్నాడంట సార్. పిల్లలంతా రాళ్లు తీసుకుని కొడుతుంటే వాళ్ళని కరవపోయాట్ట. వాళ్ళంతా పారిపోయారుట.

చివరికి వర్ధనమ్మే భయపడిపోయి యెవరినో పట్టుకుని సుందర్రావు కాళ్లూ చేతులూ కట్టేసి ఇంటికి తీసుకుపోయిందిట. పాపం సుందర్రావు కుక్క అయిపోయాడు సార్. అంతేకాదు ఆ కిరణ్ తండ్రి విశ్వనాథం కూడా ఇలాగే

అయిపోయి తిరిగి వచ్చాట్టసార్. అతన్ని సుందర్రావ్‌లాగే ఇంటికి తీసుకుపోయారట. అవన్నీ తల్చుకుంటే నాకు భయం వేస్తోంది సార్ నేనూ కుక్కనైపోతానేమోనని” అన్నాడు ఏడుపుముఖం పెట్టుకుని.

'రానురాను కేసు మరీ విచిత్రంగా తయారైంది ఏమిటి? మనిషి కుక్కలా నడవటం, అరవటం ఏమిటి? వాళ్లు నిజంగా అలాగే మారిపోయారా లేక నటిస్తున్నారా' అన్న మీమాంసలో పడ్డాడు సత్యానంద్.

ఎంత ఆలోచించినా అతనికేమీ పాలుపోలేదు.

“సరే మనం స్వయంగా వెళ్ళి అదేమిటో చూపివద్దాం పద” అంటూ బైలుదేరాడు సత్యానంద్.

అతన్ని అనుసరించాడు నాయుడమ్మ.

6

సుందర్రావు ఇంటినిండా ఇసుకవేస్తే రాలనంతమంది జనం వున్నారు.

సుందర్రావుని ఒక గదిలో వుంచి తాళంవేశారు. వర్ధనమ్మ కిటికీ దగ్గర కూర్చుని గట్టిగా ఏడుస్తోంది. జనం అంతా సుందర్రావుని యెగ్జిబిషన్‌లో జంతువుని చూపినట్లు చూస్తున్నారు. కొందరు అతనికి పట్టిన దుస్థితికి విచారిస్తున్నారు. మరికొందరు వర్ధనమ్మ దురదృష్టానికి సానుభూతి చూపిస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ సత్యానంద్ అందర్నీ నాయుడమ్మ సహాయంతో బైటికి పంపేశాడు.

సత్యానంద్‌ని చూస్తూనే ఘొల్లుమంది వర్ధనమ్మ.

“ఏమిటి? ఆయనకి ఏం జరిగింది? ఎక్కడ దొరికారు” అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు.

“సాయంత్రం మార్కెట్‌కి వెళ్లి వస్తుంటే ఇలాంటి

స్థితిలో కనిపించారు. నల్గురు రిక్షావాళ్ళ సహాయంతో యెలాగో ఇంటికి తీసుకువచ్చాను. ఆయన వళ్ళంతా ఏదో కరిచినట్లు గాట్లు వున్నాయి. బజార్లో అంతా పిచ్చికుక్క కరిచి పిచ్చెక్కింది అంటున్నారు. ఆయన వంటినిండా గాయాలు బాగా పొంగిపోయి వున్నాయి. ఇన్నాళ్లు ఏమై పోయారో, ఎక్కడికి వెళ్లారో తెలియదు. అడిగినా జవాబు చెప్పలేని స్థితిలో వున్నారు. ఆయన్ని ఆ విధంగా చూస్తూ నేనెట్లా బ్రతకనండీ" అంటూ గట్టిగా ఏడుస్తోంది వర్ధనమ్మ.

ఆమె అన్నగారు కాబోలు ఆమెని ఊరడించసాగాడు.

"డాక్టర్ని యెవర్నీ పిలిచి చూపించలేదా" అన్నాడు సత్యానంద్.

"లేదు" అన్నట్లు తల ఆడించింది వర్ధనమ్మ.

నాయుడమ్మని పిలిచి ఏదో చెప్పి పంపించాడు సత్యానంద్.

తర్వాత కిటికీ దగ్గరగావెళ్లి లోపలికి తొంగిచూసాడు.

సుందర్రావు నాలుక బయటకి చాపి వుంది. నోటినుంచి చొంగ కారుతోంది. కాసేపు కుక్కలాగా పడుకున్నాడు ముడుచుకుని. మరి కాసేపు భౌ....భౌ....మంటూ అరుస్తున్నాడు. అతని బట్టలన్నీ పీలికలుగా చినిగిపోయున్నాయి. శరీరంమీద కుక్క కరిచినట్లు గాట్లు బాగా వాచిపోయి వున్నాయి. నిజానికి అలాంటి స్థితిలో మనిషి కదలడం అసంభవం. కానీ సుందర్రావు ఏమీ తెలియని స్థితిలో వున్నాడు. పైగా పిచ్చెక్కింది కాబట్టి ఆ బాధను అరుపుల రూపంలో వ్యక్తం చేస్తున్నట్లుంది. సుందర్రావు చాలా సేపు అలా అరిచి అరిచి నాలుకను జాపి చొంగ కార్చ సాగాడు.

అతని స్థితిని సత్యానందే యెక్కువసేపు చూడలేక

పోయాడు.

ఇంతలో నాయుడమ్మ డాక్టర్ని వెంటపెట్టుకు రావడంతో సత్యానంద్ డక్టరుతో కొంచెం సేపు మాట్లాడాడు.

చివర అతిప్రయత్నంమీద సుందర్రావుకి మత్తు ఇంజెక్షన్ యిచ్చి అతన్ని పరీక్షించాడు డాక్టర్.

"సారీ ఇన్‌స్పెక్టరుగారూ, వైద్యసహాయం అందవలసిన టైం దాటిపోయింది. అయినా ప్రయత్నం చేద్దాం" అని చెప్పటంతో సత్యానంద్ అప్పటికప్పుడు అతన్ని హాస్పిటల్‌కు తరలించే యేర్పాటు చేసాడు.

తర్వాత పోలీస్‌జీప్ విశ్వనాథం ఇంటిముందు ఆగింది.

అక్కడా ఇసుకవేస్తే రాలనంతమంది జనం వున్నారు.

ఎవరో ఒకాయన అందర్ని బయటకి తరిమేస్తున్నాడు. ఇంతలో ఎవరో పోలీసులు.... పోలీసులు అంటూ అరిచారు. జనం పక్కకి తొలిగి దారి యిచ్చారు. లోపలికి వెళ్లారు సత్యానంద్, నాయుడమ్మ.

లోపల విశ్వనాధం తాలూకు బంధువర్గమంతా దీనంగా కూర్చుని వున్నారు. ఓపక్క ఆఫీసు స్టాఫ్ అంతా గుమిగూడి అతనికి పట్టిన దుస్థితికి విచారిస్తున్నారు మరికొందరు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.

విశ్వనాధాన్ని కూడా గదిలో వుంచి తాళం వేశారు. అతని పరిస్థితి దాదాపుగా సుందర్రావుకి మల్లేనే వుంది. గది దగ్గర విశ్వనాధం భార్య పార్వతమ్మ, కొడుకు కిరణ్, మరొక అమ్మాయి కూర్చుని ఏడుస్తూ వున్నారు. బహుశా ఆ అమ్మాయి విశ్వనాధం కూతురై వుండచ్చు.

విశ్వనాధం అన్నతమ్ములు, బావమరదులు సత్యానంద్‌తో అతని పరిస్థితి గురించి, డాక్టరు చెప్పిన వివరాలు గురించి మాట్లాడారు. లోకంలో ఇలాంటి వింత యెక్కడా చూడ

లేదు అన్నారు. అతని పరిస్థితికి కన్నీరు కార్చారు. విశ్వనాధాన్ని పిచ్చికుక్క కరిచిన వెంటనే తగిన ఇంజెక్షన్లు వాడితే అతను బాగుపడేవాడన్నారు, ఇన్ని రోజులు ఎక్కడున్నాడో తెలియనందుకు చింతించారు. వైద్య సహాయం, అందే అవకాశం పూర్తిగా కోల్పోయినందుకు బాధపడ్డారు.

మరికొన్ని రోజులు గడిచిపోయాక రామలింగం కూడా సుందర్రావు, విశ్వనాధం ఏ స్థితిలో దొరికారో అట్లాగే రావటం జరిగింది.

ఈలోగా సుందర్రావు,విశ్వనాధం మరణించటం కూడా జరిగిపోయింది.

ఆ వార్తలు విన్న సత్యానంద్ చాలా బాధపడ్డాడు. ప్రపంచంలోవున్న కుక్కల జాతిమీద అతనికి చెప్పలేనంత కోపం వచ్చింది. పై అధికారుల సహాయంతో వూళ్ళో వున్న కుక్కల్ని అన్నింటినీ పట్టుకునేటట్లు చేసాడు.

కానీ ఇలా మనుషులు చనిపోవటానికి కారణం రోడ్డు మీద పోయే పిచ్చి కుక్కలు అంటే అతనికి నమ్మబుద్ధి కాలేదు. పైగా వూళ్ళో అసలు పిచ్చికుక్కలు లేనేలేవని తేలింది.

సాయంకాలం నాలుగు గంటలయింది.

సత్యానంద్ పనిమీద బయటకి వెళ్ళిపోతున్నాడు.

హెడ్ కానిస్టేబుల్ నాయుడమ్మ, కానిస్టేబిల్ పైడిరాజు యెవర్నో లాక్కురావడం దూరంనుంచే చూసాడు. ఎవరో తాగుబోతయి వుంటాడు. పట్టపగలే తాగి ఇలా గోల చేయటం బాగా అలవాటయిపోయింది వెధవలకు అనుకున్నాడు సత్యానంత్.

"సార్....సార్...." అంటూ గట్టిగా దూరంనుంచే అరుస్తున్నాడు నాయుడమ్మ.

వాహనం యెక్కబోతున్న సత్యానంద్ ఆగిపోయి చూసాడు.

నాయుడమ్మ, పైడిరాజు పట్టుకున్న మనిషివైపు చూసాడు.

"ఎవడు వాడు? నోటికి గుడ్డ కట్టారెందుకు?" అన్నాడు విసుగ్గా.

"వీడు భౌ....భౌ....సార్" అన్నాడు నాయుడమ్మ.

"లోపలికి తీసుకు పదండి."

ఇద్దరూ అతన్ని కుర్చీలో బలవంతంగా కూర్చోబెట్టి కట్టేసారు.

"ఎవరితను? ఎక్కడ దొరికాడు" అన్నాడు సత్యానంద్ ఆతృతగా.

"ఈ మనిషి బజార్లో భౌ....భౌ....మంటూ తిరుగుతూ ఒక మనిషిని కరిచేసాడు సార్. పట్టుకుందామంటే సాధ్యం

కాలేదు. చివరికి యెలాగో పదిమంది సాయంతో చేతులకు నోటికి గుడ్డలు కట్టేసి. ఇక్కడికి తెచ్చేసరికి మా తల ప్రాణం తోకకి వచ్చింది సార్" అని వుసూరుమంటూ విట్టూర్చాడు నాయుడమ్మ.

"ఇతడిని పిచ్చికుక్క కరిచింది సార్. నోటికి గుడ్డ కట్టాం కనుక వూరుకున్నాడు కానీ ఇందాక బజారులో యెంత గోలచేసాడని?" అంటూ చెప్పసాగాడు పైడి రాజు.

సత్యానంద్ వెంటనే డాక్టరుకి ఫోన్ చేసాడు.

కుర్చీలోంచి లేచి అతని దగ్గరగా వచ్చి పరీక్షగా చూడ సాగాడు.

అతని వయస్సు ముప్ఫయి అయిదు, నలభై సంవత్స రాల మధ్య వుంటాయి. యెర్రగా పండిన టమేటాలా వున్నాడు. కళ్ళతో అటూయిటూ వెతికేస్తున్నట్లుగా చూస్తు న్నాడు. రెండుచేతులూ వెనక్కి విరిచి కట్టబడివున్నాయి. వంటిమీద బట్టలు చిరిగిపోయి, దుమ్ము కొట్టుకుపోయి వున్నాయి. ఎర్రని శరీరంమీద గాట్లు స్పష్టంగా బాగా కని పిస్తున్నాయి.

అతన్ని చూడగానే సత్యానంద్‌కి చాలా ఆశ్చర్యం వేసింది.

ఇతను కనపడకుండా పోయినట్లు ఎవరూ రిపోర్టు చేయ లేదు. ఇతని తాలూకు యెవరూ లేరా? అనుకున్నాడు. ఆ విషయమే కానిస్టేబుల్సను అడిగాడు.

"పొద్దుటినుంచీ బజారులోపడి గోల చేస్తున్నాడట సార్. మరి ఎవరూ యితని కోసం రాలేదు. ఇతను యెక్కడినుంచి వచ్చాడో యెవరికీ తెలియదు."

"సరే ఇతని విషయం వాళ్ళ వాళ్ళకి తెలియకపోవచ్చు.

వంటరిగా లాకప్పులో వుంచండి. కొద్దిసేపట్లో డాక్టరుగారు వస్తారు. రేపటిలోగా యితని తాలూకు మనుష్యులు యెవరయినా వచ్చారా సరే సరి, లేకపోతే పేపర్లో వేయిద్దాం. బహుశా ఏదయినా పనిమీద వెడుతున్నట్లు ఇంట్లో చెప్పి వుండాలి. అందుకే యితన్ని గురించిన రిపోర్టు యేమీ రాలేదు," అన్నాడు సత్యానంద్.

ఆనవాయితీ ప్రకారం అతని జేబులు సోదా చేసారు. ఏమీ దొరకలేదు. ప్యాంటు జేబులో మాత్రం ఐదు, ఆరు మడత పెట్టిన కాగితాలు, చిన్న పెన్సిలుముక్క దొరికాయి.

పైడిరాజు వాటిని తీసి టేబుల్‌మీద పెట్టాడు. అతన్ని లాకప్‌లో వుంచాడు.

సత్యానంద్ వాటిని డ్రాయర్లో పడేయబోయి, మరలా యెందుకో వాటిని తెరిచి చూసాడు. నాలుగు తెల్ల కాగితాలు వున్నాయి. అయిదో కాగితంలో యేదో రాసివుంది.

విప్పి చూసాడు సత్యానంద్.

పైన పెద్ద అక్షరాలతో "యీ కాగితం చూసినవారు దయచేసి దీన్ని పోలీసులకు అప్పగించండి," అని రాసి, పెన్సిలుతో అండర్‌లైన్ చేసివుంది.

కింద చిన్న అక్షరాలతో ఈ విధంగా రాసివుంది.

"ఈ కాగితం చూసినవారికి నా నమస్కారములు. నేను ఎటువంటి భయంకర విషవలయంలో చిక్కుకున్నానో మీకు తెలియదు. నా పేరు రమేష్.

నేను ఆ రోజు (ఫిబ్రవరి మూడో తారీకు)రాత్రి సెకండ్ షో సినిమాచూసి, దారిలో నా గరల్ ఫ్రెండ్‌దగ్గర కొంత సేపు గడిపి, రూంకి బయలదేరాను. నాకు నా అన్నవారు యెవ్వరూ లేరు. ఒంటరిగాడిని. అలా వస్తూ సగం

దూరం వరకూ నడిచే వచ్చాను. ఇంతలో నా పక్కన ఒక కారువచ్చి ఆగింది. ఎవరో దిగారు.

"సార్ గౌతమీ నర్సింగ్ హోమ్‌కి దారి యెటు," అని అడిగారు.

"కాస్త ముందుకివెళ్లి మెయిన్ బజార్‌వైపు వెళ్లండి" అంటూ అడ్రస్ చెప్పాను.

కానీ వాళ్లు తాము వూరికి కొత్తవారమనీ, కాస్త వెంట వచ్చి చూపిస్తే మీ ఋణం వుంచుకోమనీ చాలా అర్జంట్ కేసనీ తిరిగి ఇంటి దగ్గర దింపుతామనీ చెప్పారు. కారు యెక్కాను. అంతే. వెనుకనుంచి యెవరో రుమాలు నా ముక్కుకి నొక్కిపట్టారు. ఘాటైన వాసన నా ముక్కుకి తగిలింది. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. కళ్లు తెరిచేసరికి నేనో గదిలో బంధించబడి వున్నాను.

కొద్దిసేపటికి ఒక మనిషి వికటంగా నవ్వుతూ నా గది లోకి ప్రవేశించాడు. నన్నెందుకు బంధించావని అడిగాను. అతను ఏం చెప్పలేదు. నౌకర్లను పిలిచి యేదో చెప్పాడు.

మరుక్షణం ఇద్దరు దృఢకాయులు నన్నో గది దగ్గరకు తీసుకుపోయి బలవంతంగా లోపలికి త్రోసి తలుపులు మూసారు. అంతే! భయంతో నా ప్రాణం పోయినంత పని అయింది. గదిలో పెద్ద సింహం అంతున్న కుక్క నన్ను చీల్చి చెండాడి చిత్రహింసల పాలుచేసింది. బయట వారు వినోదంగా నా అవస్థను చూసి వికటంగా నవ్వ సాగారు. అలా ఒకగంట మృత్యువుతో పోరాడాక వారు నన్ను వేరే గదిలో బంధించారు.

అలా నాలుగురోజులు నన్ను హింసించి వారు ఆనందించారు. వారి మాటలద్వారా నేను తెలుసుకున్నది యేమి

టంటే ఆ యింటి యజమాని పేరు వీర్రాజు. అతను వుంటున్నది ఊర్లోకల్లా కుక్కలమేడగా పేరుపొందిన యింట్లో. అది అల్లావుద్దీన్ స్ట్రీట్‌లో వున్నట్లు అందరికీ తెలుసు.

నన్ను కరిచింది పిచ్చికుక్క అనీ, తొందరలో నాకు పిచ్చియెక్క బోతోందని, నాకంటె ముందు ముగ్గురిని అలాగే మృత్యుముఖానికి పంపినట్లు తెల్సుకున్నాను. నేను బాగుండగా బయటపడే మార్గం యెటూ కన్పించటం లేదు. ఆ తర్వాత బయటపడ్డా యెవ్వరికీ యే విషయం చెప్పగలిగే స్థితిలో వుండను. అందుకని నేను పూర్తిగా తెలివిలో వుండగానే ఈ వుత్తరం రాస్తున్నాను. దీన్ని ఎవరికంటా పడకుండా పాంటు జేబులో పుంచాను.

నాకు బాగా పిచ్చియెక్కాక కానీ వారు బయటకు వదలి పెట్టరు. అలాంటప్పుడు నేను ఏ వివరాలు మీకు తెలియ చేయలేను. కనుక దయచేసి ఈ ఉత్తరం యెవరికి దొరికితే వారు ఇదేదో పిచ్చి వుత్తరం అని చించిపారేయకుండా పోలీసులకు అందచేయవలసిందిగా మరోసారి కోరుతు వున్నాను.

ఇట్లు,
రమేష్."

ఆశ్చర్యపోయాడు సత్యానంద్ వుత్తరం చదివి.

అయితే హంతకుడు ఈ ఊర్లోనే వున్నాడన్నమాట. ఈ రమేష్ ఎవరోగాని బాగా తెలివయినవాడు. హంతకుడి వివరాలు తెలియచేసాడు. తన పని తేలిక చేసాడు. త్వర పడాలి. లేకపోతే ఆ కిరాతకుడు ఎందర్ని పొట్టన పెట్టు కుంటాడో.

తాను చనిపోతానని తెలిసికూడా ఇతరుల ప్రాణాలను కాపాడటానికి సాహసం చేసిన రమేష్ అంటే సత్యానంద్ కి జాలి కలిగింది. కానీ ఇప్పుడు అతనికి ఏ సహాయం అవసరం లేదు. అతనిలాంటి మరికొందరు వ్యక్తుల ప్రాణాలను కాపాడటం తన కర్తవ్యం.

8

అర్థరాత్రి పన్నెండు దాటింది.

అంబాసిడార్ కారువచ్చి కుక్కల మేడకి యెదురుగా వున్న పెద్ద జువ్విచెట్టుముందు ఆగింది. అందులోంచి యిద్దరు ఆగంతకులు దిగారు. ఓండా నల్లని దుస్తుల్లో వున్నారు.

తలెత్తి మేడవంక చూసారు ఒకసారి. దాన్ని చూస్తుంటేనే శరీరం జలదరించేలా వుంది.

అది బాగా పాతబడ్డ జమిందారు భవంతి. చుట్టూ ఎత్తుగా ప్రహరీగోడ కట్టివుంది. ముందుగా పెద్ద ఇనుప గేటు వుంది. గేటుకిపైన యిరుప్రక్కలావున్న పెద్ద పెద్ద దిమ్మలపై చూడటానికి భయం కల్గించేలా ఎత్తుగా రెండు కుక్కలు వున్నాయి.

దూరంనుంచి చూపిన వాళ్లకు అవి నిజంగా కుక్కలేమో అన్న భ్రమను కల్గించేటట్లున్నాయి. పరీక్షగా చూస్తేనేకానీ అవి కుక్కలను పోలిన బొమ్మలు అని తెలియవు. కుక్కల బొమ్మలు చాలా సంవత్సరాలుగా అలా వుండటంవల్ల ఆ మేడకు కుక్కలమేడ అని పేరు వచ్చింది. ఆ మేడ చాలా కాలంగా పాడుబడివుంది. ఈ మధ్యనే దాన్ని వీర్రాజు అనే అతడు కొన్నట్లు విన్నాడు.

గేటుదగ్గర గూర్ఖా కునికిపాట్లు పడుతున్నాడు. మెల్లగా ఇద్దరూ అతని వెనుకగా నడిచారు. మొదటి ఆగంతకుడు జేబులోంచి చేతిరుమాలు తీసి గట్టిగా గూర్ఖా ముక్కుకి అదిమి పెట్టాడు. అయిదు నిమిషాల తర్వాత అతన్ని పక్కకి లాగేసి లోపలికి నడిచారు.

ఇంటిచుట్టూ ఒకసారి తిరిగి చూసారు ఆగంతకద్వయం. కానీ లోపలకి ఎలా పోవాలో తెలియలేదు.

పక్కనున్న మామిడిచెట్టుకింద నిలబడి పైకిచూసారు. మేడపైన అంతా చీకటిగా వుంది. ఇద్దరూ మెల్లిగా చెట్టెక్కి కొమ్మలమీద నుంచి పొడుగుపాటి వరండాలోకి చేరుకున్నారు.

మొదటి ఆగంతకుడు జేబులోంచి పెన్‌టార్చి తీసి నెమ్మదిగా ముందుకు సాగాడు. రెండో అతను మొదటి అతన్ని అనుసరించ సాగాడు.

వరండాలో వరుసగా నాలుగు గదులున్నాయి. అన్నిం టికీ వరుసగా తాళాలు వేలాడుతున్నాయి. ఆ తర్వాత చిన్న దారి. ఆ దారినుంచి ముందుకి నడిచి యిద్దరూ హాల్లోకి వచ్చారు.

అక్కడ ఇద్దరు దృఢకాయులు గుర్రుపెట్టి నిద్రపోతు వున్నారు. మొదటి ఆగంతకుడు రెండో అతనికి వారిద్దరిని చూపించి ఏదో చెప్పి అక్కడే నిలబడమన్నాడు.

కుడిచేతివైపు వున్న మెట్లగుండా మెల్లిగా కింద హాలు లోకి నడిచాడు మొదటి ఆగంతకుడు. హాల్లోంచి విశాలంగా వున్న ఎడమవైపు గదిలోకి నడిచాడు. ఆ గదికి ఎదురుగా రెండు గదులు వున్నాయి. మొదటిది తాళం వేసివుంది. రెండో గదిలోంచి వెంటిలేషన్ గుండా సన్నటి బెడ్‌లైటు

వెలుగు కనబడుతోంది.

చుట్టూ చూసాడు ఒకసారి.

ఓ మూలగా రోజ్‌వుడ్‌తో చేసిన ఎత్తుగా వున్న స్టూల్ దానిమీద ఫ్లవర్‌వాజ్ అతని కంటపడ్డాయి.

మరుక్షణం వాజ్‌ని కిందకు దింపి స్టూల్‌ని తెచ్చి కిటికీ దగ్గరగావుంచి, దానిమీద జాగ్రత్తగా యెక్కి లోపలకు తొంగి చూసాడు.

లోపల వీర్రాజు గాఢనిద్రలో మునిగివున్నాడు. కిందకి దిగేసి స్టూల్‌ని యథాస్థానంలో వుంచేసి నెమ్మదిగా తలుపు కున్న నాబ్‌ని తిప్పాడు. చప్పుడు చేయకుండా తలుపు తెరచుకుంది.

మంచం దగ్గరగా నడిచి తలవైపు నిలబడి పరుపుకింద తడిమి చూసాడు.

చేతికి పిస్టలు, చిన్నపాటి డైరీ తగిలాయి. పిస్టల్లో గుళ్ళన్నీ తీసి జేబులో వేసుకుని తిరిగి దాన్ని యథాస్థానంలో పెట్టేశాడు. డైరీ తెరిచి పేజీలు తిరగేశాడు. అతని కళ్ళు ఒక పేజీ దగ్గర ఆగిపోయాయి. చటుక్కున డైరీ మూసేసి జేబులో పడేసుకున్నాడు.

వెనుతిరిగి గది నలుమూలలా పరిశీలించసాగాడు. డ్రాయరుమీద ఏవో కాగితాలు, పుస్తకాలు వున్నాయి. లావు పాటి పుస్తకం చేతిలోకి తీసుకుని చూడసాగాడు. పేజీలు తిరగేస్తుంటే హటాత్తుగా పుస్తకం కిందపడి చప్పుడైంది.

"ఎవరు? ఎవరది?" అంటూ గబుక్కున లేచి స్విచ్ నొక్కాడు వీర్రాజు.

వంద కేండిల్ బల్బు గదినంతా వెలుగుతో నింపేసింది.

"ఎవరు? రమేష్ నువ్వా? నువ్వు లోపలికి ఎట్లా

వచ్చావు?" అన్నాడు తెల్లపోయి.

గట్టిగా నవ్వసాగాడు రమేష్.

"నీకు పిచ్చెక్కిందికదూ. రాంపింగ్ నిన్ను బైటికి వది లేశాడుగా. మళ్ళీ ఎలా రాగలిగావు" అన్నాడు రమేష్ వంక చూస్తూ వీర్రాజు.

"వదిలేసిన మాట నిజమే. కానీ నాకు మీరంతా అను కున్నట్లు పిచ్చి యెక్కలేదు. అదంతా భ్రమ. అట్లా అని యాక్షన్ చేసి తప్పించుకున్నాను అంతే" అంటూ పాంట్ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

"లేదు....లేదు....అట్లా జరగటానికి వీల్లేదు. నువ్వు మామూలు మనిషివి కావటం అసంభవం. పిచ్చివాడివి కావాలి. ఇదంతా అబద్ధం" అంటూ గట్టిగా అరవసాగాడు.

"అరవకు, నాకేం పిచ్చెక్కలేదు. నువ్వనేదే అబద్ధం. నువ్వు నన్ను వదిలేస్తావని అలా నటించాను అంతే" అన్నాడు రమేష్ చిరునవ్వుతో.

"నో....నో... అలా యెన్నటికీ జరగదు. నా కళ్ళు నన్ను మోసంచేయవు. నీకు పిచ్చెక్కటం స్వయంగా చూశాను. పిచ్చికుక్క కరిచిన మనిషి మామూలుగా మాట్లాడటం, అసంభవం."

"నేను చెప్పేది ముమ్మాటికీ నిజం వీర్రాజూ. అది నన్ను కరిచింది. కానీ నాకు పిచ్చి పట్టలేదు. అది ముమ్మా టికీ పిచ్చికుక్క కాదు?"

చటుక్కున తలక్రింద నుంచి పిస్టల్ తీసి రమేష్‌కి గురి పెట్టాడు వీర్రాజు. "రమేష్! నానుంచి తప్పించుకోవటం అంత తేలిక కాదు. ఈ వీర్రాజు చేతిలోంచి అప్పుడు బ్రతికి

బయటపడ్డా ఇప్పుడు బయట పడటం నీ తరంకాదు. నువ్వు చావాలి. ఈసారి నువ్వు చచ్చేదాకా కుక్కతో చెలగాట మాడిస్తాను” అంటూ వికటంగా నవ్వసాగాడు.

తెల్లపోయాడు రమేష్.

“సార్....సార్....నన్ను క్షమించండి. ఎరక్కపోయి ఇలా వచ్చాను. ఏదో నాటకం ఆడి పిచ్చెక్కినట్లు నటించి వెళ్ళిపోయిన వాణ్ని ఊరుకోకుండా, మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేద్దాం అని వచ్చి చిక్కుకుపోయాను. నన్ను క్షమించి వదిలేయండి సార్,” అంటూ ప్రాధేయపడ సాగాడు రమేష్.

“వీల్లేదు. నిన్నంత తేలికగా విడిచిపెట్టను. నువ్వు చావాలి. నిన్ను పిచ్చికుక్క కరిచింది. అయినా నువ్వు మామూలు మనిషిగా వుండటం నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఇదేదో ముందు తెల్సుకోవాలి. రాంపింగ్.... రాంపింగ్....” అంటూ కేకవేశాడు వీర్రాజు.

“కుక్క నన్ను కరిచిన మాట నిజమే. కానీ అది పిచ్చి కుక్క కాదేమో”. అన్నాడు రమేష్ అనుమానంగా.

భయంకరంగా నవ్వాడు వీర్రాజు.

“రమేష్, ఈ కుక్కల మేడలోకి వచ్చినవాడు మృత్యు మందిరంలోకి వచ్చినట్లే. నా వినోదం కోసం నీకంటే ముందు సుందర్రావు, విశ్వనాధం, రామలింగం, అనే ముగ్గుర్ని ఇలాగే తెచ్చి పిచ్చికుక్కచేత నా కసితీరా కరి పించి వినోదించాను. వాళ్ళకి పిచ్చెక్కి కుక్కల్లాగా అరు స్తుంటే నాకు చెప్పలేనంత ఆనందంగా వుండేది. కానీ నువ్వెలా తప్పించుకున్నావో నాకు అర్థంకావటంలేదు.

అయినా పరవాలేదు. మరికొన్ని రోజులు వినోదం కల్గి స్తావు...."

వికటంగా నవ్వసాగాడు వీర్రాజు.

"వెల్ మిస్టర్, వీర్రాజూ, నువ్వుచేసిన నేరాలను నీ నోటితో నువ్వే ఒప్పుకున్నావు. యూ ఆర్ అండర్ అరస్ట్" అన్నాడు సత్యానంద్ జేబులోకి చెయ్యి పోనిస్తూ.

"హేండ్స్ అప్! కదిలితే కాల్చేస్తాను. ఎవరు నువ్వు" అన్నాడు వీర్రాజు షాక్ తింటూ, పిస్టల్ని అతని గుండెలకి గురిపెట్టి—

"ఇంకా యెందుకు నీ బెదిరింపులు. నీ పిస్టల్లో గుళ్లు నేను ముందే ఖాళీచేశాను. ఐయామ్ ఇన్స్పెక్టర్ సత్యానంద్" అంటూ జేబులోంచి పిస్టల్ తీసి వీర్రాజుకి గురి పెట్టాడు సత్యానంద్.

"ఆ! నువ్వు!రమేష్వి కాదన్నమాట. అయినా ఎవరైతే నాకేం. అసలు నేను ఈ నేరాలు చేసినట్లు'ఋజువు ఏమిటి?" అంటూ బుకాయించాడు.

"నేరాలుచేసి తప్పించుకోవాలని చూడకు వీర్రాజూ. నువ్వు ఇట్లా అంటావని తెల్సే నీ నోటితో నువ్వుచేసిన నేరాలు చెబుతుంటే ఈ మినీ టేప్ రికార్డరులో రికార్డు చేశాను. రమేష్ వుత్తరం, యీ మేడలో క్రింది గదిలో బంధించబడ్డ పిచ్చికుక్క. ఆ పక్కగదిలో నీ వినోదం కోసం తేబడిన మరో అమాయకుడు-నీకు వురిశిక్ష తప్పించ లేవు" కర్కశంగా అన్నాడు ఇన్స్పెక్టర్ సత్యానంద్.

ఆ మాటలు వింటూనే స్పృహతప్పి నేలకూలాడు వీర్రాజు. □

వసుంధర

శేఖరానికి ప్రసాద్ గురుతుల్యుడు. మంచిచేసినా చెడు చేసినా ప్రసాద్‌తో చెప్పకుండా, అతన్ని సంప్రదించకుండా ఏమీ చేయడు శేఖరం.

శేఖరం బియ్యే ప్యాసయ్యాడు. ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. దొరకలేదు. లంచమిస్తే ఉద్యోగం దొరుకుతుందంటే అప్పుచేసిన డబ్బుతెచ్చి లంచమిచ్చాడు.

కానీ మోసపోయాడు. ఆ నష్టం పూడ్చడంకోసం కోమటి కొట్లో పద్దులు రాశాడు. ఆ పద్దుల్లోని అన్యాయాన్నతను సహించలేకపోయాడు. కానీ అప్పు తీర్చడంకోసం పది నెల్లు ఆ పని చేశాడు. అప్పు తీరగానే ఆ ఉద్యోగం మానే శాడు.

తర్వాత శేఖరం చిన్న వ్యాపారం ప్రారంభించాడు. న్యాయంగా వ్యాపారం చేయండవల్ల చాలా నష్టాలు కన బడ్డాయతనికి. ఎందరో అధికార్లు, ఎన్నో లంచాలు....ఈ కారణంగా వ్యాపారస్థుడికి న్యాయంగా వుందామన్నా కుది రేలా లేదు. అందులోని సాధక బాధకాలర్థంకాగానే శేఖరం వ్యాపారాన్ని కట్టిపెట్టి—పెట్టుబడికని తెచ్చిన అప్పు తీర్చి వేశాడు.

ఇంతవరకూ శేఖరం తండ్రికి ఏమాత్రమూ ఉపయోగ పడలేదు. శేఖరం తండ్రికి కొడుకు సంపాదించకపోయినా ఫరవాలేదనుకునేటంత ఆస్తిలేకపోయినా అభిమానంమాత్రం వుంది. ఆయనెప్పుడూ కొడుకును దేనికీ పల్లెత్తుమాటనలేదు.

అంతవరకూ చేసిన పనులన్నీ ప్రసాద్‌తో సంప్రదించే చేశాడు శేఖరం.

ప్రసాద్‌కు ఆస్తి వుంది. ఉద్యోగమూ వుంది. నీడ పట్టున వుండడంవల్లనేమో ప్రతి విషయాన్నీ అటూ ఇటూ కదిపి కుదిపి ఆలోచించగల సమర్థత వుందతనికి. ప్రసాద్ ఎదుటివాళ్ళ కెప్పుడూ సలహాలివ్వడు. వాళ్ళేమైనా చేయా లంటే కాదనడు. అందులోని మంచిచెడ్డలు వివరించి చెప్పి దాన్నిబట్టి ఆలోచించుకోమంటాడు.

శేఖరం ప్రసాద్‌ని కలిసి — "గురువుగారూ! డబ్బు సంపాదించడానికి 'మోసం, అన్యాయం తప్పదని తెలిసి పోయింది. అలాంటప్పుడు వ్యాపారం, ఉద్యోగం అనే

పేర్లమరుగున డబ్బు సంపాదించడం నాకిష్టం లేదు. తిన్న గానే రంగంలోకి దిగుదామనుకుంటున్నాను...." అన్నాడు.

"అంటే ఏం చేస్తావ్?" అనడిగాడు ప్రసాద్.

"దొంగతనం చేద్దామనుకుంటున్నాను—" అన్నాడు శేఖరం.

"పట్టుబడకుండా చేయగలిగితే దొంగతనం మంచిదే!" అన్నాడు ప్రసాద్ శేఖరం మాటలకు ఏమీ చలించకుండా.

శేఖరం ఆశ్చర్యపడుతూ—"అయితే మీ రంగీకరిస్తున్నారా?" అన్నాడు.

"ఊఁ కానీ నా ఇంట్లో మాత్రం చేయవద్దు" అన్నాడు ప్రసాద్.

శేఖరం సంతోషంతో ప్రసాద్‌కు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

"ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. గొప్పవాళ్ళింట్లో దొంగతనం చేసినా వాళ్ళకు నష్టమేమీ కలగదు. అయితే వాళ్ళకు రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా వుంటాయి. మధ్య తరగతి వాళ్ళకు రక్షణ ఏర్పాట్లు తక్కువ. వాళ్లింట్లో దొంగతనం చేయాలనుకుంటే మనసులో దయాదాక్షిణ్యాలకు చోటివ్వకూడదు."

"దొంగతనాల్లో ఆరితేరేవరకూ మధ్యతరగతి ఇళ్ళనే దోస్తాను. నా మనసులో దయాదాక్షిణ్యాలకు ఇసుమంతైనా చోటులేదు" అంటూ శేఖరం అక్కణ్నించి ఉత్సాహంగా బయల్దేరాడు. తన గురువుగారి ఆమోదం అంత సులభంగా లభిస్తుందని అతడనుకోలేదు.

శేఖరం ఆ రాత్రే ఓ ఇంటికి వెళ్లాడు. ఇంటామె భర్త ఆరోజే ఊరుకు వెళ్ళడమూ — ఇంట్లో ఆమె ఒక్కర్తె మాత్రమే వుండడమూ తెలుసుకునే అతనా ఇంటి నెన్ను

కున్నాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో అతనామె ఇంటి తలుపుతట్టాడు. ఆమె తలుపుతీసే సమయానికి ముఖం కనిపించకుండా రుమాలు అడ్డం పెట్టుకున్నాడు.

ఆమె తలుపుతీసి—"ఎవరు?"అనబోయి ఆగిపోయింది. అతడి చేతిలోని కత్తిచూసి అప్రయత్నంగానే ఆమె వెను కడుగు వేసింది.

శేఖరం ముందడుగువేసి—"అరవడానికి ప్రయిత్నిస్తే ప్రాణాలు పోతాయి" అంటూ లోపలకు ప్రవేశించి తలుపు గడియవేసి—"నేను దొంగను-దొంగతనానికి వచ్చాను" అన్నాడు. ఇదే అతనికి మొదటి దొంగతనం కావడంవల్ల చేతులు, కాళ్లు వణుకుతున్నాయి.

ఆమె భయంతో వణికిపోతూ ఏదో మాట్లాడాలని ప్రయత్నించి విఫలురాలై ంది.

తన్నుచూసి ఆమె వణుకుతోందని అర్ధమయేక శేఖరానికి వణుకు తగ్గింది — "నువ్వేమీ భయపడకు. నిన్నేమీ చేయను. నాకు డబ్బు కావాలి. అంతే!" అన్నాడతను.

"డబ్బా?" అందామె ఇంకా వణుకుతూనే.

"అవును" అన్నాడు శేఖరం.

"నన్ను చంపేసినా ఫరవాలేదు. డబ్బు మాత్రం అడక్కు" అందామె.

"నిన్ను చంపితే నాకేం వస్తుంది. నాకు డబ్బే కావాలి!" అన్నాడు శేఖరం. లోలోపల అతను నవ్వుకున్నాడు కూడా. చావుకు భయపడని మనిషైతే ఈపాటికి గట్టిగా అరిచి కేకలు పెట్టి వుండేది. తను చంపుతాడన్న భయముండడం వల్లనే చెప్పినట్లు వింటోంది.

"ఇంట్లో డబ్బులేదు" అందామె.

"అది నేను వెతుక్కుంటాను. నువ్వలా బుద్ధిగా

కుర్చీలో కూర్చో" అన్నాడు శేఖరం. ఆమె కుర్చీలో కూర్చున్నాక అతడామెను కుర్చీకి తాళ్ళతో కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కాడు. తర్వాత నెమ్మదిగా ఇల్లంతా శోధించాడు. ఇంట్లో యెక్కడా అతనికి డబ్బుగానీ, నగలుగానీ, ఖరీదైన సామాను కానీ కనబడలేదు. అతను వెతకడానికింక మంచం ఒక్కటే మిగిలింది.

అది పూర్వకాలపు పందిరి మంచం. మంచం పరుపు ఎత్తగానే తలదిక్కున అతడికి మంచంలోకి అమర్చబడి వున్న ఓ పెట్టె కనబడింది. శేఖరానికి ఉత్సాహం వచ్చింది. దానికి తాళంకూడా లేదు.

ఆ పెట్టెలో ఓ భరిణ వుంది. ఆ భరిణలో రెండు గాజులున్నాయి. గాజులు రెండూ తళతళ మెరుస్తున్నాయి. అవి తప్పక బంగారానివే అయుండాలి. బంగారానివి కాకపోతే అంత భద్రంగా దాచరు.

శేఖరం గాజులు రెండూ జేబులో వేసుకుని భరిణ మళ్లీ పెట్టిలో పెట్టబోయి ఆగిపోయాడు. అక్కడ ఆ స్థానంలో ఒక చిన్న వుత్తరం వుంది. దానిపైన పెద్ద అక్షరాలతో-"ప్రియమైన అరుణా!" అని వుంది.

అది తప్పకుండా ఒక భర్త భార్యకు రాసిన ఉత్తరమై వుండాలని ఊహించాడు శేఖరం. ఆ ఉత్తరం చదవడానికతను కొద్ది క్షణాలు తటపటాయించాడు. అతనిలోని సంస్కారం ఓ మూల వెన్ను తడుతూంటే — దొంగవయ్యావు, నీకు సంస్కారమేమిటిలే-అంటూ అంతరాత్మ వెక్కిరించింది.

శేఖరం ఆ ఉత్తరాన్ని చదివాడు.

అరుణ భర్త ప్రభాకరం ఆ ఉత్తరం భార్య అరుణకు రాశాడు.



ప్రభాకరం ఉద్యోగం ఊడింది. అది నిలబెట్టుకోవడాని కతను అయిదొందలు ఎవరికో లంచమిచ్చాడు. ఉద్యోగం నిలబడింది కానీ అది మళ్ళీ ఏ క్షణాన్నయినా ఊడవచ్చు. అది శాశ్వతంగా నిలబడడంకోసం అతనికింకో వెయ్యి రూపాయలు కావాలి.

"మానాన్న ఆస్తంతా దుర్వ్యసనాలకు తగలేసాడు. అమ్మ నగలన్నీ అన్యాయంగా అమ్మేసాడు. అందుకే పెళ్ళికి నీకు రెండంటే రెండుగాజులు మాత్రం చేయించ గలిగాను. అప్పుడు నేను అమ్మకు వగ్దానం చేసాను. ప్రాణం పోయినాసరే పెళ్ళాం నగలు తాకట్టు పెట్టనని.అలా అని అమ్మమీద ఒట్టుకూడా వేసాను. ఇప్పుడు నా దగ్గర నాలుగొందలు మాత్రం వున్నాయి. ఇంకో ఆరొందలు కావాలి. రెండు రోజులపాటు నీకు కనిపించను. తర్వాత వస్తాను. ఈలోగా నువ్వీ గాజులు తాకట్టు పెట్టి మిగతా

డబ్బు సిద్ధంచేసి వుంచు. ఉద్యోగం స్థిరపడ్డాక అన్ని ఖర్చులు మానుకునయినా సరే నీ గాజులు విడిపిస్తాను. గాజులు తాకట్టు పెట్టనని అమ్మకిచ్చిన మాటను ఈవిధంగా నిలబెట్టుకుంటున్నందుకు నాకు సిగ్గుగా వుంది. నన్ను క్షమిస్తావు కదూ?"

ఇదీ ఆ వుత్తరం.

ఉత్తరం చదువుతూనే శేఖరానికి కళ్ళలో నీళ్ల తిరిగాయి. ఉత్తరంలోంచి దీనంగా చూస్తున్న ప్రభాకరం అతని కళ్ళముందు నిలబడ్డాడు. అంతలోనే అతనికి కోపం కూడా వచ్చింది. ప్రభాకరం ఉదయం అనగా వెళ్ళిపోయాడు. ఇంతవరకూ ఈమె గాజులనెందుకు తాకట్టు పెట్టలేదు. భర్త వుద్యోగం నిలబడడం యీమెకు యిష్టం లేదా?

శేఖరం తిన్నగా అరుణ దగ్గరకు వెళ్ళి—"నీ పేరు అరుణ. అవునా?" అన్నాడు.

అవునన్నట్లు తలూపిందామె.

శేఖరం ఆమె కట్లు విప్పి నోటి గుడ్డలు తీసేసాడు.

"నీ భర్త రాసిన వుత్తరం చదివాను. నీ గాజులు నాకు అక్కరలేదు. కానీ నీ పద్ధతి నాకు నచ్చలేదు. ఇంత వరకూ అవెందుకు తాకట్టు పెట్టలేదు?" అనడిగాడతను తీవ్రంగా.

ఆమెకు దుఃఖం ఆగినట్లు లేదు. ఒక్కనిముషం వెక్కి వెక్కి ఏడ్చింది. తర్వాత తమాయించుకుని—"యేం చేసేది? ఆయనింకా అవి బంగారపు గాజులే ననుకుంటున్నారు. ఆయన వుద్యోగం పోయినప్పుడు ఇంటి అవసరాలు గడపడం కోసం వాటిని నేనేనాడో అమ్మేసాను. ఆయనకా విషయం తెలియదు. అప్పట్లో నేనిచ్చిన డబ్బు

నా పొదుపరితనంతో దాచిందని నమ్ముతున్నారు. ఇప్పు దేమి చేయాలో పాలుపోవడం లేదు" అంది.

శేఖరం షాక్ తిన్నాడు. ఆ గాజుల మీద యింకా యే మాత్రం మోజువున్నా అది ఈ దెబ్బతో పోయింది.

మధ్య తరగతి సంసారాల్లో డబ్బుకు సంబంధించి యెలాంటి విషాదగాధలు?

ఆమె కుపకారం చేయాలని శేఖరాని కనిపించింది కానీ తన వల్ల ఏమవుతుందని ఊరుకున్నాడతను.

"వీలుపడితే రేపు నీకు డబ్బు తెచ్చిస్తాను. నెమ్మది మీద నాకు తీర్చుదువు గాని...." అన్నాడు శేఖరం ఆమె వంక జాలిగా చూసి.

"నాకు డబ్బిచ్చే వుద్దేశ్యం వుంటే మళ్ళీ 'నువ్వు మాత్రం రావద్దు. ఎవరయినా ఆడవాళ్ళ ద్వారా పంపించు" అంది అరుణ.

ఆమె మాటలో ఎన్నో అర్థాలు గోచరించాయి శేఖ రానికి. ఒక మగవాడు మరో ఆడదానికి సాయపడగల స్థితికింకా ఎదగలేదు మన మధ్యతరగతి వ్యవస్థ. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో కూడా ఆమె తను డబ్బు ఇస్తానంటే భయ పడుతోంది. ఇంతకీ తను ఇవ్వగలడో లేదో తెలియనే తెలియదు.

శేఖరం నిరుత్సాహంగా ఆ ఇంట్లోంచి బయటపడ్డాడు. ప్రసాద్ చెప్పిన మాటల్లోని సత్యం అతనికి గోచరించింది. మధ్యతరగతి వారి ఇండ్లలో దొంగతనాలు చేయాలంటే ఆ మనసుకు దయాదాక్షిణ్యాలు వుండకూడదు. అలా తయారు కావడం తన వల్లకాదు.

ఆ రాత్రి మరికొన్ని గొప్పవాళ్ళ ఇండ్లముందు కూడా తచ్చాడాడు కానీ భయంకరంగా మొరిగే కుక్కలు, తుపా

కీతో నిలబడ్డ వాచ్‌మన్లు, గాజుపెంకులు గుచ్చిన ప్రహరీ గోడలు అతన్ని చాలా భయపెట్టాయి. సుమారు మూడు గంటల ప్రాంతంలో ఇల్లుచేరి పడుకున్నాడతను.

మర్నాడు లేస్తూనే అతను ప్రసాద్ ఇంటికి వెళ్లాడు.

"ఏమిటి విశేషాలు?" అన్నాడు ప్రసాద్.

"ఓ ఆరొందలు అప్పుగా కావాలి."

"ఎందుకు?"

శేఖరం రాత్రి జరిగిన కథ చెప్పాడు. అంతా విని ప్రసాద్ నిట్టూర్చి — "నీలాంటి వాడు దొంగతనానికి వెళ్ళడంవల్ల వున్న సమస్యలు పరిష్కారంకావు సరికదా కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. అరుణలా కష్టపడేవాళ్లు ఈ లోకంలో చాలామంది వున్నారు. అందర్నీ ఆదుకోవ డము మనవల్ల కాదు. నీ సంగతేదో నువ్వు చూసుకోవడం మంచిది—" అన్నాడు.

"అలాంటివాళ్లు చాలామంది వున్నారు. అరుణ సంగతి నాకు తెలిసింది కదా?" అన్నాడు శేఖరం.

"తెలుసుకోవాలనుకుంటే అరుణ సంగతికేం కర్మ— ఇంకా చాలావున్నాయి. ఆ మాటకొస్తే మీ నాన్నే వున్నాడు" అన్నాడు ప్రసాద్.

శేఖరానికి చురుక్కుమంది. చెల్లెలు పెళ్లీడుకొచ్చింది. ఓ పక్క సంబంధాలు చూస్తూనే ఇంకోపక్క కట్నండబ్బు కోసం ప్రయత్నిస్తోన్నాడు తండ్రి. తన నాయన యేమీ అనడంలేదు, అడగడం లేదు—కానీ ఎదిగిన కొడుకుగా తనాయనకు ఏం సాయపడుతున్నాడు?

"అవును—నిజమే!" అన్నాడు నెమ్మదిగా శేఖరం.

"అరుణకయినా, నీ తండ్రికయినా సాయపడాలను కుంటే అందుకు మార్గం అప్పులు కావు. స్వయం సంపా

దన...." అన్నాడు ప్రసాద్.

"సరే — గురువుగారూ — ఈరోజు దేవాలయంలో దొంగతనం చేస్తాను...." అన్నాడు శేఖరం.

"దేవాలయంలోనా?" తడబడుతూ అన్నాడు ప్రసాద్.

తన గురువుగారు అంతలా తడబడటం శేఖరమెప్పుడు చూడలేదు.

"అవును—ఏం?" అన్నాడతను.

"దేవుడి జోలికి వెళ్లినవాడూ, స్నేహితుని కన్యాయం చేసినవాడూ సర్వ నాశనమై పోతాడు."

శేఖరం నిరుత్సాహ పడ్డాడు. "మీరు దేవుణ్ణి నమ్ముతారా?" అన్నాడు.

"నమ్మడమేమిటి? రామాలయానికి తరతరాలుగా మా వంశమే గదా ధర్మకర్తృత్వం వహిస్తున్నది" అన్నాడు ప్రసాద్ హుందాగా—"ఆ దేవుడి చలవ వల్లనే మేమూ పచ్చగా వున్నాం."

"జనతాపార్టీ పవర్లోకి వస్తే కొందరికి లాభం. కాంగ్రెస్ పార్టి పవర్లోకి వస్తే కొందరికి లాభం. అందరికీ లాభంగా వుండే పార్టీ ఈ దేశంలో యింకా పుట్టినట్లులేదు. దేవుడి వ్యవహారానికీ ఈ పార్టీల వ్యవహారానికీ అట్టే తేడా కనబడటం లేదు నాకు. దేవుడు మీకు మంచి చేసాడు కాబట్టి మీ రాయన్ని నమ్ముతున్నారు. నాకు చేయలేదు కాబట్టి నే నాయన్ని ద్వేషిస్తాను. దేవాలయంలో దొంగతనం చేస్తాను. సాధారణంగా దేవుడి దగ్గరకు చేరేది దొంగ సొమ్మే కదా—అందులో నేనూ కాస్త వాటా తీసుకోడంలో తప్పులేదు" అన్నాడు శేఖరం.

"నా మాట విని కాస్త శ్రద్ధగా ఆలోచించు. నీ పాడు ఆలోచన మాను" అంటూ మొదటిసారిగా సలహా నిచ్చాడు

ప్రసాద్.

"అయితే ఆలోచించి రేపు చెబుతాను" అన్నాడు శేఖరం.

ప్రసాద్ అనుమతి లేకుండా అతనింతవరకూ ఏ పనీ చేయలేదు. ప్రసాద్ తెలివితేటలపైనా, విచక్షణాజ్ఞానం పట్ల అతడికి అంతులేని గురి వున్నది. అందువల్ల శేఖరం చాలా సేపు ఈ విషయమై తీవ్రంగా ఆలోచించాడు.

విన్నటి అనుభవం కారణంగా అతడి మనసు దేవాలయానికి వెళ్ళమని పురిగొల్పుతోంది. సాయంత్రం అయ్యేసరికి అతను ప్రసాద్ చెప్పిన ప్రకారం చేయడమే శ్రేయస్కరమని నిర్ణయించుకున్నాడు. కానీ రాత్రి భోజనాలు చేసేసరికి అతని ఆలోచన మారింది. ఏదో ఆవేశం అతన్నావహించగా సినిమాకని వంకబెట్టి అతను యిల్లు కదిలాడు.

ఈ పర్యాయం అతడి జేబులో క్లోరోఫాం సీసా కూడా వున్నది.

అన్ని ఆలయాల్లోకీ దొంగతనానికి అనువయినది రామాలయం ఒక్కటే.

రామాలయం చిన్నగుడి. రాముడికీ, సీతకూ బంగారు ఆభరణాలున్నాయి. ఆలయ ప్రాంగణంలోనే పూజారి వుంటున్నాడు. పూజారి ముసలివాడు. ఒంటరిగాడు. ఆదాయము తక్కువ కావడంవల్ల ఆలయానికి రక్షణకూడా ఏమీలేదు. ఇలాంటి ఆలయాలమీద దొంగల దృష్టి వెంటనే పడదు. ఎందుకంటే చాలామంది దొంగలు దేవుడికి భక్తులే!

శేఖరం పూజారి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఓపిగ్గా ఓమూల కూర్చున్నాడు.



ఓ రాత్రివేళ పూజారి అల్పాచమనానికి తలుపు తీసుకుని బయటకు వచ్చారు. ఆయనకు దైవభక్తి మెండు. అంచేత కాస్త దూరంగానే వెళ్లాడు. శేఖరం ఛటుక్కున యింట్లో దూరాడు. పూజారి మంచం మీద తలగడ క్రిందవున్న తాళాల గుత్తి తీసుకుని జేబులో వేసుకున్నాడు. మళ్లీ బయటకు వద్దామా వద్దా అని ఆలోచించి లోపలే ఓ మూలగా వుండిపోయాడు..

పూజారి లోపలకు వచ్చి తలుపు గడియ వేసుకుని పడుకున్నాడు. కొద్దిక్షణాల్లోనే ఆయన గుర్రుతో గదంతా నిండిపోయింది.

శేఖరం కొద్దిగా క్లోరోఫాం జేబురుమాలుమీద పోసి పూజారిని సమీపించి ఆయన ముక్కుకు నొక్కిపెట్టి గట్టిగా అదిమాడు. పూజారి ఉలిక్కిపడ్డట్టుగా లేవబోయాడు కానీ అంతలోనే ఆయనకు స్పృహ తప్పింది.

శేఖరం వుత్సాహంగా గదిలోంచి బయటపడ్డాడు.

తన దగ్గరున్న తాళాల సహాయంతో గర్భగుడికి వెళ్లాడు.

అప్పుడతనికి ప్రసాద్ మాటలు గుర్తుకు వచ్చాయి—"దేవుడిజోలికి వెళ్ళకు. మిత్రుడిని మోసం చేయకు. సర్వనాశనమైపోయే ప్రమాదముంది...."

శేఖరం విగ్రహాల్ని చూశాడు. ఎవరో శిల్పి అందంగా చెక్కి అక్కడ పెడితే అంతా దేవుడంటున్నారు. ఈ దేవుడి జోలికి పోవద్దని ప్రసాద్ అంత తెలివయిన వాడు కూడా తనను హెచ్చరించాడు.

రాముడికి, సితకు, లక్ష్మణుడికి—ఆఖరికి ఆంజనేయుడికి కూడా ఏవేవో ఆభరణాలున్నాయి. ఇదెంత అన్యాయం. ఎందరో ప్రజలు తిండికిలేక మాడి చస్తూంటే ఏమి చేయలేని ఈ విగ్రహాలకు దేవుళ్ళని పేరుపెట్టి నగలు ధరింపజేస్తున్నారు మూర్ఖులు!

శేఖరం ఆలోచిస్తున్నాడు. ప్రజలు నిజంగా మూర్ఖులేనేమో! చూస్తూ చూస్తూ ఒక ముష్టివాడికి అయిదుపైసలు ఇవ్వలేని అమ్మ ఒకసారి పార్వతీదేవికి వెండికళ్లు సమర్పించుకుంది. ఇలా యెందరో యెన్నో సమర్పిస్తూంటే ఈ దేవుడు మనిషికంటె సిరిసంపదలతో తులతూగుతూవున్నాడు తప్ప మనుషులకేమీ చేయడంలేదు.

శేఖరాని కిప్పుడు మిత్రుడి సలహా గురించిన అనుమానం లేదు. దేవుణ్ని గురించిన భయంలేదు. తన అవసరానికి ఏ నగలు తీయాలా అని ఆలోచిస్తున్నాడు.

మళ్లీ ఇటువంటి అవకాశం వస్తుందో రాదో, మొత్తం నగలన్నీ ఊడ్చుకు పోవడం మంచిదని అనుకున్నాడు శేఖరం.

త్వరగా అతను వ్యవహారంలోకి దిగాడు. అయితే అతనిక్కడ చాలా తెలివిగా వ్యవహరించాడు. చూడగానే

పోయాయని తెలిసేవికాక చిన్నచిన్న ఆభరణాలన్నీ తీసుకుని జేబులో వేసుకున్నాడు. వాటిలో గాజులు, గొలుసులు కూడా వున్నాయి. సుమారు అయిదారువేల రూపాయల వస్తువులని తన జేబులో వేసుకుని మళ్ళీ తలుపుల్ని యథాతథంగా తాళం వేసాడు.

ఎక్కడా తన వేలిముద్రలు, ఆధారాలు వదలకుండా జాగ్రత్తపడుతూ అతను పూజారి ఇంట్లోకివెళ్ళి మళ్ళీ తలగడ కింద తాళాలు పెట్టేసాడు. తలుపు దగ్గరగా లాగి గెడవేసే పద్ధతి అతనికి తెలుసు. అలాగే చేసి బయటకు వచ్చేసిన శేఖరం తనలో తనే నవ్వుకొని "ఈ దొంగతనం ఎలా జరిగిందో—దేవుడి క్కూడా తెలియదు"అనుకున్నాడు.

రాత్రి ఇంటికి వెళ్ళాక ఆ నగల్ని తన పెరట్లో రహస్యంగా దాచాడు శేఖరం. ఆ తర్వాత హాయిగా నిద్రపోయాడు.

మర్నాడుదయం ఇంట్లో కాఫీ తాగక శేఖరం ముందు ప్రసాద్ ఇంటికి వెళ్ళాడు. అప్పటి కక్కడ రామాలయం పూజారి వున్నాడు. ఆయన్ను చూస్తుంటే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది శేఖరానికి. ఆయన చంటిపిల్లాడికన్న దారుణంగా ఏడుస్తూ జరిగిన ఘోరం గురించి ప్రసాద్‌కు వివరిస్తోన్నాడు. ప్రసాద్ గంభీరంగా అంతా వింటున్నాడు. అక్కడ ఒకరిద్దరు పెద్దలుకూడా వున్నారు.

ప్రసాద్ శేఖరాన్ని చూస్తూ—"రా, కూర్చో!" అని జరిగింది అతనికీ చెప్పాడు. శేఖరం ఆశ్చర్యాన్ని నటిస్తూ అంతా విని—"దేవుడి జోలికి వెళ్ళినవాడు బాగుపడడు" అన్నాడు.

"బాగుపడ్డంమాట అటుంచు. వాడు సర్వనాశనమవుతా

దన్నదే నా బాధ!" అన్నాడు ప్రసాద్.

"వెంటనే పోలీస్ రిపోర్టియ్య...." అన్నాడు శేఖరం బింకంగా.

"పోలీస్ రిపోర్టిస్తే వాళ్ళనుమానం నామీదే వుంటుంది. పరిస్థితులలా వున్నాయి. కానీ ఎవ్వరూలేని నేను అంత డబ్బు ఏం చేసుకుంటాను?" అన్నాడు పూజారి.

"పూజారిగారూ! మీరు విచారించకండి. మిమ్మల్ని అనుమానించడం ఆ దేవుణ్ని తన్నినంత పాపం. మీ సంగతి నాకు తెలుసు. ఈ దొంగతనం గురించి పోలీసు రిపోర్టు యిస్తే మీరు యిబ్బందిలో పడతారని నాకు తెల్సు. అదీగాక రామాలయంలో దొంగతనం జరిగిందంటే ఆ రాముడికీ అప్రతిష్టే! అందుకని పోయిన ఆ నగలన్నీ నేను చేయించి యిస్తాను. మీరు బాధపడకండి. ఆ రాముడి దయ వల్ల తరతరాలకూ తరగని ఆస్తి మాకుంది...." అన్నాడు ప్రసాద్.

నేను తెల్లబోయాను. నిన్న ఓ అభాగ్యురాలి గురించి ఆరొందలడిగితే లేదన్నాడు ప్రసాద్. ఈరోజు దేవుడనే రాతి బొమ్మకోసం ఆరువేలివ్వడానికి సిద్ధపడుతున్నాడు. ఏమిటీ విచిత్రం?

పూజారి అసలు దేవుణ్ని మరిచిపోయాడు. ప్రసాదే దేవుడని ఆయన భావించాడు. అక్కడున్న పెద్దలుకూడా ప్రసాద్ ధర్మబుద్ధిని ప్రశంసించగా—"గుడికి ధర్మకర్తను నేను. ఆ మాత్రం బాధ్యత స్వీకరించకపోతే ఎలా?'' అని "పూజారిగారూ—ఇంకమీదట మీరు కాస్త జాగ్రత్తగా వుండండి" అని హెచ్చరించాడు ప్రసాద్.

అంతా వెళ్ళిపోయాక శేఖరం ప్రసాద్ని నిరసనగా మాట్లాడాడు—"అహా-మీ దైవభక్తి ప్రశంసనీయం...."

"అందువల్లనేగదా నేనీనాడు ఇంత పచ్చగా వున్నాను" అన్నాడు ప్రసాద్ చలించకుండా.

నిజమేనేమో అనిపించింది శేఖరానికి. ఇంతకాలం గురువుగారి మాటలు పాటించి ఇప్పుడాయనపట్ల దురభిప్రాయం ఏర్పరుకోవడం తప్పేమోనని అతననుకున్నాడు.

"అయితే ఎప్పుడు చేయిస్తారు నగలు?" అనడిగాడు శేఖరం ప్రసాద్ని.

"నిన్న, ఈ రోజు బంగారం కొట్లన్నీ సెలవు. వాళ్ళ వాడెవడో పోయాడని మూసేశారు. రేపే వెడతాను...." అన్నాడు ప్రసాద్ తాపీగా.

ప్రసాద్ వెళ్ళే బంగారపుకొట్టు అతనికి తెలుసును.దానికి బాగా దూరంగా ఓ సందులో ఇంకో బంగారపు కొట్టు వుంది. అమ్ముకునేవాళ్ళు, తాకట్టు పెట్టుకునే వాళ్లు ఎక్కువగా అక్కడికే వెడుతూంటారు. శేఖరం తన తల్లి నగలు తాకట్టుకి అక్కడికే వెడుతూంటాడు.

మర్నాడు శేఖరం ఓ నగ తీసుకుని తాకట్టుకి వెళ్లాడు.

"అమ్మకానికా, తాకట్టుగా?" అనడిగాడు షాపువాడు.

"అమ్మకానికే?" అంటూ నగను బైటకు తీసి చూపించాడు శేఖరం.

షాపువాడు దాన్ని ఎగాదిగా పరిశీలించి చూపి-"ఎక్కడిదండీ మీకిది?" అనడిగాడు.

"మా అమ్మగారిది!" అన్నాడు శేఖరం.

షాపువాడు వెటకారంగా శేఖరంవంక చూపి—"గిల్టుదని తెలియకుండానే వేసుకున్నారా దీన్ని మీ అమ్మగారు? లేక మీరు దీన్నావిడకు చెప్పకుండా తీసుకొచ్చారా?" అనడిగాడు.

శేఖరానికి మతిపోయినట్లయింది — "ఏమన్నారు?"

అన్నాడు.

"ఇది గిల్టు నగ...." అన్నాడు షాపువాడు తాపీగా.

ఎరిగున్నవాడు కాబట్టి సరిపోయింది—లేకపోతే ఇంకా ఎన్ని మాటలనేవాడో?

దేవుడికి ఆభరణం గిల్టు నగా? దేవుణ్ని నమ్మే ప్రసాద్ ధర్మకర్తగావున్న రామాలయంలోని దేవుడి నగ గిల్టు నగ!

శేఖరం ఇంకా ఏదో ఆలోచిస్తూండగానే ఒకావిడ షాపు లోనికి వచ్చింది. ఆమె శేఖరాన్ని చూడలేదు.

శేఖరం ఆమెను చూస్తూనే గుర్తుపట్టాడు అరుణ అని. ఆమె తనను చూస్తుందన్న భయంతో వెంటనే ఆ గిల్టు నగను అందుకుని షాపులోంచి బైటకు వచ్చేశాడు. కానీ అక్కణ్నించి దూరం వెళ్ళలేదు. అతని చెవులు షాపులోని సంభాషణ వినడంకోసం పదునెక్కుతున్నాయి.

"రెండు తులాలకు అర్ధణా ఎత్తు తక్కువుందమ్మా— తాకట్టా ....—?"

"తాకట్టయితే ఎంతొస్తుంది?"

"ఎంత కావాలో చెప్పండమ్మా—బంగారం మంచిది. అమ్మితే మళ్ళీ ఇలాంటిది మీకు దొరకదు...."

"ఏడొందలు కావాలి!" అందామె.

శేఖరం ఒక్క క్షణంకూడా అక్కడ నిలబడలేదు.

తను మంచితనం చూపించుకున్నా విశ్వసించలేక తన ఇంట్లోని గాజులు బంగారానివైనప్పటికీ నకిలీవని అబద్ధ మాడిందామె? తన బంగారాన్ని దక్కించుకోవడానికి ఆమె ఆడిన అబద్ధం అది.

భక్తులిచ్చిన బంగారాన్ని గిల్టు నగలుగా మారుస్తూన్న ప్రసాద్ వంశాన్ని తరతరాలుగా ధర్మకర్తలుగా వ్యవహ రించవిస్తున్నాడు భగవంతుడు. అవి గిల్టు నగలు కాబట్టే

ప్రసాద్ పూజారిని అనుమానించడంలేదు. పోయినవి మళ్ళీ చేయించి ఉదారుడిగా పేరు తెచ్చుకుంటున్నాడు.

దేవుడి జోలికి వెడితే సర్వనాశనమై పోతావని హెచ్చరిస్తూన్న ప్రసాద్ పచ్చదనానికి కారణం అతడు దేవుడు జోలికి వెళ్ళడమే!

ఒక ఆడది తన బంగారాన్ని కాపాడుకోవడం కోసం అబద్ధమాడింది. దేవుడామాత్రంకూడా చేయలేక దొంగలకే తనమీద పెత్తనం ఇచ్చుకుని అసహాయుడై చూస్తున్నాడు.

ఈ దేవుడికి భయపడ్డమెందుకు?

అయితే మళ్ళీ ఏ దేవుడి దగ్గరకు వెళ్ళినా గిల్టునగలే దొరుకుతాయన్న భయంతో ఇప్పుడు శేఖరం డబ్బున్న వాళ్ల ఇంట్లోనే దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అదీ ప్రసాద్ ఇంటిలోనే ప్రారంభించాలని కూడా అనుకున్నాడు. తను చెప్పినదానికి భిన్నంగా చేసే ప్రసాద్‌ని మాత్రం శేఖరం మళ్లీ సంప్రదించలేదు. □

దారి ఎటు?

ఒక తాగుబోతు అర్ధరాత్రి—భాయ్! టి. నగర్ బస్‌స్టాప్‌కు దారి ఎటో చెప్పగలవా?

ఇంకో తాగుబోతు: చెప్పగలను. ఇప్పుడు మనం ఎక్కడున్నామో నీవు ముందు చెప్పు అప్పుడు నేను దారి ఎటో చెపుతాను.

రవి—మద్రాసు

ఎమ్.వి.వి.సత్యనారాయణ

ఉరి



పాఠకుల పరిశోధన పోటీ-96

(బహుమతి రు. 50/-లు నగదు)

ఉదయం పదకొండు గంటలయింది.

క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తనకోసం పెట్టిన టపా చూస్తున్నాడు. డిటెక్టివ్ శిరీష్ ఆంగ్ల డిటెక్టివ్ పత్రి

కను తిరగవేస్తున్నాడు. ఇద్దరూ ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు. మధ్యలో టేబులు వుంది.

ఉత్తరం చదవడం ముగించి బల్లమీద పెట్టి కుర్చీలో వెనక్కి వాలాడు గోపాల్. శిరీష్ ఓరకంట అతడిని చూచి, "మెదడుకు పదను పెడుతోందా వుత్తరం?" అన్నాడు.

గోపాల్ దీర్ఘంగా నిట్టూర్చి, "చదువు" అంటూ కాగితం అందించాడు.

శిరీష్ ఆ కాగితాన్ని అందుకుని చూశాడు. డైరీలోని కాగితం అది. జూన్ 6వ తేదీ మీద రాసివుంది. ముందున్న 5 వ పేజీ ఖాళీగా వుంది.

"ఇవ్వాళ జూన్ 7. అంటే నిన్నటి దినచర్యలో రాసిన వుత్తరమా?" అంటూ శిరీష్ తనలో ఆ వుత్తరాన్ని చదవ సాగాడు.

"మనుషులు ఎన్నో ఆశిస్తారు. అన్నీ జరగవు. అయినా ఆశలు చావవు. కాని నాలో ఆశ చచ్చిపోయింది. ఈ బ్రతుకు ఇంతకంటె గొప్పగా వుంటుందని ఏ సాకుతో ఆశించగలను? మట్టిలో పుట్టిగా కలిసిపోయేదాకా నా బతుకింతే."

చదవడం ముగించి బల్లమీద పెట్టాడు శిరీష్.

"ఈ వుత్తరం వచ్చిన కవర్ ఏది?" అడిగాడు శిరీష్.

గోపాల్ చటుక్కున గుర్తొచ్చిన వాడల్లే వొంగి చెత్త బుట్టలో పారవేసిన కవర్లలోంచి ఒక కవరు తీశాడు. తెల్లటి కవర్ అది. ఒక మూలగా ముప్పై పైసల స్టాంపు అంటించి వుంది. ఆకుపచ్చ స్టాంపు. పొలంలో వొంగి కర్షకులు పనిపాటల్లో వున్న బొమ్మ ముద్రించిన స్టాంపు అది. స్టాంపుకి దిగువగా పోలీస్‌స్టేషన్ పేరు వీధి రాసి వున్నాయి. వెనుకప్రక్క.

కె. జయ
2/1-6, కాగితం వీధి
మార్కెట్ వెనుక
విశాఖపట్నం—అని వైపుచేసి వుంది.

గోపాల్ కవరును శిరీష్‌కి అందించాడు. శిరీష్ కవరుమీద వున్న అక్షరాలు చదివి, "జయ ఎవరు? నీకు పరిచయమా?" అని అడిగాడు.

గోపాల్ భుజాలు చరుచుకున్నాడు. "నీకు ఎంత పరిచయమో నాకూ అంతే!" అన్నాడు.

"నువ్వుగాకపోతే మీ స్టేషన్లో ఎవరితోనయినా పరిచయం వుండి వుండాలి."

"ఆల్ రైట్! పరిచయం వుందనే అనుకుందాం. డైరీలో కాగితం చింపి పంపించడంలో అర్థం ఏమిటి?"

శిరీష్ తల పంకించి, కవర్‌ని ఆటూ యిటూ త్రిప్పి చూశాడు. అతడి నుదురు ముడతలుపడింది.

"టపా వచ్చి యెంతసేపయింది?"

గోపాల్ వాచీ చూసుకుని, "పావుగంట అయివుంటుంది. పోస్టుమాన్ టపాతెచ్చి బయట వుండే రైటర్‌కి యిస్తాడు. రైటర్ వెంటనే లోపలికి పంపిస్తాడు." అన్నాడు.

"గెటప్! మనం పోస్ట్‌మాన్‌ని పట్టుకోవాలి." అంటూ శిరీష్ లేచి కవరును జేబులో పెట్టుకుని బయటకు నడిచాడు. గోపాల్ చకచక బయటకు పరుగెత్తాడు. జీపులోకి దూకి స్టార్ట్‌చేశాడు. శిరీష్ జీప్ ఎక్కాడు.

జీపు రోడ్డెక్కింది. నాలుగు వీధులు తిరిగేసరికి పోస్టు మాన్ సైకిలు రోడ్డుమీద పెట్టి స్టాండువేసి చిన్న సందులోకి వెడుతున్నాడు. అతడి చేతిలో వుత్తరాల కట్ట వుంది.

సైకిలుకి వున్న పెద్ద సంచిలో పాకెట్లూ, బుక్‌పోస్టులూ వున్నాయి.

గోపాల్ జీపు హారన్ కొట్టాడు. పోస్టుమాన్ తల త్రిప్పి చూచి జీపుకి దారి యివ్వడానికీ వీలుగా సైకిలును ప్రక్కకి తీయబోయాడు. జీపు సైకిలు ప్రక్కగా ఆగింది. గోపాల్ క్రిందకు దిగాడు. అటుప్రక్కనుండి శిరీష్ దిగి సైకిలు దగ్గరకు వచ్చాడు.

పోస్టుమాన్ ఆశ్చర్యంగా చూచి, "సార్! నా కోసమా!" అన్నాడు.

గోపాల్ తలూపి శిరీష్‌కేసి చూశాడు. శిరీష్ జేబులోంచి కవర్‌తీసి పోస్టుమాన్‌కి చూపించి, "ఈ కవర్ పోలీస్ స్టేషన్‌లో డెలివరీ చేసింది మీరేనా?" అన్నాడు.

పోస్టమాన్ ఆశ్చర్యంగా ఆ కవర్‌వంక చూచి, "ఇది నన్ను వదలదేమో సార్! పోలీస్ స్టేషన్‌లో టపా డెలివరీ చేయబోతూంటే ఈ కవర్ ఎలా జారిపడిందో ఏమయిందో కాని నా సైకిలు సీటుమీద వుంది" అన్నాడు.

"సీటుమీద మీరే పెట్టారా?"

"లేదు సార్! పోస్టాఫీసులో సార్టింగ్ చేసేటప్పుడు కూడా దీన్ని చూచిన గుర్తు లేదు నాకు."

"ఎవరైనా ఈ కవరును సీటుమీద పెట్టే అవకాశం వుందంటారా!"

"బాగా చెప్పారు. పోలీస్‌స్టేషన్ ముందు సైకిలుస్టాండు వేసి మొదట ఎదురుగావున్న సందులో డెలివరీ యిచ్చి వచ్చాను. అప్పుడే ఈ వుత్తరం సీటుమీద కనబడింది."

శిరీష్ అతడికి కవర్‌మీద అంటించివున్న స్టాంపు చూపి,

"ఇది మీ ఆఫీసులో డీఫేస్ చేయబడిన స్టాంపు కాదు. అవునా!" అన్నాడు.

పోస్టుమాన్ స్టాంపును పరీక్షగా చూచి, "అంతే కాదు సార్! ఈ స్టాంపు వేరే కవర్ మీదిది. డీఫేస్ చేశాక ఈ కవర్‌మీద అంటించారు. అందుకే ముద్ర తాలూకా పూర్తి వలయం కవర్‌మీద లేదు."

"వెరీగుడ్! ఈ పరిశీలన ఇరవై నిముషాల ముందు వుండివుంటే...." శిరీష్ మాటలు పూర్తిగాక ముందే గోపాల్ జీపు ఎక్కాడు.

పోస్టుమాన్‌కి థాంక్స్ చెప్పి శిరీష్ జీపు ఎక్కాడు.

జీపు ముందుకి పరుగెత్తింది.

"మార్కెట్ వెనుక వీధిలోంచి ఇంతదూరం ఒక ఆడది వచ్చి కవర్ అందిస్తుందా?" అడిగాడు గోపాల్.

"కవర్ అందించిన వ్యక్తికి అతితెలివి వుంది. అంతే!" అన్నాడు శిరీష్.

2

తలుపులు నెట్టాడు గోపాల్. లోపలికి కొద్దిగా కదిలాయి తప్పితే తెరచుకోలేదు. రెండు అరచేతులతో బలంగా తలుపులను నెట్టాడు. తెరచుకున్నాయి. తలుపుల మధ్య వెనక భాగంలో చిన్న గడియ వుంది. అది నిజానికి బోల్ట్.

శిరీష్, గోపాల్ లోపలికి నడిచారు. ఆ గది చాల మామూలుగా వుంది. మంచం, ప్రక్కగా బల్ల వున్నాయి. ఆ గదిలో పైకప్పుకి శవం వ్రేలాడుతోంది. పైకప్పు దూలానికి కొబ్బరితాడుతో శవం మెడకి వురివేసి వుంది. ఇంటి పనులతో మాసిపోయిన చీరె, దానిమీద మరకలు పడిన రవికె వున్నాయి శవం ఒంటిమీద. చేతులుచాపి విశ్చలంగా



వ్రేలాడుతోంది ఆమె. మొహంలో బాధ కళ్ల లోంచి వెలి పలికి వచ్చినట్టు కళ్లు వికృతంగా తెరచుకుని వున్నాయి. నల్లగ్రుడ్డు లోపలికి తిరిగినట్టుంది. క్రిందినుండి తెల్లగ్రుడ్లు భయంకరంగా కనిపిస్తున్నాయి.

శిరీష్ చెయ్యిచాపి శవం చెయ్యి పట్టుకు చూశాడు.

"ఈమె చనిపోయి రెండు గంటల లోపే అయి వుండాలి" అన్నాడు శిరీష్.

"అవును. అదిగో ఇంకా గుండెల ప్రాంతాలో కొద్దిగా రక్తం గాయాల్లోంచి స్రవిస్తోంది" అన్నాడు గోపాల్.

శవం కాళ్ల క్రింద స్టూలు తిరగబడి వుంది.

శిరీష్ జేబురుమాలు చేతిమీద కప్పుకుని స్టూలును నిల బెట్టాడు. శవం కాళ్లు స్టూలుమీద ఆనివున్నాయి. శిరీష్ స్టూలును ప్రక్కకితీసి సీటును పరీక్షగా చూశాడు.

"ఈమే జయ అయివుండాలి. జయ ఆత్మహత్య చేసు కోవడానికి కారణం ఆమెలో ఆశలు చావడమేనా?"

అన్నాడు గోపాల్.

"ఈమె జయ. సందేహం లేదు. అయితే ఆత్మహత్య చేసుకోలేదు. దారుణంగా హత్య చేయబడింది" అన్నాడు శిరీష్.

"హత్యా!"

"అవును. మనకి కవర్ అంది గంట అయింది. గంట కంటె ముందే ఈమె హత్య చేయబడి వుండాలి. హత్యా సమయం వైద్యపరీక్షలో మరింత కచ్చితంగా నిర్ధారణ అవుతుందనుకో. షుమారుగా జయ హత్యా సమయం కవరు మనకి అందించే ప్రయత్నం సమయం ఒక్కటే అయివుంటాయి. కాబట్టి జయ హత్య చేయబడిందనేది నిర్ధారణ అయినట్టే! పైగా ఈ స్టూల్‌ని జాగ్రత్తగా చూడు. దాని సీటుమీదనే ఆమె నిలబడి వురిపోసుకుని వుంటే ఆమె అడుగుజాడలు స్పష్టంగా సీటుమీద ముద్రపడి వుంటాయి. కాని ఈ స్టూలుమీద ముద్రలులేవు. అంటే హత్యచేసిన వ్యక్తి ఈ స్టూలును ప్రక్కన పడేసి వెళ్లి పోయాడు."

"శిరీష్! తలుపు లోపల బోల్ట్ పెట్టి వుంది."

"సింపుల్!" అంటూ శరీష్ తలుపుల అవతలకు వెళ్లి తలుపులను ఒకకోణంవరకు మూసి బోల్ట్‌ను రింగులో అమరేలాగా గురిచూపి చటుక్కున రెండు చేతులతో తలుపులు దగ్గరగా లాగాడు. బోల్ట్ పడిపోయింది.

గోపాల్ బోల్ట్ లాగి తలుపు తెరిచాడు. శిరీష్ వెనక ఎవరో యిద్దరు నిలబడి వుండటం చూశాడు గోపాల్. శిరీష్ వెనక్కి తిరిగి వాళ్లను తనూ అప్పుడే చూశాడు.

"మీరు జయకి ఏమవుతారు?" అడిగాడు శిరీష్.

"జయ నా భార్య. నా పేరు ప్రకాశం. ఇతడు నా ఫ్రెండు. పేరు రామారావు" అన్నాడు ఇద్దరిలో ఒక వ్యక్తి.

శిరీష్ ప్రకాశంకేసి జాలిగా చూసి, "మీరేం చేస్తుంటారు?" అన్నాడు.

ప్రకాశం కోపంగా చూచి, "మీరు నా యింట్లో నేను లేనప్పుడు ప్రవేశించడమే గాకుండా నన్ను ప్రశ్నలు వేస్తున్నారు" అన్నాడు.

అప్పటికి గోపాల్ బయటికి వచ్చాడు. గోపాల్ యూనిఫాం చూచి ప్రకాశం నిశ్చేష్టుడై, "మీరు పోలీసులా?" అన్నాడు.

"అవును. మీ యింట్లో మీ భార్య చనిపోయింది. అన్నాడు గోపాల్.

"ఆఁ! జయ చచ్చిపోయిందా?" ప్రకాశం గొల్లుమన్నాడు. రామారావు అతడిని పట్టుకుని దగ్గరకు తీసుకున్నాడు.

నలుగురూ లోపలికి నడిచారు. శిరీష్ బల్లదగ్గరికి నడిచాడు. దానిమీద పాత పుస్తకాలూ, ఒక ప్రక్కగా పాత మోడెల్ రెమింగ్‌టన్ టైపు మిషనూ వున్నాయి.

ప్రకాశం శవాన్ని పట్టుకుని తలవాల్చి గొల్లుమన్నాడు. తెరలు తెరలుగా అతడిలో దుఃఖం పొర్లుకొస్తోంది.

గోపాల్ బయటకు వెళ్ళి దగ్గరలోవున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో ప్రవేశించాడు. తన సిబ్బందిని రమ్మని ఆదేశించి తిరిగి ఆ యింటికి వచ్చాడు. అప్పటికి ప్రకాశం తేరుకున్నాడు.

"మీ ఆవిడకి టైప్ చేయడం వచ్చునా?" అడిగాడు శిరీష్.

ప్రకాశం తలూపి, నేను బజార్‌లో టైప్‌చేసి యింటికి మిషను తీసుకు వస్తాను. ఇంకా చేయవలసిన జాబ్‌వర్క్ మిగిలిపోయివుంటే జయ చేసిపెడుతుంది" అన్నాడు.

"ఈ స్టూలు ఎవరిది?"

"ఎదురింటి వాళ్ళది. అప్పుడప్పుడు జయ తీసుకు వస్తుంది."

"మీరు ఇంట్లోంచి వెళ్ళి ఎంతసేపయింది?"

"నేను వుదయాన్నే ఆరున్నర ప్రాంతంలో బయటికి వెళ్ళిపోయాను సార్!"

"రామారావుగారు ఎవరు? ఆయనది ఈ వూరేనా?"

"నా ఫ్రెండ్ అని చెప్పాను గదండీ. నన్ను చూడ టానికి అనకాపల్లి నుండి వచ్చాడు."

"ఎప్పుడు?"

"మొన్న."

శిరీష్ రామారావుకేసి చూసి, "మీరు యింట్లోంచి ఎప్పుడు వెళ్ళారు?" అన్నాడు.

"నేను రాత్రి సెకండ్‌షోకి వెళ్ళి ఇదే రావడం!"

"రాత్రి యెక్కడ పండుకున్నారు?"

"తిరిగి యింటికి రావడానికి వాహనంలేక రైల్వేస్టేష నులో బల్లమీద నిద్రపోయాను."

"అంటే జయ ఆత్మహత్య చేసుకోవటం మీలో యెవ రికీ తెలియదన్న మాట!" అన్నాడు శిరీష్ ఓరకంట చూచి.

"తెలియదు!" అన్నారు యిద్దరూ.

3

"శవం మెడచుట్టూ భూమికి సమాంతరంగా వలయం లాంటి చార వుంది. ఉరితాడు చార మెడమీద ఏటవాలుగా పడుతుంది. అంటే దాదాపు దీర్ఘవృత్తాకారం. ఈ రెండు

చారలూ శవం మెడమీద వున్నాయి. పోలీస్ డాక్టర్ రిపోర్టు ప్రకారం సమాంతర వలయం హత్యాకార్యక్రమములో మొదట ఏర్పడి వుండాలి. అక్కడే రక్తప్రసారం విపరీతంగా ఒత్తిడి చేయబడి వుంది. ఆ వలయం యేర్పడటం వల్లనే ప్రాణం పోయివుండాలి" అన్నాడు గోపాల్.

"హత్యకి ముందు ఆమెను అనుభవించే ప్రయత్నం జరిగిందంటాడు కదా పోలీస్ డాక్టర్." అన్నాడు శిరీష్.

"అవును అందుకే కదా! నేను అతడిని అరెస్టు చేస్తానంటే వారించావు."

"అతడే హంతకుడయితే....జయ శరీరంమీద గాయాలేర్పడే అవకాశం ఎందుకు వుంటుంది? అన్నట్టు టైప్ మిషన్‌మీద వేలిముద్రలు....?"

"లేవు. ఏం అలా అడిగావు?"

"రామారావు ఎలిబీని పరీక్షించావా?"

"ఆఁ! అతడు రాత్రి సినిమాలో గేటువాడితో తగాదా పెట్టుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో పోర్టర్‌ని తిట్టి నాలుగు తిట్లు తిన్నాడు. వాళ్ళిద్దరూ అతడిని గుర్తుపట్టారు."

* * *

[ఇదీ కథ. ప్రకాశం, రామారావు ఇద్దరిలో జయను హత్య చేసిందెవరు? లేక ఇద్దరూ కలిసే చేశారా? సరియైన ఆధారాలతో నిరూపిస్తూ మీ జవాబును 7—6—'80 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం. డె. సభ్యులు కానివారు తమ సమాధానంతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. అత్యుత్తమంగా కేసును పరిశోధించిన ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపుతాము. ఫలితాలు ఆగస్టు '80 నెల సంచికలో చూడండి.

—ఎడిటర్.]

కక్ష

వాణిశ్రీ

పోలీస్ కంట్రోల్ రూంలో టెలిఫోన్ మ్రోగింది.

"పోలీస్ కంట్రోల్ రూం ప్లీజ్."

"నేనొక ముఖ్యమైన సమాచారం యిస్తున్నాను."

"ఎవరు మీరు?"

"ముందు నేను చెప్పేది వినండి. నేనెవరో తర్వాత

చెప్తాను. బాంబే ఎక్స్‌ప్రెస్ దిగాడు ఒక పెద్దమనిషి. ఇప్పుడే పదినిమిషాలయింది. అతని పేరు చంద్రమోహన్. అతను టాక్సీ నెంబర్ ఎం. వై. ఎస్. 7979 లో ఎక్కడికో బయల్దేరాడు. టాక్సీ స్టేషన్‌నుంచి బయల్దేరి మెయిన్ రోడ్డులో పోతోంది. వెంటనే పట్టుకోగలిగితే స్మగుల్డు గూడ్స్ పెద్ద యెత్తున దొరుకుతాయి."

టెలిఫోన్ పెట్టేసాడు అతను యెవరో.

2

గాంధీరోడ్ పోలీస్ స్టేషన్‌కి కంట్రోల్ రూమ్ నుంచి మెసేజ్ వెళ్లింది ఆ టాక్సీని పట్టుకోమని. గాంధీరోడ్ పోలీస్ స్టేషన్ పిటీ మెయిన్ రోడ్డులోనే వుంది.

చంద్రమోహన్ ప్రయాణం చేస్తోన్న టాక్సీ మెయిన్ రోడ్డులో ఆగింది. పోలీస్ ఇనస్పెక్టర్, కొందరు కానిస్టేబుల్సు టాక్సీముందు నిల్చొని వున్నారు.

డ్రయివర్ వెంటనే టాక్సీ దిగి ఇనస్పెక్టర్‌కి విష్ చేసాడు.

ఇనస్పెక్టర్ డ్రయివర్‌తో ఏం మాట్లాడాడో చంద్ర మోహన్‌కి వినిపించలేదు.

డ్రయివర్ డోర్‌లో తలపెట్టి "సార్! మిమ్మల్ని దిగమంటున్నారు ఇనిస్పెక్టర్‌గారు" అన్నాడు.

చంద్రమోహన్ ఆశ్చర్యంగా చూసాడు.

"ఎందుకూ?" అని ప్రశ్నించాడు.

"ఏమో సార్!" అన్నాడు డ్రయివర్.

చంద్రమోహన్ అయిష్టంగానే టాక్సీ దిగాడు.

"ఎక్కడ్నుంచి వస్తున్నారు మీరు?" ప్రశ్నించాడు ఇనస్పెక్టర్ శ్రీనివాస్.

"రైలు స్టేషన్ నుంచి."

"అది మాకు తెలుసు. ఏ వూరినుంచి వస్తున్నారు?"

"హైదరాబాదు నుంచి."

"అబద్ధం, బొంబే నుంచి వస్తున్నారు."

"బాగుంది మీరు చెప్పేది. నేను హైదరాబాదు నుంచి వస్తున్నాను. కాదు బొంబేనుంచి వస్తున్నానని మీరు అంటున్నారు. ఇక నేనేం చెప్పేది. అయినా యెందుకు ఇవన్నీ అడుగుతున్నారు?"

"మాకు పనిలేక అడగడంలేదు. మీ దగ్గర స్మగుల్డు గుడ్స్ వుందని మాకు సమాచారం వచ్చింది. మీసామాను చెక్ చెయ్యాలి" కఠినంగా అన్నాడు యినస్పెక్టర్ శ్రీనివాస్.

చంద్రమోహన్‌కి నిలువు గుడ్లు పడ్డాయి అది విని.

"ఏమిటి మీరు అంటున్నది?" అన్నాడు ఎండిపోతున్న గొంతుతో.

"డ్రయివర్ డిక్కీ తెరువు" అని కానిస్టేబుల్స్ వంక చూపి "టాక్సీ మొత్తం గాలించి చూడండి. సీట్లు క్రింద బాయినెట్ ఎత్తిగూడా చూడండి" అని ఆజ్ఞాపించాడు.

డ్రయివర్ డిక్కీ తెరిచాడు. అందులో కాకీగుడ్డ కవర్ వేసిన పెద్దసూట్‌కేసు, ఎర్ర రంగు ఎయిర్‌బ్యాగ్ మాత్రం వున్నాయి. టాక్సీ మొత్తం గాలించి చూసినా యేమీ దొరకలేదు.

సూట్‌కేసు, ఎయిర్‌బ్యాగ్ స్టేషన్‌లోకి మోసుకెళ్లారు.

ఎయిర్ బ్యాగ్‌లో ఏవో అకౌంటు బుక్సు, లుంగీ, బనీన్లు, సబ్బుపెట్టె, టూత్‌పేస్టు వగైరా వున్నాయి.

సూట్‌కేసు తాళం వేసివుంది.

చంద్రమోహన్ ఇచ్చిన కీస్‌తో అది రాలేదు.

ఇనస్పెక్టర్ కోపంగా చూసి "సూట్‌కేస్ తాళాలు

ఇవ్వండి. ఇంకెందుకు దాపరికం?" అన్నాడు.

"ఇచ్చాను గదా!" అన్నాడు చంద్రమోహన్.

"మరి రావడంలేదే తాళాలు."

"అవి దాని తాళాలే."

"సరే మీరు తియ్యండి."

చంద్రమోహన్ తాళాలు తియ్యడానికి ప్రయత్నించాడు. కాని రాలేదు. సూట్ కేసు వంక అనుమానంగా చూపి కాకీ గుడ్డ కవరు తొలగించాడు.

"సార్! ఈ సూట్ కేసు నాది కాదు" అన్నాడు గట్టిగా.

శ్రీనివాస్ నవ్వి "మర్యాదగా అసలు కీస్ ఇవ్వండి. మీలాంటి స్మగ్లర్లను చాలామందిని చూసాను" అన్నాడు.

చంద్రమోహన్ ముఖం తెల్లగా పాలిపోయింది.

"నిజం సార్ నేను చెప్పేది. నేను స్మగ్లర్ని కాను. హైదరాబాద్‌లో నాకు ఒక హోటల్ వుంది. బ్రాందీషాపు, బార్ వుంది."

"ష్! డోంట్ వేస్టు ది టైమ్. మీ పేరేమిటో గాని...."

"చంద్రమోహన్ సార్!"

"చూడండి మిస్టర్ చంద్రమోహన్. మీరు హైదరాబాదులో బిజినెస్ మాగ్నెట్ కావచ్చు. అంత మాత్రాన స్మగ్లర్ కాకూడదని యెక్కడా లేదు."

"నన్ను నమ్మండి సార్! నేను హైదరాబాదులో బండి యెక్కాను. మధ్యలో యెవరిదో ఈ సూట్ కేసు నాచేతిలో పడింది." వణుకుతూ అన్నాడు చంద్రమోహన్.

"డోంటు బీ సిల్లీ చంద్రమోహన్‌గారూ! మీరుచూస్తే చాల గౌరవనీయులులా కన్పిస్తున్నారు. మేము మర్యాదగా అడిగితే మీరు యేదో కాకమ్మ కథ చెబుతున్నారు. అసలు

మీరు కీస్ యిస్తారా యివ్వరా చెప్పండి."

చంద్రమోహన్ ఏదో చెప్పబోయాడు.

ఇనస్పెక్టర్ కోపంతో "బ్రేక్ ది లాక్స్" అని అరిచాడు.

మరుక్షణంలో పోలీసులు సూటుకేస్ లాక్స్ పగలగొట్టి దాన్ని తెరిచి పెట్టారు.

అందులో స్మగుల్డు గూడ్సు లేవు. అన్నీ పాతగుడ్డలు వున్నాయి. ఒకొక్కటే తీసారు.

అందులో బయటపడిన తలచూసి అంతా నివ్వెర పోయారు కొన్నిక్షణాలు.

అదొక చిన్నకుర్రాడి తల.

చంద్రమోహన్ ఆ తలచూపి తుఫాన్‌లో కొబ్బరిచెట్టు లాగ గజగజ వణికిపోయాడు.

ఇనస్పెక్టర్ శ్రీనివాస్ తీవ్రంగా చూసాడు చంద్ర మోహన్ వైపు.

3

"ఈ తల ఎవరిదో నాకు తెలియదు సార్. దేవుడిమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. అసలు ఆ సూటుకేస్ నాది కాదు. ప్రయాణం మధ్యలో యెవరో మార్చారు" మొత్తుకున్నాడు చంద్రమోహన్.

"ఎవరో యెందుకు మారుస్తారు?" పోలీస్ కమీషనర్ ప్రశ్నించాడు.

"అదే అర్థం కావడంలేదు సార్. నేను యెవర్నో హత్యచేస్తే ఈ తలని వెంటపెట్టుకుని తెస్తానా? ఎక్కడో పాతేసి వుండే వాడిని గదా?"

పోలీస్ ఆఫీసర్లు ముఖముఖాలు చూసుకున్నారు.

"అసలు టాక్సీలో పోతున్నవాడిని మీరు ఎందుకాపారో

నాకు అంతుబట్టడం లేదు. ఎవరో నన్ను స్మగ్లర్‌నని మీకు రిపోర్టు చేసారని ఇనస్పెక్టరుగారు చెప్పారు. కాని, యెక్కడో పొరపాటు జరిగింది."

"ఎక్కడో జరిగింది. ఇప్పుడు మమ్మల్ని ఏం చెయ్యమంటారు? మీ సూట్ కేసులో తల వున్నందుకు అరెస్ట్ చేసి కేసు పెట్టక తప్పదు గదా?"

భయంగా చూసాడు చంద్రమోహన్.

"ఇందులో నా తప్పు ఏముందని చెప్పండి సార్!"

"తప్పు ఎవరిదో కోర్టులో తేలుతుంది."

పోలీస్ కమీషనర్ చాంబర్‌లో చంద్రమోహన్ని ప్రశ్నిస్తోన్న సమయంలో టెలిఫోన్ రింగయింది.

కమీషనర్ రిసీర్ యెత్తి "హలో" అన్నాడు.

"కమీషనర్‌గారు కావాలి" అంది అవతలి కంఠం.

"నేనే కమీషనర్. ఎవరు మీరు?"

"నా పేరు తర్వాత చెప్తాను. ముందు నేను చెప్పింది వినండి."

"చెప్పు."

"మీ ఇనస్పెక్టర్ చంద్రమోహన్ అనే స్మగ్లర్ని పట్టుకున్నారు. కాని అతని సూటుకేసులో స్మగుల్డు గూడ్స్ బదులు ఒక కుర్రవాడి తల దొరికింది. అవునా సార్!"

"అవును. ఈ సంగతి నీకెలా తెలిసింది?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కమీషనర్.

"నాకు తెలిసింది అని ఆశ్చర్యపోతున్నారే? ఈవెనింగ్ ఎడిషన్స్‌లో డెయిలీ పేపర్లలోకూడా రాబోతూ వుంది ఈ వార్త."

"అయితే ఏమంటావ్? ఎవరు నువ్వు?" చిరాకుగా అన్నాడు కమీషనర్.

"కోప్పడకండి సార్! నేను మీ శ్రేయోభిలాషిని. ఇప్పుడా చంద్రమోహన్ సూట్‌కేసు మారిందని గోల పెడుతున్నాడు."

"అవునయ్యా మహానుభావా!"

"కాని అదంతా అబద్ధం!"

"నిజమేనా? మరి ఆ తల సూటుకేసులో పెట్టుకుని యెక్కడికి పోతున్నాడు?"

"ఒక స్వాములవారి దగ్గరకు."

"ఎందుకు?"

"చంద్రమోహన్ ఆస్తిపరుడేగాని అతనికి పిల్లలులేరు. పదిమంది పిల్లల్ని బలియిస్తే, పిల్లలు కలుగుతారనీ, అందులో మగపిల్లవాడు పుడతాడనీ, ఆ పుట్టబోయే వాడు దేశాన్ని ఏలుతాడనీ యెవరో స్వాములవారు చెప్పారట. అందుకే అప్పటినుంచి పిల్లల్ని చంపడం మొదలుపెట్టాడు. ఆ తల యెక్కడో మారుమూల గుహలోవున్న కాళికాదేవి మెడలో వెయ్యాలిట. అదీ కథ."

అతను యెవరో రిసీవర్ పెట్టేసినట్లు క్లిక్‌మని శబ్దం వచ్చింది.

4

స్ప్రింగ్ డోర్ నెట్టుకుని ఆఫీసు రూంలోకి ప్రవేశించిన వ్యక్తిని యెగాదిగా చూసాడు డిటెక్టివ్ రాయప్ప.

అతను నమస్కారం పెట్టాడు రెండు చేతులు జోడించి.

అతనికి సుమారు నలభయ్యేళ్ళు వుంటాయి. తెల్లటి బట్టలు, చత్వారం కళ్ళజోడు, నుదుట కుంకుమ బొట్టు యెవరో గౌరవనీయుడిలా కనిపించాడు.

"కూర్చోండి" అన్నాడు రాయప్ప.

అతను కూర్చుని "నా పేరు చంద్రమోహన్. హైద్రా

బాదులో ఒక హోటల్, బ్రాందీ షాపూ వున్నాయి నాకు"
అని జరిగిందంతా చెప్పాడు.

"మీరేనా చంద్రమోహన్ అంటే. మీకేసు పేపర్లో చదివానులెండి" అన్నాడు డిటెక్టివ్ రాయప్ప.

"నన్ను ఎలాగైనా ఈ కేసులో నుంచి రక్షించాలి" అర్థింపుగా అన్నాడు.

"మీరు నిరపరాధి అయితే తప్పకుండా రక్షిస్తాను."

"నాకే పాపం తెలియదు సార్. దేవుడి సాక్షిగా చెప్తున్నాను."

"మీ మీద యెవరో పగపట్టి ఇదంతా చేస్తున్నారని మీరు అంటారు."

"అంతే సార్. నేను పాముపడగ నీడలో వున్నట్లు భయంతో చచ్చిపోతున్నాను. నా సూట్ కేసు ఎవరో మార్చి వేసి నన్ని కేసులో ఇరికించడం చూస్తే ఇదంతా నా కర్మ

అనిపిస్తోంది."

"కర్మ కాదు. ఎవరికో మీరు అపకారం చేసి వుంటారు. దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు. అదే కర్మ అంటే."

"నేను యెవరికీ అపకారం చేసి యెరుగను సార్. నా గురించి యెవర్నయినా అడగండి. ఎందరికో సహాయం చేశాను. అడిగిన వారికి కాదనకుండా దాన ధర్మాలుచేశాను. గుళ్ళకు చందాలు ఇచ్చాను. పూజలు చేయించాను."

"చేసి వుండొచ్చు. నేను కాదనడంలేదు. ఎన్ని పుణ్య కార్యాలు చేసినా ఒక్క పాపం చేస్తే అవన్నీ తుడిచి పెట్టుకుని పోతాయి. మీకు రామాయణ కథ తెలుసుగదా! రావణాసురుడు రాజుగా తన ప్రజలను కన్నబిడ్డలుగా చూశాడు. ఇక అతని భక్తి గురించి తెలియనివారు లేరు. ఎంత భక్తుడైనా అతను చేసిన ఒక తప్పు, ఒక పాపం గురించి నాశనమై పోయాడు. ఏ దేవుడూ అతన్ని రక్షించలేక పోయారు."

"అన్యాయం సార్! నన్ను రావణాసురిడితో పోలుస్తున్నారు." పేలవంగా నవ్వాడు.

"సారీ! మీరలా అనుకుంటే. ఉదాహరణకు చెప్పాను. పూజలు చేస్తున్నామనీ, దేవుడు మన పక్షం వున్నాడనే అహంభావంతో పాపాలు చేస్తే ఫలితం అనుభవించవలసి వుంటుందని మాత్రమే నేను చెప్పదల్చుకున్నాను" నవ్వుతూ అన్నాడు రాయప్ప.

"తెలిసి తెలిసి నేను యెవరికీ అపకారం చెయ్యలేదు. మరి యెవరు నన్నిలా బాధపెడుతున్నారో అర్థంకావడం లేదు."

"బాగా గుర్తుకు తెచ్చుకోండి."

"రాత్రింబగళ్లు ఆలోచిస్తున్నాను. నాకు యెవరిమీదా అనుమానం రావడంలేదు. నా మీద ఇంత పగబట్టి, నా పరువు తీసి, నన్ను కోర్టుపాలు చేసేటంత కక్ష యెవరి కుందో అర్థంకావటం లేదు." బాధగా అన్నాడు.

"మీరు దిగులుపడకండి. నేను ఎలాగైనా అసలైన నేరస్తులను పట్టుకుంటాను."

"నే నిప్పుడు బెయిల్‌మీద విడుదల అయ్యాను. ఇంటికి వెళ్లాలంటే సిగ్గుగా వుంది. పేపర్లవాళ్లు దీనికి చిలువలు పలవలు కల్పించి గొప్పగా రాశారు. నా ఫోటో గూడా వేశారు నేను హంతకుడినని నిరూపిస్తూ" కళ్ళ నీళ్లు వచ్చాయి చంద్రమోహన్‌కి.

"మీకే పాపం తెలియనప్పుడు ధైర్యంగా వుండండి. ఇటువంటి సమయాల్లో దిగజారిపోగూడదు."

తల వూపాడు చంద్రమోహన్.

"నాకు కొన్ని ముఖ్యమైన వివరాలు చెప్పాలి మీరు. మీకు పిల్లలు లేరని పేపర్లో చదివాను."

"అవును సార్! అందుకని యెన్నో పూజలు చేశాను. ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరిగాను. కాని పిల్లలు కలగలేదు."

"మీ ఇంట్లో యెవరు వుంటారు? మీతో కలపి."

"నా భార్య. నా తమ్ముడు."

"మీ తమ్ముడు ఏం చేస్తుంటాడు?"

"నాతో పాటే వ్యాపారం."

"భాగాలు పంచుకున్నారా?"

"ఆ ప్రసక్తి ఇంకా రాలేదు. మాకు పిత్రార్జితం ఏమీ లేదు. నేను స్వశక్తిమీద సంపాదించాను ఇదంతా. నా తమ్ముడు నాకంటే పదిహేను సంవత్సరాలు చిన్నవాడు.

వాడు రెండేళ్ళ పిల్లవాడుగా వున్నప్పుడు మా అమ్మ పోయింది. ఆ తర్వాత మా నాన్న పోయాడు. నేను ఎన్నో బాధలుపడి ఈ స్థితికి వచ్చాను."

"మీ తమ్ముడి ఫ్యామిలీ మీతోపాటే వుంటారా?"

"వాడికి ఇంకా పెళ్ళి కాలేదు."

"హైదరాబాద్‌లో మీ అడ్రెస్, ఫోన్ నెంబర్ ఇవ్వండి."

చంద్రమోహన్ చెప్పాడు.

రాయప్ప నోట్ చేసుకున్నాడు.

"మీరు హైదరాబాద్ యెప్పుడు వెళ్తున్నారు?"

"ఇప్పుడే వెళ్ళాలనిపించడం లేదు. నా కెందుకో సిగ్గుగా వుంది అక్కడి ఫ్రెండ్స్‌కి ముఖం చూపించాలంటే."

"మరి యెంతకాలం ఇక్కడే వుంటారు?"

"ఈ కేసు ఏదైనా తేలేవరకూ వుండాలనుకుంటున్నాను."

"భలేవారే! కేసులు అంత తేలిగ్గా తేల్తాయా? ఫరవా లేదు వెళ్ళండి."

"కాదులెండి. నాకు వెళ్ళాలనిపించడంలేదు. ఎప్పుడో నా మనసు బాగున్నప్పుడు వెళ్తాను" అన్నాడు చంద్రమోహన్.

"ఈ వూళ్లో యెక్కడ వుంటున్నారు?"

"అప్సర హోటల్లో. రూమ్ నెంబర్ 103."

"దట్సాల్‌రైట్. మీరు వెళ్ళండి. అవసరమైతే నేను ఫోన్ చేస్తాను" అన్నాడు రాయప్ప.

"మీ ఫీజు?"

"వెయ్యి అడ్వాన్సుగా ఇవ్వండి. కేసు పూర్తయ్యాక బిల్ పంపుతాను."

పర్స్ తీసి పది పచ్చనోట్లు టేబుల్ మీద వుంచాడు.

తర్వాత సెలవు తీసుకుని వెళ్లిపోయాడు చంద్ర మోహన్.

5

డిటెక్టివ్ రాయప్ప రిసీవర్ యెత్తి నెంబర్ డైల్ చేశాడు.

"హల్లో! నేను డిటెక్టివ్ రాయప్పను మాట్లాడు తున్నాను."

"గుడ్ మాణింగ్ మిష్టర్ యంగ్ డిటెక్టివ్! హౌ ఆర్ యూ!"

"ఓ.కే. బాగున్నారా?"

"ఏదో అలా వున్నాను. ఏమిటి విశేషం? వూరికే ఫోన్ చెయ్యరు మహానుభావులు."

"విశేషమే వుంది. మొండితల చంద్రమోహన్ కేసు టేకప్ చేశాను."

"వెరీగుడ్! విష్‌యూ గ్రాండ్ సక్సెస్!"

"థాంక్స్!"

"ఆ మానవుడు నిన్ను పట్టుకున్నాడన్న మాట."

"అవును. పాపం చాలా బాధపడుతున్నాడు. అతన్ని చూస్తే హంతకుడిలా కన్పించడంలేదు. ఎవరో అతన్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు త్రాగించాలని పట్టు పట్టినట్లు నాకు అనిపిస్తోంది."

"కరెక్టే కావచ్చు. కాని వుయ్ ఆర్ హెల్ప్‌లెస్."

"ఆ కుర్రాడి తల తాలూకు ఏవైనా వివరాలు తెలిశాయా?"

"లేదు."

"తమ కుర్రాడు కన్పించడం లేదని యెవరైనా రిపోర్టు

చేశారా?"

"ఇంకా రాలేదు. అన్ని స్టేషన్స్‌కీ రేడియో మెసేజెస్ పంపించాము. ఆ తల ఫొటో తీయించి పంపాము, ఎవ రైనా గుర్తుపడతారేమో నని."

"ఆ తల యెక్కడుంది ప్రస్తుతం. నేను చూడాలను కుంటున్నాను."

"మార్చురీలో. స్టేషన్‌కి వస్తే ఇద్దరం కలిపి వెళ్దాం."

"థాంక్స్" రాయప్ప రీసీవర్ క్రెడిల్ చేశాడు.

బులెట్ స్టార్ట్‌చేసి గాంధీ రోడ్డు పోలీస్ స్టేషన్‌వైపు మళ్లించాడు డిటెక్టివ్ రాయప్ప.

6

"ఇదేనా ఆ సూట్‌కేసు?" ప్రశ్నించాడు రాయప్ప.

ఇనస్పెక్టర్ శ్రీనివాస్ తల వూపాడు అవునన్నట్లు.

"నేను చూడొచ్చా?" నవ్వుతూ అడిగాడు.

"నిరభ్యంతరంగా!"

సూట్‌కేస్ తెరచి చూశాడు.

అన్నీ పాతగుడ్డలే. ఎక్కువ లుంగీలు, పీలికలై పోయి వున్నాయి. కొన్ని చిరుగులు పట్టిన బనీన్లు.

"ఆ తలపెట్టిన వాడు ఈ గుడ్డలన్నీ ఎందుకు పెట్టాడో?" నవ్వుతూ అన్నాడు ఇనస్పెక్టర్ శ్రీనివాస్.

"తల కదలకుండా. ఈ గుడ్డలు సపోర్టు వుండబట్టి ప్యాక్‌చేసినట్లు కదలకుండా వుంది" అన్నాడు రాయప్ప.

ఒకొక్కటే చూస్తూ చూస్తూ ఒక చిరిగిన చొక్కామీద దృష్టి నిలిపివేశాడు.

"ఈ షర్టు నాకు కావాలి. ఇవ్వగలరా?"

"ఎందుకు?"

"ఇందులో క్లూ దొరికింది"



"చాకలి గుర్తులా!"

"అవును."

"తీసుకెళ్ళండి రిసీట్ ఇచ్చి" అన్నాడు ఇనస్పెక్టర్.

"థాంక్స్!" అన్నాడు రాయప్ప.

7

"మీ పేరు రాజగోపాల్ కదూ?" అన్నాడు డిటెక్టివ్ రాయప్ప హోటల్ కౌంటర్లో కూర్చున్న వ్యక్తిని చూపి.

"అవును" నవ్వాడు అతను.

"నేను డిటెక్టివ్ రాయప్పని. మీ అన్నగారి కేస్ డీల్ చేస్తున్నాను."

"అలాగా! గ్లాడ్ టూ మీట్ యూ!" లేచి నిల్చుని షేక్ హేండ్ ఇచ్చాడు రాజగోపాల్.

"మీతో కొంచెం మాట్లాడాలి."

"అలాగే! స్పెషల్ రూమ్‌లో కూర్చోండి. పది నిముషాల్లో వస్తాను" అన్నాడు అతను.

రాయప్ప స్పెషల్ రూమ్‌లో కూర్చున్నాడు.

బేరర్ గులాబ్‌జామ్ తెచ్చి ముందు పెట్టాడు. తర్వాత ఫ్రూట్‌సలాడ్ తెచ్చాడు.

కొంచెంసేపటికి రాజగోపాల్ లోపలకి వస్తూనే "సారీ సర్! కొంచెం లేటయింది" అన్నాడు.

"ఫరవాలేదు" అని నవ్వాడు.

"మా అన్నయ్య లెటర్ రాశాడు."

"ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను కేసు. మీ అన్నయ్యను తెలివిగా కేసులో ఇరికించిన వ్యక్తి ఇక్కడివాడే అని నా అనుమానం."

తల వూపాడు రాజగోపాల్.

"మా వదిన ఒకటే గొడవ చేస్తున్నది."

"సహజమేగదా! నాకు కొంత ఇన్ఫర్మేషన్ కావాలి!"

"అడగండి."

"మీ అన్నయ్యమీద యెవరికైనా విరోధం వుందా?"

"నాకు తెలిసినంతవరకూ ఒక్క జగన్‌గాడే మా అన్నయ్యంటే కోపంగా వున్నాడు."

"జగన్ యెవడు?"

"పెరల్ వైన్‌షాపు ప్రొప్రయిటర్."

"ఎందుకొచ్చింది గొడవ?"

"అతని షాపు యెదురుగా షాపు ఖాళీ అయ్యింది. జగన్ దాన్ని తీసుకుని ఫ్యాన్సీషాపు పెట్టాలనుకున్నాడు. కాని అద్దె పెంచి మా అన్నయ్య తీసుకుని బ్రాందీషాపు పెట్టాడు. అందుకని మా అన్నయ్యంటే అతనికి కోపం."

"ఐ.సీ...." అని తల వూపాడు.

ఆ సంగతే ఇంకా వివరంగా చెప్పసాగాడు రాజగోపాల్.

"మీరు అతన్ని అనుమానిస్తున్నారా?" ప్రశ్నించాడు రాయప్ప.

"నా అనుమానం అతని మీదే వుంది" అన్నాడు రాజగోపాల్.

"అతను యెటువంటివాడు."

"రౌడీ వెధవ. వెనుక జులాయిగా తిరిగేవాడు. ఎలాగో ఆ షాపుపెట్టి కాస్త సంపాదించాడు. కొన్ని కేసుల్లో జైలుకి వెళ్లి వచ్చినవాడే!"

"అతను తప్ప ఇంకెవరైనా విరోధులు వున్నారేమో గుర్తుకు తెచ్చుకోండి."

రాజగోపాల్ తల అడ్డంగా వూపుతూ "నా కెవరూ గుర్తురావడం లేదు" అన్నాడు.

"ఈ రోజు మీరు ఖాళీగా వుంటారా?"

"అన్నయ్య లేడు. ఒక్కడినే. ఖాళీ యెక్కడ సార్!" నవ్వాడు రాజగోపాల్.

"దట్సాల్‌రైట్. నేను మళ్లీ కలుస్తాను." అన్నాడు రాయప్ప.

"ఎందుకో చెప్పలేదు మీరు."

"తర్వాత కలుస్తాను. మరేం లేదు. ఈ వూళ్లో లాండ్రీలన్నీ తిరగాలి. ఒక క్లూ దొరికింది."

"ఏమిటి సార్ అది."

"ఇదుగో ఈ షర్టుమీద గుర్తు చూడండి."

పీలికలుగా వున్న షర్టుతీసి చూపించాడు.

"ఈ షర్టు యెవరిదో కనుక్కోవాలి. అంతే గదా!"

"అవును."

"ఇలా ఇవ్వండి. ఎవర్నయినా కుర్రాడిని పంపి తెలుసుకోమంటాను" అన్నాడు రాజగోపాల్.

"నో.... నేనే తెలుసుకోవాలి. మీరు తోడువస్తారేమోనని అడిగాను. అంతే."

"మీరు ఇక్కడ వున్నన్నాళ్లూ మా హోటల్లో వుండండి."

"థాంక్స్. వస్తాను" సెలవు తీసుకుని బైటపడ్డాడు రాయప్ప.

8

"ఈ షర్ట్ 'శశి' అనే అతనిది. పూర్తి పేరు శశికుమార్" అన్నాడు డిటెక్టివ్ రాయప్ప.

"ఎవరు అతను?"

"ఒక దిన పత్రికలో పనిచేస్తున్నాడు."

"అతనికీ మీ క్లైయింట్‌కీ విరోధం వుందా?"

"నేనింకా ఆ సంగతి మా క్లైయింట్‌ని అడగలేదు. అతను ఇక్కడ లేడు ప్రస్తుతం. ఈ కేసుతో ఇరుక్కున్నందుకు చాల బాధపడుతున్నాడు. ఫ్రెండ్స్‌కి ముఖం చూపించడానికే సిగ్గుపడుతున్నాడు."

"ఐ.సీ.... చెప్పండి నన్నేం చెయ్యమంటారు?" ప్రశ్నించాడు డి.యస్.పి.

"అతన్ని పిలిపించి బెదిరించండి చాలు."

"దట్సాల్‌రైట్. మీరు ఇనస్పెక్టర్ అబ్దుల్లాని కలుసుకోండి. నేను ఫోన్‌చేసి చెప్తాను."

"థాంక్స్."

"నో మెన్షన్."

9

"నేను ఆ కుర్రాడిని మర్డర్‌చేసి, ఆ నేరం చంద్రమోహన్ మీద నెట్టాలని చూసానా?" ఆశ్చర్యంతో అన్నాడు శశి.

"అవును."

"భలేవారే! అసలా కుర్రాడిని యెందుకు మర్డర్ చేస్తాను."

"నీకే తెలియాలి."

"అంతా అబద్ధం. నేను మర్డర్ యెందుకు చేస్తాను. ఆ కుర్రాడు యెవడో మీకు తెలుసా? అసలు."

"తెలియదు? ఎవరూ రిపోర్టు చెయ్యలేదు."

"మరి నన్నెందుకు నిర్బంధిస్తున్నారు? నేను మర్డర్ చేశానని మీకు వున్న ఆధారం ఏమిటి?" ప్రశ్నించాడు శశి కుమార్.

"ఇదుగో ఈ షర్టు చూడు. ఇది నీదే కదూ!" చూపించాడు రాయప్ప.

అది చూస్తూనే అదిరిపడ్డాడు అతను.

"అది...."

"బుకాయించకు. అది నీదే. చంద్రమోహన్ వెళ్ళిన ట్రెయిన్‌లోనే వెళ్లావు. సూట్ కేసు మార్చావు. ఆ తల వుంచిన సూటుకేస్ నీదే. అందులో ఈ షర్టు దొరికింది."

శశి ముఖం వివర్ణమై పోయింది.

"చెప్పు....ఎందుకు చేశావు ఈ దారుణం?" యినస్పెక్టరు అబ్దుల్లా దబాయించాడు.

స్టేషన్ బయట ఆటో ఆగిన శబ్దమయింది.

రాజగోపాల్ లోపలకి వచ్చాడు.

శశికుమార్‌ని చూస్తూనే స్థాణువులా నిలబడిపోయి, "నువ్వా!" అన్నాడు.

రాజగోపాల్‌ని చూస్తూనే శశిలో ఆవేశం, కోపం,

దుఃఖం ఒక్కుమ్మడిగా కలగాపులగంగా వచ్చాయి.

"అవును. నేనే ఆ సూట్ కేసు మార్చాను. చంద్ర మోహన్ మీద పోలీసులకు అనుమానం కలిగేటట్లు ఫోన్ చేసింది నేనే...." అన్నాడు శశి.

"యూ రాస్కెల్! యెందుకు చేశావు యీ పని?" ఇనస్పెక్టర్ అబ్దుల్లా కోపంతో కేకలు పెట్టాడు.

"ఇనస్పెక్టర్ యిప్పుడు నాకు అంతా అర్థమయింది" అన్నాడు రాజగోపాల్.

డిటెక్టివ్ రాయప్ప విస్మయంగా చూశాడు.

"శశికుమార్ చెల్లెలు గీత, నేను ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాం. కానీ మా అన్నయ్య ఒప్పుకోలేదు. ఆయనకు కట్నం ఆశ వుంది. రాజమండ్రిలో మా బంధువులు పాతికవేలు కట్నం ఇస్తామని తిరుగుతున్నారు. నేను అన్నయ్యను నెమ్మదిగా ఒప్పించాలని ప్రయత్నిస్తున్నాను. అన్నయ్య గీతను చేసుకునేది లేదని శశితో నిష్కర్షగా చెప్పేశాడు. మా తమ్ముడిని పిచ్చివాడిని చేసి వలలో వేసుకున్నారని తిట్టాడు.

శశికుమార్ కోపంతో చెల్లెలికి వేరేసంబంధం కుదిర్చాడు. కొంతకాలం ఆగమని నేను యెంత బ్రతిమాలినా వినలేదు. కాని తన మూర్ఖపు పట్టుదలతో గీత జీవితం నాశనం చేశాడు. ఇష్టంలేని పెళ్లి చేసుకోదల్చుకోక గీత ఆత్మహత్య చేసుకుంది."

"అందుకే .... నా చెల్లెలు చావుకు కారణమైనవాళ్ల అన్నను జైలుపాలు చెయ్యాలనే కక్షతో ఇదంతా చేశాను"

ఆవేశంతో అన్నాడు శశికుమార్.

"అందుకని ఒక పసివాడి ప్రాణాలు తీస్తావా? దుర్మార్గుడా! నీ పగ చల్లారడానికి నిండు ప్రాణాన్ని పొట్టన పెట్టుకున్నావు" రాయప్ప కోపంతో అన్నాడు.

శశికుమార్ ఏడుస్తూ "లేదుసార్! లేదు....ప్రాణాలు తీసేంత దుర్మార్గుణ్ని కాదు నేను. అంత దుర్మార్గుణ్నే అయితే నా చెల్లెలు జీవితం నాశనం కావడానికి కారణమైన వాడినే చంపివుండే వాడిని" అన్నాడు.

"మరి ఆ కుర్రాడి తల?"

"ఒకరోజు నేను స్మశానానికి వెళ్ళాను. మా వీధిలో ఒక ముసలమ్మ పోతే అందరితోపాటు వెళ్ళాను. అప్పుడు ఒక చిన్న కుర్రవాడిని పాతిపెడుతూ వుంటే చూసాను. నా మనస్సులో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. చంద్రమోహన్ మర్నాడు వూరు వెళుతున్నాడని నాకు తెలుసు.

"ఆ రాత్రి అతను వాడే సూటుకేస్ లాంటిది సంపాదించి కాకీరంగు గుడ్డ కవరుకుట్టి అచ్చం అలాగే తయారు చేసాను. తెల్లవారుజామున స్మశానానికి వెళ్ళి ఆ కుర్రాడి సమాధి త్రవ్వాను. అతని తలను కోశాను. చంద్రమోహనెక్కిన కంపార్టులోనే. యెక్కాను. అతను గుర్తు పట్టకుండా గడ్డం మీసాలు పెట్టుకున్నాను. సమయం చూసి సూటుకేసులు మార్చాను. సిటీ స్టేషన్ దిగి టాక్సీ యెక్కగానే నెంబర్ గుర్తు పెట్టుకుని పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్ చేసాను."

శశికుమార్ చెపుతుంటే అంతా నిశ్చేష్టులై వింటూ కూర్చుండిపోయారు. ☐

వెర్రి అభిమాని

వి. లక్ష్మీదేవి



ఉదయం నుండి యెదురు చూస్తున్నది అనసూయ తన కోసం ఫోన్ వస్తుందేమోనని. మాటి మాటికి మేనేజర్ గదివేపు చూస్తున్నది ఏ క్షణంలో మేనేజర్ పిలుస్తాడోనని. పని వున్నా లేకపోయినా మేనేజర్ గదిలోకి ఛీటికీ మాటికి వెళ్ళి వస్తున్నది.

తను షైపు చేసిన ఉత్తరాలు తీసుకుని మేనేజర్ గది లోకి అడుగు పెట్టిందీసారి.

మేనేజర్ ఆమె షైపు చేసిన వుత్తరాలు చదివి సంతకం చేసి మళ్ళీ ఆమెకి అందించాడు. వాటిని అందుకుని తలుపు నెట్టుకుని రాబోయింది. అంతలో ఫోను మ్రోగింది.

అనసూయ క్షణంపాటు తలుపు దగ్గరే ఆగిపోయింది. మేనేజర్ మాట్లాడి అనసూయ వైపుచూపి "మీకే!" అన్నాడు.

రిసీవరు అందుకుని "అనసూయని మాట్లాడుతున్నాను" అంది.

"సారధిని మాట్లాడుతున్నాను."

"ఎక్కడనుండి?" అడిగింది మేనేజర్వైపు చూస్తూ అతను తమ సంభాషణ వింటున్నాడేమోనని. కాని అతను అనసూయ విషయం పట్టించుకున్నట్లు లేదు. ఏవో కాగితాలు దీక్షగా చూస్తున్నాడు.

"మద్రాసు."

"మద్రాసా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఈ మధ్యాహ్నమే మద్రాసు చేరుకున్నాను."

అనసూయ నిమిషం పాటు మౌనంగా వుండిపోయింది. మేనేజర్ బయట కెళ్ళడంచూసి—"మూర్తికి తెలుసా నీవు వెంటాడుతున్నట్లు" అడిగింది.

"ఇంతవరకు అతను గమనించలేదు. అనుభవం లేకపోయినా, ప్రయివేట్ డిటెక్టివ్లా వేటాడాను."

"ఎలా వున్నాడతను?"

"అఫ్కోర్స్! అతనికేమి? నిక్షేపంగా వున్నాడు. అతను హోటల్ 'సరోవర్'లో బస చేసాడు. విస్కీ బాటిల్ ఖాళీ చేస్తున్నాడు. నేను ముందే చెప్పాను కదూ?

అతనికి తాగటం తప్ప మరొకటి చేతకాదని."

"మైగాడ్! అతను తాగుతున్నాడా? ఆ మత్తులో అతను ఏమయినా చేయగలడు. నేను వెంటనే బయలదేరి వస్తున్నాను" చెప్పింది.

నవ్వాడు సారధి. "నేను వద్దని చెప్పినా నీవు వినవు. నీకు సాయంత్రం 7 గంటల బండి తప్పితే, మరొకటి లేదనుకుంటాను."

"అయితే 7 గంటల బండికి బయలుదేరుతున్నాను."

"అయినా నీవు అనవసరంగా కంగారు పడుతున్నావను కుంటాను?"

"కాదు. తాగిన మత్తులో అతను ఏదయినా చేస్తాడేమో నని భయంగా వుంది. దాన్నుండి నేను తప్పించగల నను కుంటాను?"

"అంటే?"

"ఆత్మహత్య చేసుకోవచ్చని నా భయం."

ఈసారి బిగ్గరగా నవ్వాడు సారధి. "ఆత్మహత్యా? తాగేవాళ్లు ఆత్మహత్య చేసుకోరు."

"మూర్తి సంగతి నీకు తెలీదు."

"వాడి సంగతి నీకంటె నాకు బాగా తెలుసు. వాడు నా పార్ట్‌నర్. ఆ విషయం మర్చిపోయినట్లున్నావు?"

"మర్చిపోలేదు. ఎలా మర్చిపోగలను? నీవు సహాయం చేయక పోయినట్లయితే, మీ కంపెనీ డబ్బు వాడుకున్నం దుకు అతను జెయిల్ శిక్ష అనుభవిస్తూ వుండేవాడు."

"అఫ్‌కోర్స్! అతడిని చూసికాదు వదిలేసింది. నీ మొహంచూసి, నీవంటే నా కిష్టమని వదిలేసాను."

కఠినంగా అంది అనసూయ. "సారధీ! నీకు చాలా సార్లు చెప్పాను. అయినా మరోసారి చెబుతున్నాను. నేను

వివాహితను. మూర్తి నా భర్త. ఆయనకి నేనంటే ఎంతో యిష్టం. నాకు కూడా! ఆయన వున్నంతవరకూ, నాకు మరో ఆలోచన లేదు."

"థాంక్స్!" నవ్వాడు సారధి. "నీ వుద్దేశ్యం నాకు అర్థమయింది. నీ కోసం యెంతకాలమైనా యెదురుచూడ గలను" చెప్పాడు.

సంభాషణ మధ్యలో త్రుంచివేసింది అనసూయ. "సాయంత్రం 7 గంటల బండికి బయలదేరుతున్నాను. తప్పకుండా స్టేషన్‌లో కలుసుకో" అని రిసీవరు పెట్టి తన చేతి వాచీ వంక చూసుకుంది. ఆరున్నరయింది. ఆలోచన చేయకుండా నేరుగా స్టేషన్‌కి బయలుదేరింది.

బండి మద్రాసు చేరేటప్పటికి రాత్రి 10 గంటలయింది. సారధి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆమె నెమ్మదిగా నడచివస్తుంటే, చిలిపిగా చూసాడు.

"నీవు అలా చూడటం నాకు నచ్చలేదు" అంది అనసూయ గొణుగుతున్నట్లుగా.

"అది నా తప్పుకాదు నీ అందానిది." అదోలా నవ్వాడతను.

ఇద్దరూ బయటికి వచ్చి కారు యెక్కారు.

"నీవు కారులో వచ్చావా?"

"అవును. మూర్తి రైలు యెక్కటం చూసి, నేను కారులో అతని కంటె ముందుగా చేరుకున్నాను."

అనుసూయ ఇక మాట్లాడలేదు.

"ఇప్పుడు చెప్పు. నీవు ఇక్కడికి వచ్చావు. ఆ తర్వాత ఏం చేయదల్చుకున్నావ్!"

"మూర్తితో మాట్లాడుతాను. ఆయన్ని నాతో తీసుకు వెళతాను. రానంటే, నేనూ యిక్కడే వుంటాను, అతను

స్థిమితపడ్డదాకా" చెప్పింది.

"అయితే, అతను త్రాగుతూంటే, నీవు చూస్తూ వుంటావన్న మాట బావుంది కానీ అతని వాలకం చూస్తే మరో వారంపాటు యిక్కడే వుండేట్లున్నాడు."

"నేనూ వుంటాను."

"వారం రోజులు సెలవు తీసుకున్నావా?"

"లేదు. రేపు వుదయం ఫోను చేస్తాను."

"అనసూయా! అతను ఏదో చేస్తాడని నీవు యెందుకు భ్రమపడుతున్నావ్?"

ఆమె సమాధానం చెప్పలేదు. నిముషంపాటు సారధి వంక చూసి, వెనక్కి వ్రాలి కళ్ళు మూసుకుంది. గతం ఆమె కళ్ళముందు కదిలింది.

2

మూర్తి అనసూయని పెళ్ళి చేసుకునే నాటికి అతను సారధితో కలసి వ్యాపారం చేస్తున్నాడు. అనసూయకి— మూర్తికీ విచిత్రమైన పరిస్థితుల్లో పరిచయం కల్గింది.

మూర్తి నిజానికి చాలా నిరాడంబరంగా జీవించేవాడు. చేతినిండా డబ్బు వున్నా, చెడు అలవాట్లు మాత్రం లేవు. అతనిది ఒక్కటే ధ్యేయం. చిన్నతనం నుండీ కష్టాల్లో పెరిగినవాడవటంవల్ల వీలైనంత డబ్బు సంపాదించాలనే అతని కోరిక.

మూర్తి, అనసూయల పెళ్ళినాటికి, దాదాపు పదివేలు మూర్తి అకౌంట్‌లో వుంది.

కాపరానికి వచ్చిన అనసూయకి మూర్తి పద్ధతి ఏ మాత్రమూ నచ్చలేదు. వ్యాపారం చేస్తూ, చిన్న యింట్లో వుండటం అస్సలు నచ్చలేదు. కనీసం కూర్చోటానికైనా మంచి కుర్చీలు లేవు.



మూర్తి యెంత నచ్చచెప్పినా వినలేదు అనసూయ. ఆమె ప్రోద్బలంమీద చివరికి 500 రూ॥కి పెద్దయిల్లు అద్దెకి తీసుకున్నాడు. ఖరీదైన ఫర్నిచరు కొన్నదాకా అనసూయ నిద్రపోలేదు.

ఒక్కటేమిటి? ఆమె మోజుపడిన వస్తువల్లా కొన్నాడు. ఫలితంగా బేంకిలో వున్న డబ్బు హారతి కర్పూరంలా హరించుకుపోయింది.

"చూడు ఇన్నాళ్ళూ కష్టపడి కూడబెట్టినదంతా అయిపోయింది. సంపాయించినంతసేపు పట్టలేదు ఖర్చు అవటానికి" విసుగ్గా అన్నాడు మూర్తి.

"డబ్బుదేముంది? ఈ రోజు పోతే రేపు వస్తుంది. అయినా డబ్బు అనుభవించటానికి కాకపోతే మరెందుకు? పైగా మీరు చేస్తున్నది వ్యాపారమాయె! ఎంతలో కూడబెట్టగలరు?" అని తేలికగా కొట్టిపారేసింది అనసూయ.

అంతేకాని, ఆమె సరదాలు మాత్రం తగ్గించుకోలేదు.

సారధి తరచుగా మూర్తివాళ్ళ యింటికి వచ్చేవాడు. మూర్తి యింట్లో వున్నా, లేకపోయినా వచ్చేవాడు. అనసూయవైపు ఆరాధనాపూర్వకంగా చూసేవాడు. అతని చూపులు అనసూయకి నచ్చలేదు. ఆమె వారించనూలేదు.

రానురాను అనసూయ ప్రవర్తన మూర్తికి విసుగు కల్గించేది. ఆమె పైనవున్న ప్రేమవల్ల ఆమెని ఏమీ అనేవాడు కాదు మూర్తి.

ఆమె కోరిన డబ్బు యిచ్చేవాడు

ఓ రోజు హఠాత్తుగా సారధి వచ్చి చెప్పాడు. మూర్తి ఆఫీసు డబ్బు వాడుకున్నాడు తన స్వంత ఖర్చుల కోసరం. తను తలుచుకుంటే, మూర్తిని కోర్టుకి లాగి శిక్ష వేయించ గలనన్నాడు.

అనసూయ సారధిని బ్రతిమాలింది. సారధి నెమ్మదిగా అన్నాడు.

"వాడి మొహం కాదు. నీ వంటే నాకు అదో రక మైన అభిమానం. ఏమిటో చెప్పలేను. అందుకే ఊరు కుంటున్నాను."

ఈ విషయం ఎలా తెల్సిందోగానీ, మూర్తి చెవిన పడింది. అంతే, ఆ క్షణం నుండి అతను మారిపోయాడు. అవకాశం దొరికినప్పుడల్లా అనసూయమీద విరుచుకుపడే వాడు. దానికి తగ్గట్లు త్రాగటం నేర్చుకున్నాడు.

"చివరికి మీరు త్రాగుతున్నారా?" అక్కసుగా అడిగింది అనసూయ.

"నోర్ముయ్! అంతా నీ వల్లే జరిగింది. సర్వనాశన మయ్యాను. పైగా నీతులు చెబుతున్నావా?" గర్జించాడు.

"అంత పోషించలేనివాళ్ళు పెళ్ళెందుకు చేసుకోవటం?"

వెటకారంగా అంది అనసూయ.

"ఛీ! దిక్కుమాలిన గోల. నీతో సంసారం చేయటం కంటె, ఉరివేసుకు చావటం మేలు. పరువుగా బ్రతికేవాడిని కాస్తా బజారున పడ్డాను. నవ్వులపాలయ్యాను. నాకు బ్రతకాలనే లేదు. ఇహ ఈ జన్మలో నీ మొహం చూడను. ఈ నాటితో, నీకూ—నాకూ చెల్లు" విసురుగా బయటికి నడిచాడు మూర్తి.

3

కారు కుదుపుతో బాధగా కళ్ళు తెర్చింది అనసూయ. కారు హోటల్ 'సరోవర్' ముందు ఆగివుంది.

లోనికి అడుగు పెడుతుంటే, దిబ్బరొట్టెలా లావుగా వున్న మనిషి సారధిని పలుకరించాడు.

"యింకా ఆయన లోనుండి బయటికి రాలేదు సార్!" చెప్పాడు దిబ్బరొట్టె.

సారధి అనసూయవైపు చూసి చెప్పాడు. "నీవు అనుక్షణం మూర్తిని కనిపెట్టి వుండమన్నావు. స్టేషన్‌కి వచ్చేప్పుడు, ఇతనికి వంద యిచ్చి కాపలా పెట్టాను."

"ఫరవాలేదు. నీ డబ్బు పైసలతో సహా యిస్తాను" వ్యంగ్యంగా నవ్వుతూ చెప్పింది అనసూయ.

లిఫ్టు యెక్కారు. "ఆరు" చెప్పాడు సారధి లిఫ్ట్ బోయ్‌తో.

ఆరో అంతస్తులో లిఫ్ట్ ఆగగానే ఓ రూమ్‌వైపు నడిచాడు సారధి. గది తలుపులు యింకా వేసి వున్నాయి.

అనసూయ నెమ్మదిగా తలుపు తట్టింది. సమాధానం లేదు. మళ్ళీ మళ్ళీ తట్టింది. పేరుపెట్టి పిల్చింది. అయినా సమాధానం లేదు.

"బహూశా, మత్తుగా నిద్రపోతూ వుండివుండవచ్చు"

చెప్పాడు సారధి.

అనసూయ సారధివైపు చూసింది. అది గమనించి అన్నాడతను. "భయపడాల్సింది లేదు. బాగా త్రాగివున్నాడు కదూ? వెంటనే నిద్రపట్టి వుంటుంది. క్రింద మేనేజర్‌తో మాట్లాడి వస్తాను. ఇవి స్ప్రింగ్ 'లాక్‌డ్' డోర్స్. లోపల తాళం వేసుకుని వుండవచ్చు. అడిగి డూప్లికేట్ తాళంచెవి తెస్తాను" అని క్రిందికి వెళ్ళిపోయాడు.

మరో పదినిమిషాలు తర్వాత సారధి మేనేజర్‌తో కలసి వచ్చాడు. మేనేజర్ చేతిలో తాళంచెవి వుంది. దాన్ని 'కీ' హోల్‌లో వుంచి త్రిప్పాడు 'క్లిక్' మన్న శబ్దంతో తాళం పీడిపోయింది. తలుపు నెట్టాడు. రాలేదు.

"బహుశా ఆయన లోపల గడియ వేసుకుని వుండాలి అందుకే తెరుచుకోలేదు" చెప్పాడు మేనేజర్.

అనసూయ అసహనంగా చూసింది అతడివైపు. అది గమనించాడతను. మళ్ళీ తలుపుతట్టి మూర్తిని లేపటానికి ప్రయత్నించాడు మేనేజర్. కాని లాభం లేకపోయింది.

"అయామ్ వెరీ-వెరీ సారీ మేడమ్! మీకు మావల్ల చాలా, యిబ్బంది కలిగింది. మా కష్టమర్స్‌కి ఎలాంటి యిబ్బంది కలిగినా ఆ లోపం మాదే!" మర్యాదగా వేడుకున్నాడు.

అతనలా బ్రతిమాలుతూంటే, అనసూయ మొహమాటంగా అంది. "ఫర్వాలేదు. అయినా ఇందులో మీ తప్పు ఏముంది?"

"మరి ఇప్పుడు ఏమిటి చేయటం?" సారధి, అనసూయ వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

ఆమె మేనేజర్ వైపు చూసింది.

తడబడ్డాడు మేనేజర్ "తలుపు పగలగొట్టవచ్చు. కానీ

మేడమ్, మీరు మా గురించికూడా ఆలోచించాలి. అది మాకు ఎంత నష్టమో! చాలా ఖరీదైన తలుపులు. పైగా ఉక్కులాంటి తలుపులు. అంత సులభం కాదనుకుంటాను" అని నిమిషంపాటు ఆలోచించి "చెప్పానుగా మీకు ఎలాంటి యిబ్బంది కలిగించను. నేను ఆలోచిస్తాను" అంటూ తలుపు వంక పరీక్షగా చూసాడు.

నిజానికి తలుపు పగులగొట్టటంకంటె, మరో మార్గం లేదు. అయినా అతను ఆలోచిస్తున్నాడు. అతని దృష్టి తలుపు పైనున్న వెంటిలేటర్ పైన పడింది.

"వెంటిలేటర్‌ద్వారా ప్రయత్నించవచ్చు ననుకుంటాను" సాలోచనగా అన్నాడు మేనేజర్.

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగాడు సారధి.

మేనేజర్ సమాధానం చెప్పకుండా క్రిందికివెళ్ళి దాదాపు నాలుగైదు నిమిషాల తర్వాత ఓ నిచ్చెన తనవెంట తీసుకు వచ్చాడు. అది ఆరడుగుల పొడవుగల నిచ్చెన. దాన్ని తలుపుకి ఆనించి ఎక్కాడు.

జేబులోంచి 'స్క్రూడ్రైవర్' తెపి, వెంటిలేటర్‌ని పరిశీలించాడు. అడ్డంగా లోనికి చూసాడు. ఏమీ కన్పించలేదు. పైగా, అద్దాలకి పచ్చరంగు వుండటంవల్ల లోన వున్నవి కనబడటం లేదు.

అతను తన పని ప్రారంభించాడు. పది నిమిషాల తర్వాత వెంటిలేటర్ వున్న ఫ్రేంకి వున్న 'స్క్రూలు' తీసాడు. ఆ తర్వాత అద్దాన్ని క్రిందికి దింపాడు అతి జాగ్రత్తగా.

అనసూయ, సారధి, మేనేజర్ చేస్తున్న పనిని చూస్తున్నారు కుతూహలంతో.

"బహుశా, అతను బెడ్‌రూమ్‌లో వుండి వుండాలి. ఈ

వెంటిలేటర్ గుండా లోనికి నేను వెళ్ళటం సాధ్యపడదు. చాలా లావు. మీరూ యించుమించు నా అంత లావే! అనసూయగారూ! మీరు ప్రయత్నించవచ్చనుకుంటాను" చెప్పాడు.

తల ఊపింది అనసూయ. ఆ తర్వాత నిచ్చెన ఎక్కింది. లోనికి త్రొంగిచూసి, "ఎలా? నేల ఆరడుగుల పైనే వుందనుకుంటాను?" అంది నీరసంగా.

మేనేజర్ నవ్వుతూ, "అందుకే త్రాడు కూడా తెచ్చాను. దీని చివర లోనికి జారవిడుస్తాను. మీరు దీని ద్వారా లోనికి వెళ్ళవచ్చు. రెండో చివర నేనూ, సారధిగారూ, పట్టు కుంటాము మీరు దిగటానికి వీలుగా" చెప్పాడు.

మరుక్షణంలో అనసూయ వెంటిలేటర్ద్వారా, త్రాడు ఆధారంగా లోనికి జారింది. వెనువెంటనే బెడ్ రూమ్లోకి పరిగెత్తింది. మరో రెండు నిమిషాల్లో తలుపు దగ్గరికి పరు గెత్తింది. ఆయాసంలో రొప్పుతున్నదామె! రొప్పుతూనే తలుపు తీసింది.

ఆమె కళ్ళల్లో వున్న భయాన్ని చూసి "ఏమిటి? ఏమైంది?" అడిగాడు సారధి కంగారుగా.

అనసూయ నీరసంగా, పాలిపోయిన వదనంతో పడక గది వైపు చూపింది. ముగ్గురూ పడకగదివైపు నడిచారు.

4

గది మధ్యలో మంచంపైన ఓ ఆకారం పడుకుని వుంది. అతని మొహం చూస్తే నిద్రపోతున్నట్లుంది. ఎడమ చేయి అతని పొట్టపైన వుంది. కుడిచేయి దిండుపై వ్రాలి పోయి వుంది.

గుండెపై—ఎడమవైపు యెర్రగా, రక్తంతో తడిసిన గాయం వుంది. ఆ గాయం కత్తివల్ల పడిన గాయంగా

గుర్తించారు. సారధీ, మేనేజర్ పరీక్షగా చూసి "శ్వాస ఆడటంలేదు. ప్రాణంపోయి చాలా సేపయిందనుకుంటాను" అన్నారు.

అనసూయ తూలింది—అంతలోనే నిలద్రొక్కుకుని, బాధగా తన రెండు చేతులతో మొహం కప్పుకుని కుర్చీలో కూలబడింది.

"అనసూయా! ధైర్యంగా వుండు" చెప్పాడు సారధి.

పేలవంగా నవ్వి అంది "నాకు అనుమానమే! ఆయన యిలాంటిది ఏదో చేస్తారని" అంది ఏడుపు ముంచుకు రాగా.

"అంటే, ఆత్మహత్య చేసుకున్నాడంటావా?"

"నో! అలా జరిగి వుండటానికి వీలులేదు. అలా అయితే, కత్తి ఏమయింది?" అన్నాడు మేనేజరు.

అప్పుడు చూసారు అనసూయ, సారధి ఇద్దరూ. మంచంక్రిందా—అన్నిచోట్లా! కత్తి దొరకలేదు కానీ, క్రింద రెండు విస్కీ-సీసాలు మాత్రం కన్పించాయి. అవి ఖాళీ సీసాలు.

హఠాత్తుగా సారధి ఓ విస్కీ-బాటిల్ అందుకుని— "అయితే యిది హత్య అయివుండాలి. అంటే, హంతకుడు ఇంకా యిక్కడే వున్నాడన్న మాట" అంటూ బాత్‌రూం వైపు చూసాడు.

"అంటే, అందులో వున్నాడనా మీ అనుమానం" అడిగాడు మేనేజర్.

సారధి సమాధానం చెప్పలేదు. సీసా మూతివైపు పట్టుకుని బాత్‌రూంవైపు నడిచాడు. నిమిషంపాటు ఆగి 'చటుక్కున' తలుపు తెరిచాడు.

అతనూహించిన విధంగా అందులో యెవ్వరూ లేరు.

నలువైపులా చూసాడు. హంతకుడు తప్పించుకోటానికి వీలులేదు. మళ్ళీ పడకగదిలోనికి వచ్చాడు.

"లేదు! హంతకుడు మంచంవైపు వున్న కిటికీ ద్వారా పారిపోయి వుండాలి" చెప్పాడు.

నవ్వాడు మేనేజర్. "ఇది ఆరో అంతస్తు. ఇక్కడి నుండి క్రిందికి యెవరైనా దిగాలనుకుంటే—చచ్చాడన్న మాటే! పైగా దేన్ని ఆధారంగా చేసుకుని పారిపోతాడు? అసంభవం?" అన్నాడు.

"ఎందుకు సాధ్యం కాదు? ఈ కిటికీ ప్రక్కగది కిటికీ, ఆనుకుని వున్నాయి. ఈ గదిలోంచి హంతకుడు ప్రక్క గదిలోకి పారిపోవటం చాలా సులభం."

"కానీ—ఆ గది ఖాళీగా వుంది. పైగా బయట తాళం వుంది. అయినా చూద్దాం" అని బయటికి వెళ్ళి పది నిమిషాల్లో తిరిగివచ్చాడు.

"మీ అనుమానం నిరాధారమైనది. అందులో ఎవరూ లేరు."

"ఎడమ ప్రక్క గదిలో....?"

"అదీ ఖాళీదే! తాళం వుంది."

"అయితే సందేహంలేదు. ఈ కిటికీ ద్వారానే హంతకుడు పారిపోయి వుండాలి. బహుశా త్రాడులాంటిది ఏమైనా ఉపయోగించి వుండాలి" అన్నాడు సారధి.

"ఏమో యెలా తెలుస్తుంది? మనం పోలీసులని వెంటనే పిలపటం మంచిదనుకుంటాను" అన్నాడు మేనేజరు.

5

ఫోను చేసిన ఇరవై నిమిషాల తర్వాత డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శివపాదం తన బృందంతో హోటల్‌కి వచ్చాడు.

హోటల్ మేనేజర్ యెదురుగా వెళ్ళాడు. ఫోను చేసింది తనేనని చెప్పుకున్నాడు.

"శవాన్ని యెవరైనా కదిల్చారా?" అడిగాడు శివపాదం.

"లేదు" చెప్పాడు మేనేజర్.

"అయితే ముందు నేను శవాన్నిచూసి వస్తాను" అని సార్జంట్ రంగన్‌వైపు తిరిగి "నీవు వీళ్ళతో యిక్కడే వుండు. మేనేజర్‌ని కూడా తీసుకువెళతాను" అని పైకి వెళ్ళిపోయాడు.

అనసూయ తన చేతిగడియారంవంక చూసుకుంది. "పదకొండున్నర అయింది" అనుకుంది మనసులో.

అరగంట తర్వాత శివపాదం తిరిగి వచ్చాడు.

"కత్తి రెండు ఎముకల మధ్యనుండి తిన్నగా గుండెలోనికి దూసుకు వెళ్ళింది. వెంటనే పోయాడు. రక్తంకూడా యెక్కువ పోయినట్లు లేదు. కత్తిదెబ్బకి అరిచే ఛాన్స్‌కూడా లేదనుకుంటాను. కానీ అంతా తమాషాగా వుంది."

"ఏమిటి?" అడిగాడు రంగన్.

"తలుపు లోపలనుండి గడియపెట్టి వుందని మేనేజర్ చెబుతున్నాడు. వెంటిలేటర్ ద్వారా అనసూయ లోనికి వెళ్ళిందనీ చెప్పాడు."

రంగన్, అనసూయవైపు చూసాడు.

"అవును. సారధీ, మేనేజర్ ఇద్దరికీ వెంటిలేటర్ గుండా లోనికి వెళ్ళటం సాధ్యం కాలేదు. వాళ్ళ త్రాడు లోనికి విడిచారు. దాని ఆధారంగా లోనికి వెళ్ళాను" చెప్పిందామె.

"వెల్! లోన గొళ్ళెం పెట్టి వుంది అంటే, హంతకుడు కూడా లోన ఎక్కడో దాగివుండాలి. అది ఆరో అంతస్తు కదూ?" అన్నాడు రంగన్.

"వీళ్ళకీ ఇలాంటి అనుమానమే వచ్చిందిట. వెంటనే చెక్ చేసారు. చివరికి బాత్‌రూంలో కూడా. ఎవ్వరూ లేరు. హత్య జరిగిన గదిలో వున్న కిటికీద్వారా పారిపోయి వుండాలి. కానీ, అలాంటి ఆధారాలు ఏమీ లేవు."

"ఏమైనా వ్రేలిముద్రలు...."

"మనవాళ్ళు ప్రయత్నం చేస్తున్నారు."

"ప్రక్కగదిలో ఎవరైనా...." అడిగాడు రంగన్.

"నో! ఎవరూ లేరు. అవి రెండూ ఖాళీగా వున్నాయి. వాటి కిటికీలు తెరిచే వున్నాయి కానీ, బయట తాళాలు వున్నాయి."

"హత్య యెప్పుడు జరిగింది అంటున్నాడు డాక్టర్?"

"బహుశా 9 - 9.30 మధ్య అయి వుంటుందని చెప్పాడు."

"శవ పరీక్ష చేయాలి. అప్పుడుకానీ సరియైన సమయం తెలీదు."

"హతుడు నీ భర్త. అవునా?" అడిగాడు శివపాదం.

తలూపింది అనసూయ.

"గూడూరునుండి మద్రాసు వచ్చాడు దేనికి?"

"తెలీదు. బహుశా త్రాగటానికి అయి వుండవచ్చు."

"నీవూ గూడూరునుండి వచ్చావు?"

"అవును. సారధికూడా!" చెప్పింది.

"ఆశ్చర్యంగా వుంది. త్రాగటానికి గూడూరు నుండి మద్రాసు రావాల? ఎందుకు? అతను త్రాగటం క్రొత్తగా నేర్చుకున్నాడా?"

"అవును. వ్యాపారం విషయంలో అప్ సెట్ అయినట్లున్నారు" చెప్పింది.

"ఏ వ్యాపారం? ఏ విషయంలో?"

"సారధీ, నా భర్త పార్టనర్స్. నా భర్త ఏదో డబ్బు వాడుకున్నారని నాకు సారధి చెప్పాడు. సారధి దయచూపక పోయినట్లయితే, ఆయన జైల్లో వుండేవారు."

"ఎందుకు అంత దయ?" అడిగాడు శివపాదం సారధిని.

"అనసూయ అంటే, నాకు చాలా అభిమానం. ఆమె కొసం నేను ఏదైనా చేస్తాను" చెప్పాడు సారధి.

"ఐ.సీ!" వ్యంగ్యంగా నవ్వాడు శివపాదం. ఆ తర్వాత అనసూయవైపు తిరిగి "నీ భర్త మద్రాసులో వున్నాడని నీ కెలా తెలుసు?"

"సారధి ఫోన్ చేసాడు. సాయంత్రం ఆరుగంటలకి అనుకుంటాను. నేను సారధిని అడిగాను నా భర్తని కని పెట్టి వుండమని. అసలే ఆయన ఈ వ్యాపారం విషయంలో చికాకుతో వున్నారు. పైగా త్రాగటం నేర్చుకున్నారు. ఆయన సంగతి నాకు తెలుసు. ఆవేశంలో ఏదైనాచేసే మనస్తత్వంగల మనిషి. సారధి ఫోనుచేసి

ఆయన మద్రాసు చేరుకుని, హోటల్లో గది తీసుకుని త్రాగు తున్నారని చెప్పాడు. నేను 7 గంటల బండికి బయలు దేరాను. మద్రాసు చేరేటప్పటికి పదయింది. సారధి నన్ను స్టేషన్‌లో కలుసుకున్నాడు.''

"ఈ హత్య 9-30 లోపున జరిగిందని నిర్ధారణ అయింది. ఆ సమయంలో నీవు ప్రయాణం చేస్తున్నావు. నీకు ఈ హత్య చేసే అవకాశం లేదు'' అని సారధివైపు తిరిగి "ఆమె చెప్పింది నిజమేనా?'' అడిగాడు.

సారధి తలవూపి "అంటే మీరు ఆమెని అనుమా నిస్తున్నారా?'' అన్నారు.

"అదంతా రొటీన్! భర్త హత్యచేయబడితే, భార్య కూడా అనుమానితుల జాబితాలోకి వస్తుంది. అది సరే! ఇక నీ సంగతి చెప్పు. నీవు అతడిని వెంటాడుతూ మద్రాసు చేరుకున్నావు. అవునా?''

"వెంటాడటం కాదు. ఏ అఘాయిత్యం చేయకుండా కనిపెడుతూ వచ్చాను. అతను మద్రాసుకి టికెట్ కొను క్కోగానే, నేను కారులో అతనికంటె ముందుగా మద్రాసు చేరుకున్నాను. అతను స్టేషన్ నుండి తిన్నగా హోటల్‌కి వచ్చి, గది తీసుకుని, త్రాగటం మొదలుపెట్టాడు. సాయంత్రం ఆరింటికి అనసూయకి ఫోను చేసి యీ విషయం చెప్పాను.''

"ఐ.సీ! అతను మీ కంపెనీ డబ్బు వాడుకున్నా వదిలే శావు. పైగా అనసూయ కోరికపైన అతను యెలాంటి అఘాయిత్యమూ చేయకుండా వెంటాడావు? అవునా? దీని వల్ల... అంటే, అనసూయపైన వున్న అభిమానం....సారీ ప్రేమవల్ల అంతేనా?''

"చెప్పానుగా! ఆమె అంటె నాకు వెర్రి అభిమానం!''

"హతుడి జేబులో పర్సువుంది. దానిలో సుమారు వెయ్యి పైనే డబ్బు వుంది. ఉంగరం, గడియారం అలాగే వున్నాయి. కాబట్టి ఈ హత్య డబ్బుకోసం జరగలేదు అని చెప్పవచ్చు. కానీ—సారధీ నీపైన నాకు అనుమానంగా వుంది. నీవు హతుడిని గూడూరునుండి వెంటాడివచ్చావు. నీవు తప్ప అతడినెరిగిన వాళ్ళు ఇంకెవరూ లేరు...."

"ఇన్స్పెక్టర్!" గట్టిగా అర్చింది అనసూయ "సారధి నేను కోరిన తర్వాతే నా భర్తని అనుసరించాడు. మీరు అనవసరంగా సారధిని అనుమానిస్తున్నారు" చెప్పింది.

"అనుమానంగా ఉందన్నాను కానీ, నిర్ధారణ అయిందన లేదుగా" అని నవ్వి "అతడి కొక్కడికే అవకాశం వుంది. నీ వంటె, అతనికి ప్రాణం. నీ కోసం ఏదైనా చేస్తానని యింతకు ముందేగా చెప్పాడు. నీవు కోరగానే హతుడిని వెంటాడి—అవకాశం దొరకగానే హత్యచేసి...." అని శివపాదం అంటుండగా సార్జంట్ రంగన్ చిన్న చేతి సంచితో లోనికి వచ్చాడు.

"ఏమిటి?" నుదురు చిట్లిస్తూ అడిగాడు శివపాదం.

"మీరే చూడండి" అని నవ్వి—సంచీలోంచి చిన్న ఐకిట్ తీసి, దాన్లోనుండి రక్తంతో తడిసి ఎండిపోయిన కత్తిని బల్లపై నుంచాడు.

శివపాదం దాన్ని ముట్టుకోకుండా పరీక్షగా చూసాడు.

అది గమనించిన రంగన్ అన్నాడు "దానిపై వ్రేలి ముద్రలు లేవు. చెరిపేసారు."

"ఈ కత్తిని ఇదివరలో—మీ యిద్దరిలో యెవరైనా చూసారా?"

"ఇది ఆయనదే! ఎప్పుడూ తనతో వుంచుకుంటారు."

"ఎక్కడ దొరికింది?" అడిగాడు శివపాదం రంగన్

వైపు చూసి.

"సారధి కార్లో, సీటుక్రింద ఓ మూల దొరికింది."

శివపాదం సాలోచనగా అన్నాడు "దీనిపైనవున్న రక్తం —హతుడి రక్తం ఒకటేనా? కాదా? పరీక్షకు పంపించు."

6

మర్నాడు ఉదయమే అనసూయ మద్రాసు నుండి గూడూరు బయలుదేరింది.

మెయిల్ స్పీడుగా వెళ్తూంది. అనసూయ ఆలోచిస్తున్నది.

ఎంత సపోర్ట్ చేసినా, సారధిని మాత్రం శివపాదం వదిలిపెట్టలేదు. వదిలిపెట్టాలని తనకూ లేదు. అతని కారులో దొరికిన కత్తి గురించి అతను ఎలాంటి సమాధానం చెప్పలేకపోయాడు. చివరికి సారధిని హత్యానేరం క్రింద అరెస్ట్ చేసాడు ఇన్స్పెక్టర్.

నిజానికి ఈ హత్య సారధి చేయలేదు. అనసూయా చేయలేదు. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒకవేళ ఈ విధంగా ఆమె భర్త ఆత్మహత్య చేసుకోకుండా వున్నట్లయితే, అనసూయ, మూర్తి హత్యకి ఏర్పాట్లు ఏవో ముందే పూర్తిచేసి వుంచింది.

అనసూయకి తెలుసు. ఆమె భర్త తగవు పడి వెళ్ళిన తర్వాత ఆత్మహత్య చేసుకుంటాడని ఊహించింది-కానీ, అలాగే జరుగుతుందని మాత్రం అనుకోలేదు. మూర్తి యేదైనా భరించగలడు కానీ, అవమానం మాత్రం భరించలేడు.

అందుకే సారధిని రిక్వెస్ట్ చేసింది మూర్తిని వెంటాడమని-కాని ఆమె కసాయి హృదయంతో తనను బలిపశువు చేయబోతుందని వూహించలేదు ఆ వెర్రి అభిమాని.

అనుసూయ నెమ్మదిగా లేచి టాయ్‌లెట్‌లోకి వెళ్ళింది. తలుపు వేసుకుని రెండు నిమిషాలపాటు మవునంగా నిలబడింది. మెయిల్ వింత శబ్దంచేస్తూ పరుగెడుతూంది.

ఆమె నెమ్మదిగా తనతో తీసుకువచ్చిన హేండ్‌బాగ్‌ని తీసి ఓపెన్‌చేసి అందులో చూసి నవ్వుకుంది. లోపల చేతిగుడ్డంతా రక్తంతో తడిసి ఎండిపోయిన మరకలు.

దాన్ని టాప్‌క్రింద వుంచింది పదినిమిషాలపాటు. మరకలు చాలావరకు కరిగిపోయి ఓ విధమైన మరకలు తేలాయి. రక్తపు మరకలుగా గుర్తించటం కష్టం.ఆ తర్వాత కిటికీ అంచులగుండా దాన్ని బయటికి జారవిడిచింది.

ఆ తర్వాత తన జాకెట్‌లోంచి చిన్నకాగితం తీసి చదువుకుంది. అది మూర్తి ఆత్మహత్యా వుత్తరం. అందులో యిలా వుంది__

"అనసూయా!

నేను ఆత్మహత్య చేసుకోక తప్పటంలేదు. నీతో కాపురం చేయలేను. ఈ అవమానం భరించలేక...."

ఆ వుత్తరాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి బయటికి నెట్టింది.

ఆ తర్వాత క్షణంపాటు హాయిగా ఊపిరి తీసుకుని, టాయ్‌లెట్‌లోంచి బయటికి వచ్చి తన సీటులో కూర్చుంది.

మూర్తి లక్షరూపాయలకి ఇన్స్యూర్ చేయకపోతే__ అనసూయ వెంటిలేటర్‌లోంచి దిగి తన భర్త శవాన్ని చూసిన తర్వాత__అది ఆత్మహత్యగా గమనించి__అతని చేతిలోని ఆత్మహత్యా ఉత్తరాన్ని, గుండెల్లోంచి కత్తినీ తీసి సారధి కారులో పడేసివుండేది కాదు.

అప్పుడు సారధి హత్యానేరం క్రింద అరెస్ట్ అయ్యేవాడూ కాదు. □

రిజర్వాయరులో శవాలు

ఎస్. డి. చైతన్య

తెల్లవారింది!

లోకమంతా నిద్రలేచింది. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు. అలలులేని ప్రశాంతమైన చెరువులా వుందా వూరు. ప్రశాంతమైన చెరువులో రాయి విసిరితే అల్లకల్లోలంగా తరంగాలు రేగి ప్రశాంతత లోపించినట్లు— రిజర్వాయరులో యువకుని శవం తేలియాడుతుందనే వార్త

ప్రశాంతమైన ఆ వూళ్ళో కలతను కలిగించింది.

ఊళ్ళో జనం తండోపతండాలుగా వచ్చి శవాన్ని చూసి వెళుతున్నారు. అది యాత్రాస్థలం కనుక అక్కడికొచ్చే టూరిస్టులు కూడా చూసి వెళుతున్నారు. ఇప్పటికే ఆ శవాన్ని కొన్ని వందలమంది చూసి వెళ్ళారు. కానీ యెవరూ గుర్తుపట్టలేకపోతున్నారు. మృతుని ముఖం కనిపించకుండా వుండటం కూడా ఒక కారణం కావచ్చు.

శవం నీటిలో బోర్ల పడివున్నది. తలా, చేతులు మాత్రం కనిస్తున్నాయి. మిగతా శరీరమంతా నీళ్ళల్లో మునిగివుంది. నీళ్ళు నిశ్చలంగా వుండటం మూలాన అతడు తొడుక్కున్న తెల్లప్యాంటు, అరికాళ్ళు కనిపిస్తున్నాయి.

తొమ్మిదిగంటల ప్రాంతంలో ఎవరో ఫోన్‌చేసి ఆ సమాచారాన్ని పోలీసులకు అందించారు.

ఒక హెడ్ కానిస్టేబులు పదిమంది పోలీసులు జీపుమీద వచ్చారు. జీపును డామ్ మీదనే ఆపి—మెట్లమీది నుండి క్రిందికి దిగి శవాన్ని బయటికి తీయించడానికి తగిన ఏర్పాట్లు చేయించారు. చేపలు పట్టడానికి వుపయోగించే బుట్టతో ఓ నలుగురు జాలర్లు వెళ్ళి-చచ్చిన పెద్దసైజు చేపను లాక్కొచ్చినట్లు శవాన్ని ఒడ్డుకు లాక్కొచ్చారు.

శవాన్ని గుర్తుపట్టి అక్కడ వున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అతను వూళ్ళో అందరికీ చిరపరిచితుడైన శివనారాయణ.

శివనారాయణ ఆ వూళ్ళో వున్న లక్ష్మి థియేటరులో పనిచేస్తున్నాడు. రోజూ సైకిలుమీద వెళ్ళి అ రోజు థియేటరులో ఆడుతున్న సినిమా గురించి ఎడ్వర్‌టైజుమెంట్ చెయ్యడం అతని పని. చాలాచోట్ల ఎడ్వర్‌టైజుమెంటు

కోసం రిక్షను ఉపయోగిస్తారు. అది కొండ ప్రాంతంలో కట్టిన వూరు కనుక అప్ అండ్ డౌన్స్ యెక్కువగా ఉన్నాయి. రిక్షను ఉపయోగించడం ఆ వూళ్ళో చాలా కష్టం. మామూలుగా పాసింజర్స్‌ను తీసుకెళ్ళే రిక్షలు కూడా ఆ వూళ్ళో కనిపించవు.

శివనారాయణ గొంతు చాలా మృదుమధురంగా వుంటుంది. సైకిలుమీద రికార్డులు అవీ వేయడానికి వీలుండదు. కాబట్టి తనే సినిమా పాటలు పాడతాడు మైకులో. కాస్సేపు పాటలు పాడతాడు. కాస్సేపు ఆడుతున్న సినిమాలోని డైలాగులు చెపుతాడు. ప్రతివీధిలోనూ తన సైకిలును ఆపి అక్కడ ఆడుకునే కుర్రవాళ్ళతో ఏవో సినిమా పాటలు పాడిస్తుంటాడు. పరిచయమైన గొంతులు వినిపించేసరికి ఇళ్ళల్లో వున్న వాళ్ళంతా ఆసక్తిగా ఆలకిస్తుంటారు. పాట పూర్తికాగానే శివనారాయణ ఎడ్వర్‌టైజుమెంటు చేస్తాడు.

శివనారాయణకు ఇరవై సంవత్సరాలుంటాయి. మనిషి నల్లగా వున్నా బలంగా వుంటాడు. ఎప్పుడూ సినిమా విషయాలు—అవి తప్పితే వ్యభిచార కొంపలకు కొత్తగా వచ్చిన అమ్మాయిల విషయాలు తప్పించి, ఇంకే విషయమూ అతను మాట్లాడలేడు.

శివనారాయణ అందరితో సరదాగా వుంటాడు. అతనికి విరోధులు ఎవరూ లేరు. అతనికి ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టకాలం ఏమొచ్చిందో ఎవరికీ అర్థం కాలేదు.

రిజర్వాయరులో దూకి చచ్చిపోయింది శివనారాయణయే అని తెలియగానే అతని తల్లీ తండ్రి గోడుగోడున ఏడుస్తూ వచ్చారు. "నిన్న సాయంకాలం మైకుచెప్పి వచ్చి బువ్వ తిని సినిమా టాకీసువైపు వెళ్ళినోడు ఇయ్యాల యిట్లా అవుతాడని అనుకోలేదు దేవుడో!" అంటూ శోకాలు పెడు

తోంది శివనారాయణ తల్లి.

పోలీసులు పంచనామా జరిపి, శవాన్ని తల్లిదండ్రులకు హాండ్ఓవర్ చేసారు. వాళ్లు జరిగిన సంఘటనను ఆత్మ హత్యగా నమోదు చేసుకున్నారు. సినిమాహాలు ప్రొప్రాయిటరు కర్మకాండ జరిపించే నిమిత్తం మృతునికి కుటుంబానికి రెండువందల రూపాయలు యిచ్చాడు. థియేటర్ సిబ్బంది అంతా కదిలివెళ్ళి అతన్ని పాతిపెట్టేవరకు వాళ్ళకు పూర్తి సహాయాన్ని అందించారు.

సంతాప సూచకంగా థియేటర్‌ను ఒకరోజు మూసి వేసారు!

2

శివనారాయణ చనిపోయి వారం రోజులయింది. ఊరు వాళ్ళంతా దాదాపుగా అతన్ని మరిచిపోయారు—అతని తల్లిదండ్రులు తప్ప. ఇప్పుడు వూరంతా ప్రశాంతమైన చెరువులో వుంది.

మధ్యాహ్నం పన్నెండుగంటలు!

రిజర్వాయరులో మరొక యువకుని శవం తేలియాడుతోందనే వార్త ప్రజలను, పోలీసులను ఆశ్చర్యపరిచింది.

శవాన్ని బయటికి తీయించి చూసారు. అతని పేరు శశిమోహన్. కొన్నాళ్లు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఏదో అంతగా పేరులేని కంపెనీలో పనిచేసి మానేశాడు. గ్రాడ్యుయేట్.

ప్రస్తుతం అతనికి ఉద్యోగమేమీ లేదు. వూరికే వీధులన్నీ తిరుగుతూ వుంటాడు. ఎక్కువగా పుల్లయ్య పాన్‌షాప్ దగ్గర సిగెరెట్లు తగలేస్తూ వచ్చిపోయే అమ్మాయిలను కామెంట్ చేస్తూ కూర్చొని వుంటాడు. వాళ్ళనాన్న అక్కడి వర్క్‌షాపులోనే పని చేస్తున్నాడు.

పాపం అతనికి రాకరాక ఉద్యోగానికి కాల్ లెటర్ వచ్చిందట. ఇంటర్వ్యూకు వెళ్ళడానికి అతని దగ్గర డబ్బు లేక పుల్లయ్యను ఒక పాతికరూపాయలు అప్పు అడిగితే- అతను పదిరూపాయలైతే సర్దగలను, మిగితావి యింట్లో అడుక్కో-మని సలహా యిచ్చాడట. ఇంట్లో అయితే ఒక పాతికరూపాయలు ఇవ్వగలరట. కానీ అవి చాలవేమోనని మరో పాతికరూపాయలు అప్పు అడిగాడట. తన షాపుకు వచ్చిన ప్రతివాడితో ఇదే మాట అంటున్నాడు పుల్లయ్య.

రేపు ఇంటర్వ్యూకు వెళ్ళవలసినవాడు. ఆ విషయము తెలిసివుండి కూడా ఆత్మహత్య చేసుకున్నాడంటే—ఇన్స్పెక్టర్ శేఖర్‌కు నమ్మశక్యం కాలేదు. అతనికి యిది హత్య ఏమోననే అనుమాన మొచ్చింది. వెంటనే శవాన్ని పోస్టుమార్టంకు పంపించాడు.

పోస్టుమార్టంలో తేలిన విషయం విని ఇన్స్పెక్టర్ శేఖర్ ఆశ్చర్యపోయాడు. అతని పురుషబీజాలను పిసికి చంపేసారట. ప్రాణం పోయాకనే-రిజర్వాయరులో పారేసి నట్లుగా డాక్టర్లు చెప్పారు.

శశిమోహన్‌ను హత్యచేయాల్సిన అవసరమెవరికున్నది? హత్య వింతగా వుందేమిటి? కత్తి, పిస్తోలులాంటి మారణాయుధాలు ఉపయోగించకుండా-పుషరుబీజాలను పిసికి చంపేసారేమిటి?

కొంపదీసి వారంరోజుల క్రితం చచ్చిపోయిన శివనారాయణదీ హత్య కాదు గదా! అతన్ని పోస్టుమార్టంకు పంపించకుండా వుండటం పొరపాటు అయింది. శివనారాయణ శవం హత్యగా భావించటానికి ఏమాత్రం ఆస్కారం లేకండా వుంది. శవాన్ని చూసిన ప్రతివారు ఆత్మహత్యేనని తేల్చి చెప్పారు. బహుశా శివనారాయణది హత్యకాక



పోవచ్చు అనుకున్నాడు ఇన్స్పెక్టర్.

శశిమోహన్‌ను ఇంత దారుణంగా హత్యచేసిన హంతకుడి అంతు తేల్చుకోవాలనుకున్నాడు ఇన్స్పెక్టర్ శేఖర్. పరిశోధన ప్రారంభించాడు.

శశిమోహన్‌కున్న స్నేహితులందరినీ కలిపి—అతని గురించి, అతని అలవాట్లు గురించి తెల్సుకున్నాడు. అప్పుడప్పుడు క్లబ్బుకు వెళ్ళి పేకాట ఆడతాడని తెలసి—అతనితో ఆడేవాళ్ళందర్నీ ప్రశ్నించాడు. లైబ్రరీకి వెళతాడని తెలిసి—లైబ్రేరియన్‌ను ప్రశ్నించాడు. అతను చదివే పుస్తకాల గురించి ఎంక్వయిరీ చేసాడు.

కేసు ముందుకి సాగడానికి ఎటువంటి ఆధారాలూ దొరలేదు.

3

సోమవారం వుదయం!

ఆ ప్రాజెక్టుకు చుట్టుప్రక్కల వున్న గ్రామాలనుండి పాలు, పెరుగూ అమ్ముకొనడానికి కొందరు గ్రామీణులు

కట్టెలమ్ముకోవడానికి కొందరు లంబాడీలు వస్తూ వస్తూ వూళ్ళోకి ఒక వార్తను మోసుకొచ్చారు. రిజర్వాయరులో యెవరో మాంచి వయసులోవున్న యువకుడు చచ్చిపడి వున్నాడని.

ఆ వార్త విన్న ప్రజల ఆశ్చర్యానికి అవధులు లేవు. ఎన్నడూ లేనిది రిజర్వాయరులో దూకి జనాలు ఈ తీరుగా చచ్చిపోతున్నారెందుకో వాళ్ళకు అర్థం కావటంలేదు. అసలు వారే చస్తున్నారా—ఎవరయినా చంపిగానీ—బల వంతంగా నెట్టిగానీ చంపుతున్నారా? ఇదొక పజిల్‌లా తయారయింది జనాలకు.

ఆ వూళ్ళో ప్రతి ఒక్కరికీ ఈ విషయమే చర్చనీయాంశమై పోయింది. చాలామంది తలిదండ్రులు—ముఖ్యంగా ఎదిగిన కొడుకులు వున్నవాళ్ళు భయంతో వణికిపోతూ వున్నారు.

మహాభారతంలో....బకాసురుడనే రాక్షసుడికి ఆహారముగా రోజూ ఒకడిని పంపేవారట. లేకుంటే వూరు వూరంతా సర్వనాశనం చేస్తానని బెదిరించాడు వాడు. ఇప్పుడెవరూ అలా వార్నింగివ్వకుండానే వారానికి ఒకడిని బలి తీసుకుంటుంటే సహజంగానే ఆ వూళ్ళో వాళ్ళు భయంతో వణికిపోతున్నారు.

క్షణాల్లో ఈ వార్త పోలీసులకు తెలిసిపోయింది. వాళ్ళు కంగారుగా వాహనాల్లో పరుగెత్తుకుని వచ్చారు. శవాన్ని బయటకు తీయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆ శవం ఎవరిదో యింకా తేలనేలేదు. అక్కడ నిల్చొని చూస్తూన్నవాళ్ళ గుండెలు సస్పెన్స్‌తో పీకుతున్నాయి. పనులమీద వూరువదలి వెళ్ళిన యువకుల తాలూకు తలిదండ్రులు భయకంపితులై చూస్తున్నారు ఎటువంటి

ఘోరాన్ని చూడవలసి వస్తుందో ఏమో! అని.

అప్పుడే డి. యస్పీగారు జీపుమీద వచ్చారు. లొకేషన్ అంతా జాగ్రత్తగా పరిశీలించారు.

రాత్రిపూట రిజర్వ్‌పోలీసు దళాలను కాపలాగా వుంచే ఏర్పాట్లు చేసారక్కడ. "అనుమానాస్పదమయిన వ్యక్తులను పట్టుకొనివచ్చి పోలీస్‌స్టేషన్‌లో పడుకోబెట్టండి! తెల్లవారిన తర్వాత వదిలేయండి" అని ఆజ్ఞలు జారీచేసారు.

ఈలోగా జాలరులు శవాన్ని బయటకు తీసారు. అది జయప్రకాశ్‌ది.

డామ్ డివిజన్ ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నాడు అతను. క్లర్కుగాకంటే — నాటకాల్లో వేషాలు వేసేవాడుగా అందరికీ చిరపరిచితుడు. గుమాస్తా వుద్యోగము అతని వృత్తి అయితే—నాటకాలు ఆడటం మనోవృత్తి. మంచి విప్లవాత్మకమైన నాటికలను, నాటకాలను సెలక్టు చేసుకుని—స్థానిక ఆడిటోరియంలో ఆడుతూ వుంటాడు. అతను స్వయంగా కొన్ని నాటికలను వ్రాసి ప్రదర్శించాడు.

"నాటకాలు ప్రజలను మేల్కొల్పాలి కాని—జోకొట్టి నిద్రపుచ్చకూడదండి. జానపద నాటకాలు, చారిత్రాత్మక నాటకాలు, పౌరాణికాలంటే నా కసహ్యం సార్! అవి ప్రజలకెంతమాత్రం ఉపకరించవు. అందుకే నేను వాటి జోలికి పోను."

ఒక నాటకం ప్రదర్శన ముగిసిన తర్వాత పై మాటలు డీయస్పీగారితో అన్నాడు జయప్రకాశ్. అతన్ని చూడగనే అవే మాటలు గుర్తొచ్చాయి డీయస్పీగారికి. "పాపం,జయప్రకాశ్ చాల మంచివాడు. ఇతన్నెందుకు చంపారో అర్ధం కావడంలేదు శేఖర్." అన్నారు డీయస్పీగారు.

"ఇతన్ని మీరు యెరుగుదురా సార్!" అన్నాడు ఇన్స్

పెక్టర్ శేఖర్.

"ఔను. ఇతను ఆడిన నాటకాలు నాలుగయిదు సార్లు చూసాను. రెండుసార్లు నన్ను ముఖ్యఅతిధిగా కూడా పిలిచాడు" అన్నారాయన.

క్షణాల్లో విషయం ఊరంతా ప్రాకిపోయింది. జయ ప్రకాశ్‌కు భార్య ఇద్దరు బిడ్డలు వున్నారు. వాళ్ళు గోడు గోడున ఏడుస్తూ వచ్చారు. నాటక సమాజాలవాళ్ళు అంతా వచ్చారు. వాళ్ళంతా అతని స్థితినిచూపి ఏడ్చేసారు.

డి యస్పీ ఆజ్ఞమేరకు వెంటనే శవాన్ని పోస్టుమార్టంకు పంపించారు.

పోస్టుమార్టం జరిపిన డాక్టర్ల ఆశ్చర్యానికి అంతులేదు. "సేమ్ టైప్ ఆఫ్ మర్డర్!" అని తేల్చేసారు. గతంలో శశిమోహన్‌ను చంపినట్లే (పురుషబీజాలను పిసికి) ఇతన్ని కూడా చంపారు. విగతజీవుడు అయ్యాకే రిజర్వాయరులో పారేసారు.

ఈ హత్యల వెనకవున్న నరరూప రాక్షసులను పట్టుకోవడానికి పోలీసు యంత్రాంగం తీవ్రమయిన కృషి జరుపుతోంది. డి. యస్పీ గారు అదనపు పోలీసు దళాలను ఇతరచోట్లనుండి తెప్పించారు.

పాతికమంది పోలీసులు సివిల్ డ్రస్సులమీద అనుక్షణం వూరంతా గాలిస్తున్నారు. ఇకముందు ఎటువంటి అవాంఛనీయమయిన సంఘటనలు జరగకుండా చూడాలని వాళ్ళకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

4

ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఇంట్లో శ్రీమతి గొడవ భరించలేక—ఆరోజు సతీసమేతంగా సినిమాకు వెళ్ళాడు. టికెట్లు కొనుక్కుని వెళ్ళి హాల్లో కూర్చున్నాడు.

కాస్సేపటి తర్వాత సినిమా ప్రారంభమయింది. ముస లాడికి మేకప్ దట్టించి—ఇదిగో ఈ కుర్రాడు శృంగారాన్ని ఒలకబోస్తాడు చూడండోచ్! అంటూ తెలుగు సినీ పరి శ్రమ అందించిన ఓ శృంగారంలేని శృంగార చిత్రాన్ని చూడటంలో మనస్సును లగ్నం చేయలేకపోయాడు ఇన్స్పెక్టర్. అతను తనచుట్టూ కూర్చున్న వ్యక్తులను పరిశీలిం చటంలో నిమగ్నమైపోయాడు.

ఆయన శ్రీమతి మాత్రం ఇంట్రెస్టుగా సినిమా చూస్తూనే వుంది.

ఇన్స్పెక్టర్ కళ్ళు తనముందు కూర్చున్న ఓ అందాల సుందరిమీద నిలిచిపోయాయి. మసకచీకటిలో ఆమె రూపం సరిగ్గా కనిపించడం లేదు. అయినా ఆమె అపురూప సౌందర్యవతి అని ఇట్టే చెప్పేయవచ్చు.

ఆ అందాల రాశిని పదినిమిషాలు దీక్షగా గమనించాడు. అందాలరాశి బుద్ధిమాత్రం అందంగా లేదని ఇన్స్పెక్టరుకు ఆ కాస్సేపట్లోనే అర్థమయిపోయింది.

ముందు వరుసలో కూర్చున్న ఓ యువకుడి కాళ్ళను ఆమె తాకుతున్నట్లుగా గ్రహించ గలిగాడు. అతనూ ఆమె కాళ్ళను తాకుతున్నాడు. వాళ్ళు సినిమా చూస్తూనే యీ తతంగం జరుపుతున్నారు. కాళ్ళపని కాళ్ళు చేస్తున్నాయి. కళ్ళపని కళ్ళు చేస్తున్నాయి.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే—ఆ యువకుడు అందాలరాశికంటే పదేళ్ళు చిన్నవాడు. 'ఈడూ జోడూ కల వని ఇదేమి సరసం! వీళ్ళ దుంప తెగ! బొత్తిగా బుద్ధి లేకుండా పోతోంది జనాలకి.' అనుకున్నాడు ఇన్స్పెక్టర్.

అప్పుడే అనుకోకుండా ఇన్స్పెక్టర్‌గారి శ్రీమతి వాళ్ళ ఆయన మొఖంలోకి చూసింది. అతను తెరవైపు కాకుండా

జనాలదిక్కు చూస్తూ కనిపించాడు.

"ఏమండి, సినిమా చూస్తూ కూర్చోక - వాళ్లనుచూస్తూ కూర్చున్నారేమిటి? మీ పోలీసుబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు!" అన్నది మెల్లగా.

"అబ్బే.... నేనూ సినిమా చూస్తూనే వున్నాగా" అంటూ అతను సినిమా చూడటంలో నిమగ్నమైపోయాడు.

సినిమా వదిలేసారు. జనాలు గుంపులు గుంపులుగా బయటికి వెళ్ళిపోతున్నారు.

ఆ అందాలరాశి, యువకుడు ఒకరి మొహాలు వొకరు చూసుకుని మెల్లగా నవ్వుకున్నారు. వాళ్ళిద్దరూ ఒకరినొకరు తాక్కుంటూ హాలునుండి బయటకు వచ్చారు.

అందాలరాశి అతనితో ఏదో మాట్లాడింది. అతనూ మాట్లాడాడు. ఇద్దరూ ఒకరివెనుక ఒకరు క్రమంగా మెయిన్ గేటు దాటారు.

అక్కడొక జీపు ఆమెకోసమే ఆగివుంది. ఇద్దరూ జీపెక్కారు. జీపు కదిలింది.

ఇన్స్పెక్టర్ శేఖర్ హాలుదగ్గర డ్యూటీలోవున్న హెడ్ కానిస్టేబుల్ని పిలిచి ఆ జీపుని ఫాలో అవమని తన మోటారు సైకిలిచ్చాడు. ఆయన శ్రీమతి కారణం అడగనే అడిగింది. "దగ్గరేగా, నడచివెళితే సరదాగా వుంటుందని. ఏదో చిన్న రిపేరుకూడా వుంది" అని సర్దిచెప్పాడు.

5

కొన్ని క్లూలు లభించడంతో కేసును ఇంటరెస్టుగా పరిశోధిస్తున్నాడు ఇన్స్పెక్టర్.

పోలీస్ స్టేషన్లో ఫోను మ్రోగింది. ఇన్స్పెక్టర్ రిసీవర్ అందుకున్నాడు ముప్ఫయి సెకన్లు గడిచాయి. ఇన్స్పెక్టర్ అవతలి వ్యక్తి చెప్పిన వార్త విని స్టన్ అయి



పోయాడు.

"రిజర్వాయరులో మరొక శవం కనిపిస్తోందండీ!" అని చెప్పి యింకో మాటకు అవకాశం ఇవ్వకుండా డిస్ కనెక్టు చేసాడు అతను.

ఆ వార్త తిరిగి చెవుల్లో గింగురు మనగానే-ఇన్స్పెక్టర్ శేఖర్‌కు కరెంటుషాక్ కొట్టినట్లయింది. ఇంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినా....పోలీసువాళ్ళను ఫూల్స్ చేసిపారేస్తున్న హంతకుడు ఎంత తెలివిగలవాడో ఇన్స్పెక్టర్ శేఖర్ వూహించలేకపోయాడు.

హుటాహుటిన జీప్ వేసుకుని డామ్ దగ్గరికొచ్చాడు. శవాన్ని బయటికి తీయించిన తరువాత ఇన్స్పెక్టర్ చూసి నమ్మలేకపోయాడు.

అతనెవరో ఇన్స్పెక్టర్‌కు తెలియదు. కానీ—అతని మొహం ఇన్స్పెక్టర్ హృదయంలో ముద్ర కొట్టినట్లు పడిపోయింది. చూడగానే గుర్తుపట్టాడు.

సినిమా హాల్‌లో....ఓ అందాలరాశితో....వాళ్ళ చిలిపి చేష్టలు గుర్తొచ్చాయి. సినిమా వదిలిపెట్టిన తర్వాత వాళ్ళిద్దరూ సరాసరి ఆమె ఇంట్లో దూరారట. ఆ అందాలరాశి యెవరో కాదు! ఆ వూరి చీఫ్ ఇంజనీర్ శాస్త్రిగారి భార్యేనని తెలియు

జేసాడు హెడ్ కానిస్టేబులు. ఆమె పేరు సునంద అట. చాలామందితో సెక్సువల్ రిలేషన్స్ కలిగివుందని కూడా తెలియజేసాడు హెడ్డు.

శవాన్ని పోస్టుమార్టంకు, పంపితే పురుషబీజాలను పిసికి చంపినట్లుగా డాక్టర్లు తెలియజేసారు. ఇన్స్పెక్టర్ శేఖర్ బాగా ఆలోచించి ఒక నమ్మకం ఏర్పర్చుకున్నాడు. ఈ హత్యలన్నింటికి కారణం చీఫ్ ఇంజనీర్ భార్య సునంద అయివుండవచ్చు అనేదే ఆ నమ్మకం. అయితే అంత మంది మొగవాళ్ళను ఒక ఆడది చంపి రిజర్వాయరులో పడేయటం యెలా సాధ్యం?

ఆరోజు డిపార్ట్మెంటుకు సంబంధించిన ఓ అఫీషియల్ మీటింగు హైద్రాబాదులో వుంది. వెంటనే రావాల్సిందిగా మెసేజ్ రావడంతో ఇన్స్పెక్టర్ శేఖర్ వెళ్ళిపోయాడు.

6

హైదరాబాదులో మీటింగ్ పూర్తయింది. ఆ మీటింగులో తన వూళ్ళో జరుగుతున్న హత్యల విషయం ప్రస్తావనకొచ్చి హంతకులను త్వరగా పట్టుకోవల్సిందిగా కోరారు ఐ.జి.పి గారు.

మర్నాడు ఇన్స్పెక్టర్ శేఖర్ హైదరాబాద్ నుండి తిరిగి వచ్చాడు.

సునంద గుర్తొచ్చింది ఇన్స్పెక్టర్కు.

ఎంతో అందంగా వుంటుంది. లోకంలో అంత అందం చాలా అరుదుగా వుంటుందని ఘంటాపదంగా చెప్పవచ్చు. ఆమెవైపు ఒక్కసారి చూసినవాడు పదేపదే చూడాలని కోరుకుంటాడు. ఒక్కసారి అనుభవిస్తే తమ జన్మలు ధన్యమైపోతాయని భావిస్తారు.

సునంద అసలే అందంగా వుంటుంది. దానికి తోడు

సినిమాస్టారులా విపరీతంగా అలంకరించుకుంటుంది. కానీ ఆమె హృదయం ఎంత అసహ్యంగా వుందో....ఏ చిత్రకారుడైనా ఆమె హృదయాన్ని చిత్రించగలిగితే పెంట కుప్పలా వుంటుందేమో!

ఇటువంటి నరరూప రాక్షసిని భూమిమీద వుంచితే మానవజాతికే కళంకం. వీలైనంత త్వరగా దాన్ని ఉరి కంబం యెక్కించాలి.

అదే రోజు సాయంత్రం ఇన్స్‌పెక్టర్ శేఖర్ ఒక అనూహ్యమైన వార్త వినవల్సి వచ్చింది. సునందను ఎవరో ఘోరంగా హత్యచేసి రిజర్వాయరులో పడవేసారని.

ఇన్స్‌పెక్టర్ శేఖర్‌కు ఈ వార్త విని ఒక్కక్షణం మెదడంతా మొద్దుబారిపోయింది.

పోస్టుమార్టంలో తేలిన విషయమేమిటంటే — ఆమె రొమ్ములమీద గుద్ది....జననాంగములో యాసిడ్ పోసి, హత్య చేసారని డాక్టర్లు తెలియజేసారు.

ఈ హత్యలన్నింటికి కారణం సునందే అయి వుండవచ్చునని ఇన్స్‌పెక్టర్ శేఖర్ భావించాడు. ఇప్పుడు సునందను అంత ఘోరంగా యెవరు చంపారు?

సునంద భర్త చీఫ్ ఇంజనీర్ శాస్త్రిగారిని హత్య విషయమై ప్రశ్నిస్తే—ఆయన విరక్తిగా ఒక నవ్వు నవ్వి— సునందను తాను పెళ్ళిచేసుకొని చాలా పొరపాటు చేసానని, తన మొదటి భార్యకు పుట్టిన ఇద్దరు కొడుకులను సంరక్షిస్తుందనే ఆశతో పెళ్ళిచేసుకుంటే—సంహరించేసిందట... ఎండ్రిన్‌పోసి. ఆ విషయం ఆయనకు చాలాకాలంవరకూ తెలియదట. ముద్దులు మూటగట్టే తన ఇద్దరు పిల్లలు ఈ

లోకంనుంచి నిష్క్రమించగానే శాస్త్రిగారు దాదాపు పినిక్ అయిపోయారట. తన ఉద్యోగమేమిటో—తానేమిటో.... అంతేగానీ సునంద విషయం సరిగ్గా పట్టించుకొనేవారు కాదట. సునందకూడా తనంటే కేర్‌లెస్‌గా వుండేదట.

కొంతకాలం తర్వాత సునంద చెడుతిరుగుళ్ళు తిరుగుతోందని తనకు కొన్ని ఆకాశరామన్న ఉత్తరాలొచ్చినా ఆయన నమ్మలేదట. కానీ ఇంత ఘోరం జరుగుతుందని తను కలలోకూడా అనుకోలేదని బావురుమని ఏడ్చి.... సునంద చెడు తిరుగుళ్ళే ఈ హత్యకు కారణం అయి వుండొచ్చని చివరగా తెలియజేసారాయన.

సునందకు దాదాపు ఆంతరంగిక కార్యదర్శిలా పని చేస్తున్న రాజయ్యను ప్రశ్నించగా—అతను అనుమానస్పద మైన వాడుగా కనిపించాడు.

రాజయ్యకు నలభై అయిదేళ్ళు వుంటాయి. జుట్టు బాగా తెల్లబడిపోయింది. కానీ మనిషి బలంగానే వున్నాడు. కాకీ ప్యాంటు అదే షర్టు వేసుకుంటాడు. అయిదున్నర అడుగుల యెత్తు వుంటాడు. మనిషి నిజాయితీ గలవాడిగా కనిపిస్తాడు. మెత్తని స్వభావం.

ఇన్స్‌పెక్టర్ శేఖర్ అనుమానం క్రింద రాజయ్యను అరెస్టుచేసి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చాడు.

అతను భయంతో వణికిపోతున్నాడు. ఇంత పిరికివాడు సునందను హత్యచేసాడంటే — ఇన్స్‌పెక్టర్‌కు నమ్మ శక్యంగా లేదు. అయినా అతనిద్వారా సునందకు సంబంధించిన అనేక రహస్యాలను తెలుసుకోవడానికి వీలుంటుందని అరెస్టు చేసాడు.



7

"రాజయ్యా, నువ్వు పి.యి శాస్త్రిగారి దగ్గర యెన్నాళ్ళ నుండి పనిచేస్తున్నావ్?" సూటిగా చూస్తూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ శేఖర్.

"కొత్తగూడెం నుండి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి అయిదేళ్ళు అవుతుంది. అప్పటినుండి పి.యి గారి దగ్గరే డ్రైవరుగా వుంటున్నానండి."

"నీకు ఒక కూతురు వుందన్నావ్ కదూ? ఆమెకు పెళ్ళయిందా?"

"కాలేదు సార్, ఈ సంవత్సరమే నా మేనల్లుడు సత్యాని కిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడు. మొన్ననే టీచరు ఉద్యోగం దొరికింది. సత్యాన్ని నేనే చదించాను సార్!"

"అహా! సునందగారి గురించి నీ అభిప్రాయమేమిటి? అంటే—ఆమె ఎలాంటిదో, ఏమిటో నీకు తెలిసినదంతా

చెప్పు!"

"సునందగారు చాలా మంచివారు సార్!"

"రాజయ్యా, నువ్వు నా దగ్గర అబద్ధమాడితే బాగుండదు. ఉన్నది ఉన్నట్లు—నీకు తెలిసినదంతా చెప్పకపోతే నీకే ప్రమాదం! ఊఁ చెప్పు!"

"సునందగారు నిజంగానే చాలా మంచివారు సార్!"

"కాదు. ఒట్టి బజారు మనిషని నేనంటాను. నీ సమాధానమేమిటి?"

రాజయ్య అందుకు ఒప్పుకోలేదు. ఎంతసేపు సునంద చాలా మంచివారండీ! అంటున్నాడు. ఇన్స్పెక్టరు శేఖర్‌కు సహనం పూర్తిగా సడలింది. అతని చెంపలు నాలుగుసార్లు "ఛెల్.... ఛెల్" మన్నాయి. అతనికి పట్టపగలే చుక్కలు కనిపించాయి.

రాజయ్య కాలర్ పట్టుకొని లాగి—"రాజయ్యా, ఆమె గురించి నిజం చెప్తావా? లేక నీ ప్రాణాలు తీయమంటావా?" డొక్కలో ఒక్క పోటు తగిలింది.

ఆ దెబ్బకు రాజయ్య తట్టుకోలేకపోయాడు.

"ఇన్స్పెక్టర్‌గారూ, నన్ను చంపకండి! నేనంతా చెప్పేస్తాను.... నేనంతా చెప్పేస్తాను."

"ఊఁ చెప్పు!"

ఇన్స్పెక్టర్ శేఖర్ మొహం ప్రశాంతంగా కనిపించింది రాజయ్యకు. అబద్ధం చెప్పి తప్పించుకోవచ్చు అనుకున్నాడు. ఇన్స్పెక్టర్ ఎంత శాంతంగా కనిపిస్తున్నాడో అంతకు రెట్టింపు క్రూరుడుగానూ మారగలడనే — పచ్చినిజం తెలుసుకున్న తర్వాత నిజమేమిటో చెప్పక తప్పలేదు రాజయ్యకు.

"ఇన్స్పెక్టర్‌గారు, మీరిందాక అన్నట్లు—సునందగారు బజారు మనిషేనండి! బజారుదానికి ఒకనీతి నియమం వుంటుంది. అలాంటి నీతి నియమం కూడా లేని పశువండి ఈ సునంద!

నేను పి.యిగారి దగ్గర కొత్తగా డ్రైవర్‌గా చేరినప్పుడు సునంద అమ్మగారి ప్రవర్తన నాకు చాలా విచిత్రంగా తోచింది. పి.యిగారు తన డ్యూటీ విషయాలు తప్ప మరొకటి అసలే పట్టించుకోరు చివరికి అమ్మగారిని కూడా?

పి.యిగారు అన్నాక ఆయనింటికి యెంతోమంది— ఎన్నో పనులమీద వస్తుంటారు కదండీ? ఎవడన్నా పడుచు పొరగాడు ఆ ఇంటికొచ్చాడంటే—వాడితో గడిపిగానీ వదిలేది కాదండీ! వాడు పాకీ పనివాడైనా ఆమెకు పట్టింపు లేదు. ఆమెకు చాలాసార్లు అంటురోగాలు కూడా తగిలాయి. వైద్యం చేయించుకునేది రహస్యంగా.

ఇలా కొన్నాళ్ళు గడిచిపోయిన తర్వాత ఆ రాక్షసికి ఒక కొత్త బుద్ధి పుట్టింది ఇన్స్పెక్టర్‌గారూ! మంచి వాట మైనవోడ్ని వలలో వేసుకోవటం — వాడితో ఇష్టమొచ్చినంతసేపు సుఖం పొంది—ఆనక పూటుగా తాపి, ఆమె ఆమె గదిలో వున్న స్థంభానికి వాడిని తాళ్ళతో కట్టేసి— బట్టలన్నీ వూడదీస్తుందండి!

తర్వాత వాడి నోటికి ఒక ప్లాస్టర్ అంటించి....అదేం యిచిత్రమోగాని వాడి బీజాలు నొక్కి వాడు "ఊ".... "ఊ" అని యమయాతన పడుతూవుంటే సునంద అమ్మగారు పిచ్చిపట్టిన దానిలా నవ్వుతూ ఆనందించేది.

ఒక గంటలోపల వాడు సచ్చిపోయేవాడండీ!

ఒకరోజు నన్ను పిలిచి—నోట్లకట్ట ఒకటి నా చేతిలో పెట్టి జీపు సిద్ధం చేయమని చెప్తే-నేనెందుకో అనుకున్నాను. తర్వాత తెలిసింది-శవాన్ని తీసుకెళ్ళాలని.

ఆ శవం సినిమా హాలులో పనిచేసే శివనారాయణది. "శవాన్ని యెక్కడ పారేద్దాం రాజయ్యా!" అని నన్నడిగితే—"మీ యిష్టం" అన్నాను. "రిజర్వాయరులో పడేద్దాం పద!" అన్నది. శవాన్ని తీసుకెళ్ళి రిజర్వాయరులో పడేసాం.

శివనారాయణ ఏదో పొరపాటున సచ్చాడనుకున్నాను. అప్పటినుండి వారానికి ఒకడిని చంపడం.... రిజర్వాయర్లో పడెయ్యడం. ఒకసారి నేను జీపు తీసుకొని రానన్నానండి! నా కాళ్ళమీద పడి పరువు కాపాడమన్నదండీ.... నేను కరిగిపోయా!

ఈ రెండు నెలల నుండి నేను భయంతో సచ్చిపోతున్నానండీ! ట్రాన్స్‌ఫర్‌కోసం విపరీతంగా ప్రయత్నించాను. తీరా ట్రాన్స్‌ఫర్ అయితే అమ్మగారు కేన్సల్ చేయించారట! తర్వాత తెలిసింది ఈ విషయం. ఈ పాపాన్ని నేను మోయలేకపోతున్నాను. ఈ పీడ వదిలించుకోవడానికి ఉద్యోగానికి రిజైన్ చేద్దామనుకున్నాను.

అప్పుడే నా మేనల్లుడు సత్యం సెలవుల్లో యిక్కడికొచ్చాడు. సునంద అమ్మగారు యెలా పట్టారో తెల్వదు గానీ—మా వోడ్ని ఒళ్ళో ఏసుసుకున్నారు. సత్యం నా మేనల్లుడు అని ఆమెకు తెలియదు.

ఆ రోజు రాత్రి నా అదృష్టం బాగుండి సునంద అమ్మ

గారి గదివైపు వెళ్ళాను. గది బయట మా సత్యం చెప్పులు కవిపించాయి. భయమేసింది. సందులో నుంచి చూస్తే— లోపల సత్యమే వున్నాడు. ఇద్దరూ నగ్నంగా వున్నారు. ఇద్దరూ కలిసి త్రాగుతున్నారు. ఇంకా కాస్సేపైతే వాడిని స్థంభానికి కట్టేసి....చంపేసేదే!

తలుపులు నెట్టాను. తెరుచుకున్నాయి. నేను పిచ్చి కోపంతో వున్నాను. ఆ రాక్షసికి బుద్ధి చెప్పాలనుకున్నాను. అక్కడ యాసిడ్ బాటిల్ కవిపించింది. నన్ను చూసి ఆశ్చర్యపోయింది. నగ్నంగా....వెల్లకిలా పడుకున్న ఆ దయ్యాన్ని చూడగానే నాకు ఒళ్ళు మండిపోయింది. యాసిడ్ బాటిల్ తీసి ఎక్కడ పొయ్యకూడదో అక్కడే పోసేసాను. అలాచేస్తే ఇక అమాయకుల జోలికి పోదని అనుకున్నాను.

కానీ .... ఇల్లెగిరి పొయ్యేటట్లు అరుస్తుంటే— రహస్యం అందరికీ తెలిసిపోతుందని భయపడి—నోటికి ప్లాస్టర్ అంటించి....చేతులు కట్టేసి — రొమ్ములమీద గుద్ది....కుతికె పిసికి చంపేసాను. శవాన్ని ఏం చేయాలో తోచలేదు. రిజర్వాయరు గుర్తొచ్చింది. జీపులో తీసుకెళ్ళి శవాన్ని అందులో పడేసాను....

ఇన్స్పెక్టర్‌గారూ, ఏదీ దాచకుండా అంతా నిజం చెప్పేసాను. ఆ పైన మీ ఇష్టం” అంటూ కాళ్ళమీద పడ్డాడు రాజయ్య.

ఇన్స్పెక్టర్ మాట్లాడలేదు.

హెడ్ కానిస్టేబులు టేపురికార్డర్‌లో నుంచి “కేసెట్” తీసి ఇన్స్పెక్టర్ చేతి కిచ్చాడు. ఇన్స్పెక్టర్ దాన్ని అటూ ఇటూ త్రిప్పి చూసుకొని జేబులో వేసుకున్నాడు. □

తప్పుదారి

ప్రతాప రవిశంకర్

పార్టీ మనుషుల సమావేశంలో మునిగిపోయి వున్నాడు కనకలింగం.

ఎదురుగావున్న కుర్చీల్లో అతని స్నేహితులు, శ్రేయోభిలాషులు కూర్చుని కనకలింగం చెబుతున్న మాటలను శ్రద్ధగా వింటున్నారు. అతను ఇంకో ఇరవయిరోజుల్లో జరిగే పంచాయితీ ఎన్నికలలో పోటీ చేస్తున్నాడు. అందుకే

అంత బిజీ. కనకలింగం ఉపన్యాసానికి అంతరాయం కలుగుతూ బల్లమీదవున్న ఫోన్ మోగింది.

విసుగ్గా దానివేపు చూసి రిసీవర్ ఎత్తి "హల్లో కనకలింగం హియర్" అన్నాడు.

"గుడ్‌మార్నింగ్ కనకలింగం."

"ఎవరు నువ్వు?"

"నీ కనవసరం."

ఆశ్చర్యపోయాడు కనకలింగం. అతని మొహంచూసి ఎదురుగా కూర్చున్నవాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మరి నాకెందుకు ఫోన్ చేశావ్?" అన్నాడు అతను వెంటనే తేరుకొని.

"నిన్ను ఎన్నికల్లో నిలబడవద్దని హెచ్చరించటానికి!" అవతలివైపు మాట్లాడుతున్నతను నవ్వాడు.

కనకలింగానికి ఆ నవ్వు కోపాన్ని కలిగించింది.

"యూ డర్టీరోగ్" అని విసురుగా ఫోన్ పెట్టేశాడు.

"ఏమయ్యింది? ఎవరు ఫోన్ చేసింది?" ఆత్రంగా అడిగారు వాళ్ళందరూ.

"ఏమీలేదు" అన్నాడు కనకలింగం.

"కాదు....మీ ముఖం చూస్తుంటే ఏదో వున్నట్టుగానే వుంది. ప్లీజ్ చెప్పండి కనకలింగంగారూ" అన్నాడు ఓ శ్రేయోభిలాషి.

ఫోన్‌లో అతను తనని ఎన్నికలనించి విరమించుకోమని చెప్పిన విషయం వాళ్ళతో చెప్పాడు కనకలింగం.

వాళ్ళు ఇంకోసారి ఆశ్చర్యపోయారు.

"ఇది తప్పకుండా బసవరాజు చేసిన పనే అయుండాలి" అన్నాడొకాయన.

"కాదు....బసవరాజు గొంతు నాకు తెలుసు" అన్నాడు

కనకలింగం.

"బసవరాజు తను స్వయంగా మీకు ఫోన్‌చేసి వుండక పోవచ్చు. తన మఠాలో ఏ మనిషి చేతనయినా యిలా చేయించి వుండొచ్చు" అన్నాడు ఇంకో మనిషి.

మొత్తానికి అందరూ ఫోన్‌కాల్ రాకముందు చర్చిస్తోన్న విషయం గురించి మర్చిపోయి ఫోన్‌చేసిన మనిషి గురించి మాట్లాడటం మొదలుపెట్టారు.

తప్పకుండా ఆ ఫోన్‌చేసిన మనిషి బసవరాజు గ్రూప్‌కు చెందిన మనిషే అయివుంటాడని ఆ సమావేశంలోవున్న ఎక్కువమంది తేల్చేసారు.

బసవరాజు కూడా పంచాయితీ ఎన్నికల్లో పోటీచేస్తున్నాడు. కనకలింగానికి అపోజిషన్....నిజానికి బసవరాజు కంటే కనకలింగానికే ఎన్నికల్లో విజయంపొందే సూచన్లు కనిపిస్తున్నాయని చాలామంది అనుకుంటున్నారు.

కనకలింగం ఇంతకుముందు ఓసారి పంచాయితీ ఎన్నికల్లో నిలబడి ఓడిపోయాడు. ఓడిపోయినా అంతో ఇంతో ప్రజాసేవ చేసాడు. మళ్ళీ ఎన్నికలు వచ్చేసరికి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నాడు. అందుకే యీసారి తప్పకుండా అతనే గెలుస్తాడని చాలామంది అనుకుంటున్నారు.

"ఏమయినా బసవరాజు తన మనిషిచేత మిమ్మల్ని ఇలా బెదిరించడం చాలా అవమానకరమయిన విషయం. మీరు కూడా ఏదయినా ప్రతీకారంగా చెయ్యాలి" అన్నాడు కనకలింగం బెస్టుఫ్రెండు పరాంకుశం.

"నా ఉద్దేశం అదికాదు. బసవరాజు ఇలాంటి ఫోన్ చేయించాడంటే నాకు నమ్మశక్యంగా లేదు. నేనంటే గిట్టని వాళ్ళెవరో ఈ ఫోన్‌చేసి వుండాలి. అయినా మనం

ఇలాంటివి పట్టించుకోగూడదు.

ఒక పదవికి పోటీ చేస్తున్నప్పుడు ఇలాంటి అవమానాలు ఎన్నో జరుగుతూ వుంటాయి. ఎంతోమంది ఎన్నో రకాలుగా బెదిరిస్తూ వుంటారు. కాని మనం భయపడకూడదు. భయపడేవాడు యెప్పుడూ ప్రజాసేవ చెయ్యలేడు. అందుకే నేను ఇలాంటి ఫోన్‌కాల్స్‌ని లెక్క చెయ్యను. ఇక ఇంతటితో ఈ విషయాన్ని వదిలి అసలు విషయాని కొద్దాం."

అని మళ్ళీ తన వుపన్యాసాన్ని మొదలుపెట్టాడు కనకలింగం.

2

రాత్రి తొమ్మిది గంటలయింది. కనకలింగం అప్పుడే కొంతమంది మనుషులతో మాట్లాడి కారులో యింటికి వచ్చాడు. బాగా అలసటగా వున్నట్టు ఫీలయి అప్పటికప్పుడు స్నానం చేసాడు.

స్నానంచేసి వచ్చేసరికి భార్య భోజనానికి పిల్చింది. భోజనం చేస్తూ వుండగా "ఎవరో మీకోసం రెండుసార్లు ఫోన్ చేసారు" అని చెప్పింది.

"ఎవరు?" అడిగాడతను.

"ఏమో చెప్పలేదు. మీరు కావాలని అన్నాడు. లేరని చెప్పాను. తనపేరు చెప్పమనీ మీరు వచ్చిన తరువాత చెబుతాననీ అన్నాను. పేరు అనవసరం, చెప్పేది జాగ్రత్తగా విని ఆయనకు చెప్పండి, అని మిమ్మల్ని ఈ ఎన్నికల్లో నిలబడవద్దని చెప్పమన్నాడు" అన్నది.

భార్య చెప్పింది విని నవ్వాడు కనకలింగం.

"నవ్వుతున్నారేమిటి?" అనడిగింది భార్య.

"వాడు ఇలా ఫోన్ చెయ్యటం ఇది మొదటిసారి కాదు.

ఉదయం నేను సమావేశంలో వుండగా ఒకసారి ఫోన్ చేశాడు నన్ను ఈ ఎన్నికలనుంచి విరమించుకోమని."

"మీరేం చెప్పారు?"

"వాడికి చెప్పేదేమిటి? ఎవడోవాడు. పిచ్చివాడయి వుండాలి. లేకపోతే వాడు ఫోన్‌చేసినంత మాత్రాన నేను ఎన్నికల్లో నిలబడటం మానేస్తానా? ఇంకోసారి వాడు నీకు ఫోన్‌చేస్తే నోటికి వచ్చినట్టు తిట్టు. పోలీసులకు పట్టిస్తా మని బెదిరించు. ఇక మళ్ళీ ఫోన్ చెయ్యడు" అన్నాడు భార్యతో కనకలింగం.

తల వూపింది అతని భార్య.

భోజనాలయిన తర్వాత కనకలింగం సిగరెట్టు వెలిగించాడు. భార్యతో మాట్లాడుతూ పడకగదిలోకి వెళ్ళబోతుండగా ఫోను మోగింది.

రిసీవరెత్తి "హల్లో" అన్నాడు.

"ఎవరు మాట్లాడేది? కనకలింగమేనా?" అని వినిపించింది అవతల్నించి.

"అవును. నువ్వెవరు?" అన్నాడు అతను.

"తర్వాత చెబుతాను. కనకలింగం నువ్వు నా ఫోన్ కాల్స్‌ని జోక్‌గా తీసుకుంటున్నావు. అది నీకే ప్రమాదం. నీకు ఇరవైనాలుగు గంటలు టైమిస్తున్నాను. రేపు రాత్రి పదిగంటలకు మళ్ళీ ఫోన్ చేస్తాను. అప్పటికి నువ్వు ఈ ఎన్నికల్లో పోటీనించి విరమించుకున్నట్టుగా నాకు తెలియాలి. లేకపోతే ఏం జరుగుతుందో నేను నీకు ఇప్పుడు చెప్పను. రేపు రాత్రికి చెబుతాను. గుడ్‌నైట్" అని ఫోన్ పెట్టేశాడు అవతలివైపు మనిషి.

ఫోన్ పట్టుకుని అలాగే నిలబడిపోయాడు కనకలింగం. భార్య అతని పక్కనే నిలబడి వున్నది.

భర్త అలా అయిపోవటంచూపి "ఏమిటండీ అలా ఐపోయారు? ఎవర్నించి ఫోన్? అతన్నించేనా? ఏమంటాడు?? మళ్ళీ మిమ్మల్ని పోటీ చెయ్యవద్దనే చెప్పాడా?" అనడిగింది.

కనకలింగం భార్యకు జవాబు చెప్పలేదు. అప్పటికప్పుడే డయల్ చేసి "హల్లో పోలీస్‌స్టేషన్" అన్నాడు.

అవతల్నించి యస్.ఐ. మాట్లాడాడు.

"ఒక రిపోర్టు ఇవ్వాలి....ఇప్పుడే బయల్దేరి వస్తున్నాను.... స్టేషన్‌లోనే వుండండి" అని ఫోన్ పెట్టేశాడు కనకలింగం.

"అతనిగురించి రిపోర్టు ఇవ్వబోతున్నారా?"

"అవును" అన్నాడు.

"అతనెవరో పిచ్చివాడయి వుంటాడన్నారు గదా."

"అలాగనే అనుకున్నాను .... కాని ఇప్పుడు వాడి మాటలు విన్న తర్వాత ఆలా అనిపించలేదు. వాడు సిన్సియర్‌గానే నన్ను హెచ్చరిస్తున్నాడు. ఇక ఆలస్యంచేసి లాభంలేదు. అందుకే పోలీసు రిపోర్టు ఇస్తాను" అని గబగబా డ్రెస్ ఛేంజ్ చేసుకుని ఒంటరిగా కార్లో బయల్దేరాడు కనకలింగం.

"నేను కూడా వస్తాను" అన్నది భార్య.

"నువ్వా! ఎందుకు....నాకేం భయంలేదు. అయినా వాడు నాకు ఇరవైనాలుగు గంటలు టైమిచ్చాడు. ఆ తర్వాత నేను భయపడాల్సింది" అని కార్లో డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాడు ...

"జాగ్రత్త" అని చెప్పింది భార్య కారు కదలగానే.

నవ్వుకున్నాడు కనకలింగం.

3

"కూర్చోండి" అన్నాడు యస్.ఐ. అమరేంద్ర.

కూర్చున్నాడు కనకలింగం.

"చెప్పండి ఏమిటి విషయం. ఇంత రాత్రివేళ వచ్చారంటే ఏదో ముఖ్యమయిన పనే అయివుండాలి" అన్నాడు యస్.ఐ.

"అవును. ముఖ్యమయిన పనిమీదే వచ్చాను" అని తనని యెన్నికల్లో పోటీ చెయ్యవద్దని హెచ్చరిస్తూ వచ్చిన ఫోన్‌కాల్స్ గురించి చెప్పాడు కనకలింగం.

"ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు కనకలింగంగారూ.... ఎన్నికల్లో పోటీచేసే మనుషులకు ప్రత్యర్థులనించి ఇటువంటి బెదిరింపు ఫోన్లు రావటం సహజంగా అన్నిచోట్లా జరుగుతూనే వుంటుంది" అన్నాడు యస్.ఐ. అంతా విని.

విసుక్కున్నాడు కనకలింగం.

"ఆ విషయం నాకు తెల్సు. నేను మీ దగ్గరకు వచ్చింది ఈ విషయం తెలుసుకోటానికి కాదు. ఇది కేవలం బెదిరింపు మాత్రమే అని నేను అనుకోవడంలేదు. అతను నన్ను నిజంగానే నేను పోటీనించి విరమించుకోకపోతే ఏదో ఒకటి చేసేవాడిలా కనిపిస్తున్నాడు. అందుకే ఇంత రాత్రి వేళ మీ దగ్గరకు వచ్చాను. నాకు ఫోన్‌చేస్తున్న ఆ వ్యక్తిని మీరు పట్టుకోండి....నాకు అతన్నించి యెటువంటి ప్రమాదమూ జరక్కుండా చూడండి" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ నిముషంసేపు ఆలోచించి "ఆల్‌రైట్.... మీరు కోరినట్టుగానే అతన్ని పట్టుకునే ప్రయత్నం చేస్తాం. మీకు రక్షణ ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు.

"ఇంతకీ రేపు రాత్రికి వాడు మళ్లీ నాకు ఫోన్‌చేసి ఏం నిర్ణయించుకున్నావని అడిగితే ఏమని చెప్పమంటారు?"

అడిగాడు కనకలింగం.

"ఎన్నికల్లో పోటీ చెయ్యటంలేదని చెప్పండి."

"వాడు నమ్మతాడా? అదీకాకుండా రేపు సాయంత్రం నేను బహిరంగ సభలో యెన్నికల సందర్భంగా మాట్లాడ బోతున్నాను."

"అయితే పోటీ చేస్తున్నట్టుగానే చెప్పండి. వాడు ఏం చేస్తాడో చూద్దాం. వాడు మిమ్మల్ని యేదయినా చెయ్యా లని తెరచాటునించి బయటకు వస్తే మేము పట్టుకుంటాం. మీకు యెటువంటి భయమూ అవసరంలేదు. మా పోలీసులు మీ ఇంటి దగ్గర ఇరవై నాలుగు గంటలూ కాపలా వుంటారు. కావాలంటే ఒక కానిస్టేబుల్‌ని మీ వెంటే వుంచుకోండి ఈ యెన్నికలు అయ్యేవరకు....సరేనా?" అన్నాడు యస్ ఐ. అమరేంద్ర.

"థాంక్యూ... ఇక నే వెళతాను" అని లేచి నిలబడ్డాడు కనకలింగం....

"రేపు నేను కాపలా ఏర్పాట్లు చేయిస్తాను. మీరు నిశ్చింతగా వుండండి....విష్ యూ ఆల్ సక్సెస్" అని కనక లింగంతో కరచాలనం చేశాడు అమరేంద్ర లేచి నిలబడి.

మరోసారి "థాంక్స్" అన్నాడు కనకలింగం బయటకు వస్తూ.

4

బహిరంగ సభలో కనకలింగం ఉపన్యాసం పూర్తయ్యే సరికి రాత్రి తొమ్మిదిన్నరయ్యింది. పదిగంటలు కావొస్తుం డగా కార్లో ఇంటికి వచ్చాడు.

గేటుదగ్గర మఫ్టీలో కూర్చున్న కానిస్టేబుల్ కనకలింగా నికి నమస్కారం చేశాడు.

"జాగ్రత్తగా వుండు. వాడు సాధారణమైన మనిషిలాగా

కనిపించటంలేదు. నిద్రపోకు" అని అతన్ని హెచ్చరించి కారును లోపలకు పోనిచ్చాడు.

భార్య అతని కోసమే యెదురుచూస్తోంది.

"ఇప్పుడే ఫోన్ మోగింది" అన్నది లోపలకు రాగానే.

"ఎవడు? వాడేనా ఫోన్ చేసింది" గబుక్కున అడిగాడు.

"అవును....మళ్లీ ఐదు నిముషాలాగి ఫోన్ చేస్తానన్నాడు" అన్నది.

ఆమె అలా అనగానే ఫోన్ మళ్లీ మోగింది.

రిసీవర్ యెత్తి "నేనే....కనకలింగాన్ని" అన్నాడు హుందాగా.

"ఇంతకీ ఏం నిర్ణయించుకున్నావ్?" అనడిగాడు అవతలి వ్యక్తి.

"ఇంకా నాకు టైము కావాలి" అన్నాడు కనకలింగం కావాలనే.

"నో....ఇంకా టైము ఇవ్వను .... ఇరవై నాలుగు గంటలు చాలు నిర్ణయించుకోవటానికి. ఇప్పుడే చెప్పేయ్ కనకలింగం....యెన్నికల్లో పోటీనించి విరమించుకున్నట్లేనా?"

"నీ కెందుకు నా గురించి ఇంత ఇంట్రస్టు?" అడిగాడు కనకలింగం.

"ఇవన్నీ చెత్తప్రశ్నలు....నీ ప్రశ్నలకు నేను జవాబులు చెప్పను. ఒకటే మాట. నీ నిర్ణయం వెంటనే చెప్పేయ్" అన్నాడు.

"ఐతే విను. నేను యెన్నికల్లో పోటీనించి విరమించుకోవటం లేదు. నీ బెదిరింపులకు లొంగదల్చుకోలేదు. నీ యిష్టం వచ్చింది చేసుకోవచ్చు" అన్నాడు నిర్లక్ష్యంగా కనకలింగం.



"ఆల్ రైట్. ఇంతవరకూ వచ్చావన్నమాట. అయితే చావుకి సిద్ధపడు కనకలింగం. నీలాంటి మనిషి బతికి వుండటం ప్రమాదం" అని ఫోన్ పెట్టేశాడు అవతలి మనిషి.

తనుకూడా ఫోన్ పెట్టేసి "ముందు నిన్ను నువ్వు కాపాడుకో....తర్వాత నా సంగతి ఆలోచిద్దువుగాని" అన్నాడు కనకలింగం నవ్వుతూ.

''ఏమన్నాడు?'' అడిగింది భార్య.

''నేను చావుకు సిద్ధపడాలిట....నేను బతికి వుండకూడదట'' అంటూ ఇంకోసారి నవ్వాడు.

భయంగా భర్త మొహంలోకి చూపింది ఆమె....

కనకలింగం ఏదో మాట్లాడబోయేంతలో ఫోన్ మోగింది.

రిసీవర్ యెత్తి "హల్లో" అన్నాడు అతను.

"నేను యస్.ఐ. అమరేంద్రని మాట్లాడుతున్నాను.

ఇంతకు ముందు మీకు వచ్చిన ఫోన్‌కాల్‌ని ట్రేస్ చేసి వాడిని పట్టుకోటానికి వెళ్లాము. వాడు ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నించి మాట్లాడాడు. మేము వెళ్ళేసరికి అక్కడలేడు. తప్పించుకుపోయాడు. ఐనా వాడు యెక్కడికీ పోలేడు. తప్పకుండా దొరుకుతాడు. మీరు నిశ్చింతగా వుండండి. ఇంకో కానిస్టేబుల్‌ని మీ ఇంటికి పంపిస్తున్నాను" అని ఫోన్ పెట్టేశాడు.

"మనకు భయంలేదు. బయట పోలీసు కాపలా వుంది" అన్నాడు కనకలింగం భార్యతో.

భార్య భారంగా నిట్టూర్చింది.

5

పోలీసు జీపు కనకలింగం ఇంటిముందు ఆగింది. అందులోనించి యస్.ఐ. అమరేంద్ర, ఇద్దరూ పోలీసులు, డాక్టరూ, వేలిముద్రల నిపుణుడూ, ఫోటోగ్రాఫరూ దిగారు.

అందరూ మేడమీదకు నడిచారు....పడకగది బయట బోర్లాపడివుంది కనకలింగం శవం. నెత్తురు ఇంకా గడ్డకట్ట లేదు....

ఉదయం ఆరుగంటలు దాటుతోంది....

"హత్య జరిగి యెన్నో గంటలు కాలేదు" అన్నాడు డాక్టరు శవాన్ని చూడటంతోనే....

ఏడుపు వినిపించి తల తిప్పి చూశాడు అమరేంద్ర.

కొంచెం దూరంలో నిలబడి యేడుస్తున్నారు కనకలింగం భార్య—పాతికేళ్ళ కూతురు.

అప్పుడే కనకలింగం హత్య విషయం చాలామందికి తెలిసినట్టుంది. ఒక్కొక్కరే వాహనాల మీద అతన్ని చూడ టానికి రావటం మొదలుపెట్టారు.

వేలిముద్రల నిపుణుడు కత్తిపిడిమీది వేలిముద్రలను

తీస్తున్నాడు.

రాత్రి కాపలావున్న కానిస్టేబుళ్ళిద్దరూ ఏడుపు మొహాలతో ఓ పక్కగా నిలబడ్డారు.

యస్. ఐ. కి వాళ్ళను చూడగానే కాల్చిపారెయ్యాలని పించింది. ఇద్దరు పోలీసులు కాపలా వుండగానే కనక లింగం హత్య చెయ్యబడ్డాడు.

వాళ్ళిద్దర్నీ తన దగ్గరకు పిల్చాడు అమరేంద్ర.

భయపడుతూ వచ్చారిద్దరూ....

"నిజం చెప్పండి. రాత్రి మీరు ఈ యింటికి కాపలా వున్నారా?" అడిగాడు యస్. ఐ.

"ఉన్నాం సార్. మూడున్నరదాకా మెలకువతోనే వున్నాం. తర్వాత బాగా నిద్ర వచ్చింది. వరండాలో పడు కుని నిద్రపోయాం."

"చావలేక పోయారు" అని యెవరికీ వినిపించకుండానే తిట్టాడు అమరేంద్ర వాళ్ళిద్దరినీ.

ఫోటోగ్రాఫర్ శవాన్ని ఫోటోలు తీస్తున్నాడు.

అమరేంద్ర — కనకలింగం భార్య దగ్గరకు వెళ్లి, "క్షమించండి" అన్నాడు.

ఆమె ఏడుపును ఆపి "మీరు క్షమించమంటే ఆయన బతికొస్తారా? ఇంతమంది వుండికూడా అయన్ని కాపాడ లేక పోయారు. ముందుగా మీకు రిపోర్టు ఇచ్చినా మీరు ఏమీ చెయ్యలేకపోయారు. ఇంక మీరెందుకు? మీ పోలీస్ డిపార్టుమెంటు ఎందుకు?" అన్నది కోపంగా.

వెంటనే మాట్లాడలేకపోయాడు అమరేంద్ర. నిజంగా ఇది పోలీసు డిపార్టుమెంటు సిగ్గుపడాల్సిన విషయమే.... తన ప్రాణానికి రక్షణ కల్పించమంటూ ఓ మనిషి వచ్చి కోరిన తర్వాత అతనికి రక్షణ ఏర్పాట్లు చేసినా ఆ మనిషి

హత్య చెయ్యబడ్డాడంటే ఇది పోలీసు శాఖకే అవమానం.

"క్షమించండి. ఇందుకు నేను ఎంతో విచారిస్తున్నాను. దయచేసి నే నడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి. రాత్రి వేళ కనకలింగంగారు పడక గదిలోనుంచి బయటకు రావటము మీకు తెలుసా?" అనడిగాడు.

ఆమె వెంటనే "నాకు తెలీదు. బాత్ రూంకి వెళ్ళటానికి బయటకు వచ్చి వుండాలి. నాకు ఐదున్నరకు మెలకువ వచ్చింది. పక్కమీద ఈయన కనిపించలేదు. తలుపులు తెరిచి వున్నాయి. లేచి చూస్తే ఈ దృశ్యం కనబడింది. అంతే. కేక పెట్టాను" అన్నది.

యస్. ఐ. ఏదో అడగబోయేంతలో అతన్ని ఫోటోగ్రాఫర్ పిల్చాడు.

"వన్ మినిట్" అని గబగబా అక్కడకు వెళ్ళాడు అమరేంద్ర.

"ఇదికో ఈ కాయితం శవం చేతికింద దొరికింది" అని ఓ కాయితాన్ని అతనికి ఇచ్చారు.

అది ఓ లాడ్జింగ్ రిసీట్. దానిమీద అనితా లాడ్జింగ్ అని వుంది.

దాన్ని చూడగానే అమరేంద్రకు హంతకుడు దొరికినట్లే అనిపించింది. వెంటనే అతను దాన్ని జేబులో పెట్టుకుని ఇద్దరు పోలీసులను వెంటపెట్టుకుని జీపులో బయల్దేరాడు.

6

రివ్వున దూసుకుపోతోంది జీపు. అమరేంద్ర మెదడులో ఆలోచనలూ రివ్వున పరుగులు తీస్తోన్నాయి.

జీపు అనితా లాడ్జింగ్ ముందు ఆగింది. అందరూ గబగబా దిగారు.

కౌంటర్‌లో ఓ నడి వయసాయన కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు. అమరేంద్రను చూడగనే గబుక్కున లేచి నిలబడ్డాడు.

తన జేబులోవున్న రిసీట్ ఆతనికి చూపించి, "యీ మనిషి ఇంకా ఈ లాడ్జింగ్‌లోనే వున్నాడా?" అనడిగాడు అమరేంద్ర.

"రూం నెంబర్ ఫార్టీ ఫైవ్‌లో మనిషి అరగంటక్రితమే రూమ్ ఖాళీచేసి వెళ్ళిపోయాడు సార్" చెప్పాడతను.

"అతని రూముకు సర్వ్ చేసిన సర్వర్‌ని పిలవండి."

నిముషంలో ఆ సర్వరు వచ్చాడు.

"రూం నెంబర్ ఫార్టీ ఫైవ్‌లో వున్న మనిషి ఎక్కడికి వెళ్ళిపోయాడో చెప్పగలవా?"

"స్టేషన్‌కి సార్. నేనే ఈ సెంటర్లోనే ఆటో ఎక్కించాను సార్. రెండు సూటుకేసులను నేనే ఆటోలో పెట్టాను. పదిరూపాయలు ఇచ్చాడతను."

"అతను హంతకుడు. అతన్ని వెంటనే పట్టుకోవాలి. ముందు మనం స్టేషన్‌కి వెళ్లాలి. నువ్వు మాతో బయలు దేరు" అని సర్వరును తీసుకుని గబగబా బయటకొచ్చాడు అమరేంద్ర.

అందరూ జీపులో ఎక్కారు. జీపు బయల్దేరబోతుండగా వాళ్ళకు ఓ ఆటో యెదురు వచ్చింది.

"ఇదే ఆటోలో అతను వెళ్ళిపోయాడు," అన్నాడు సర్వరు.

వెంటనే అమరేంద్ర ఆటోని ఆపేశాడు.

ఆటో ఆగింది.

"డ్రయివర్, ఇంతకుముందు నేను యెక్కించిన మని

షిని యెక్కడ దించావ్?" అడిగాడు సర్వర్.

"హోటల్ మహావీర్‌లో. ముందు స్టేషన్‌కు పోనివ్వమన్నాడు. సగందూరం పోయిన తర్వాత మహావీర్ హోటల్‌కు పోనివ్వమన్నాడు. ఇప్పుడే దించివస్తున్నాను" చెప్పాడు ఆటో డ్రయివర్.

"డ్రయివర్, త్వరగా హోటల్ మహావీర్‌కు పోనియ్" అర్చాడు అమరేంద్ర.

జీపు ముందుకు కదిలి శరవేగాన్నందుకుంది. పది నిమిషాలలో హోటల్ మహావీర్ ముందు ఆగింది.

జీపులోనించి దూకారు అమరేంద్ర, పోలీసులు, సర్వరు.

గబగబా రిసెప్షన్ దగ్గరకు వెళ్లారు.

సర్వరు రిసెప్షనిస్టుతో పారిపోయి వచ్చిన మనిషి గుర్తులను వర్ణించి చెప్పాడు.

"అతను యే గదిలో వున్నాడు?" అడిగాడు అమరేంద్ర.

"రూమ్ నెంబర్ ట్వెంటీ సిక్స్" చెప్పింది రిసెప్షనిస్టు.

అంతే, నిముషంకూడా ఆలస్యం చెయ్యకుండా రెండో అంతస్తులో వున్న రూం నెంబర్ ట్వెంటీసిక్స్ దగ్గరకు పరిగెత్తారు.

గది తలుపు మూసి వున్నది.

చిన్నగా తలుపుమీద చప్పుడు చేశాడు అమరేంద్ర.

నిముషం తర్వాత తలుపు తెరుచుకుంది. ఎదురుగా ఓ పాతికేళ్ల దాటిన యువకుడు నిలబడివున్నాడు.

పోలీసులను చూడగానే తలుపును మూసెయ్యబోయాడు.

"ఇతనే" అరిచాడు సర్వరు.

తలుపుకు కాలును అడ్డుపెట్టి విసురుగా తలుపును వెనక్కు నెట్టాడు అమరేంద్ర.

అతను వెనక్కు పడిపోయాడు.

"ఇక నువ్వు తప్పించుకోలేవ్ మిస్టర్....నీ ఆట కట్టింది" అన్నాడు అమరేంద్ర రివాల్వర్ తీసి.

పోలీసులిద్దరూ అతని చేతులకు బేడీలు వేశారు.

"నన్నొదలండి.... నన్నొదలండి" అరిచాడతను పెద్దగా.

"ఎందుకు? ఇంకా ఎంతమందిని హత్యచెయ్యాలి?" అడిగాడు యస్. ఐ. అమరేంద్ర.

"నేనెవర్నీ హత్య చెయ్యలేదు. నేను నిర్దోషిని" అన్నాడతను గింజుకుంటూ.

"నువ్వు హంతకుడివి. కనకలింగం గార్ని తెల్లవారు జామున హత్యచేసావ్. నీ వేలిముద్రలు కత్తి పిడిమీద దొరికాయి. ఇక నువ్వు తప్పించుకోలేవు."

అతను మాట్లాడలేదు. తల వంచుకున్నాడు.

"ఇంతకీ నువ్వు కనకలింగంగార్ని యెందుకు హత్య చేశావ్?"

"ఎందుకా? ఆ నీచుడు నా తండ్రి కనుక" ఆవేశంగా అన్నాడతను.

"నువ్వు కనకలింగం గారి కొడుకువా?" ఆశ్చర్యంగా అడిగాడు అమరేంద్ర.

"అవును. ఆ నీచుడు వయసులో వున్నప్పుడు నా తల్లిని పెళ్ళి చేసుకుంటానని మభ్యపెట్టి తీరా నన్ను కడుపుతో వున్న తర్వాత మోసంచేసి పారిపోయాడు. అప్పటి నుంచి నా తల్లి యెన్నో కష్టాలు పడింది. లోకనిందను భరిస్తూనే నన్ను పెంచింది. పదిహేనురోజుల క్రితంవరకు నాకు ఈ విషయాలేవీ తెలీవు. నా తల్లి చావబోయేముందు ఈ విషయాలన్నీ చెప్పి కన్నుమూసింది. అప్పుడే కనకలింగాన్ని హత్య చెయ్యాలనుకున్నాను. హత్య చేసాను"

అన్నాడతను.

అతని కళ్ళు ఎఱ్ఱగా అయిపోయాయి.

"మరి ఆయనకు ఎన్నికలనించి విరమించుకోమని అన్ని సార్లు ఎందుకు ఫోన్ చేసావు?" అడిగాడు అమరేంద్ర.

"పోలీస్ ఇన్స్పెక్టర్ అయివుండి ఆ మాత్రం తెల్సుకో లేరా?" అన్నాడతను చెప్పకుండా.

నిమిషం ఆలోచించాడు అమరేంద్ర. తర్వాత "అర్థ మయింది. ఈ కేసును తప్పుదారి పట్టించడానికి నువ్వు అలా ఫోన్ చేసావ్. నువ్వు కనకలింగంగార్ని హత్యచేసి ఆ హత్య ఎవరో ప్రతిపక్షం వాళ్ళు చేసివుంటారనే ఉద్దేశం కలిగించటానికి అలా ఫోన్ చేశావ్. అంతేకదా?" అమ రేంద్ర అన్నాడు.

అతడు మాట్లాడలేదు. శూన్యంలోకి చూడసాగాడు యోగిలా.... □

శివమెత్తిన భార్య!

"డాక్టర్....మా ఆవిడ రాత్రి సమయాల్లో నన్నుచూస్తే చాలు, ఏదేదో అరుస్తూ నా పైనబడి గోళ్ళతో రక్కడం, అందుబాటులోవున్న వస్తువుల్ని నా పైకి విసరడం చేస్తుం టుందండి!"

"రాత్రి ఎన్నింటికి అలా చేస్తుంటుంది!" అడిగాడు డాక్టర్.

"నేను బార్నుండి కరక్టుగా పదింటికి ఇంటికి వెళ్తాను. సరిగ్గా అప్పుడే నా పైన విరుచుకు పడుతుంది డాక్టర్."

డాక్టర్ ఆశ్చర్యపోయాడు.

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

(గతసంచిక తరువాయి)

“మేం హత్య జరుగుతుందనుకోలేదు. అందువల్ల జరిగింది. కృష్ణన్, ఏజెంటు దిలీప్ శత్రువులకి ప్రమాదకరమైన వ్యక్తి. వాళ్ళ వివరాలు అతనికి తెలుసు. అందుకే చంపేసారు.”

కృష్ణన్ కిటికీ దగ్గరకెళ్ళి చూసాడు. అవతల చీకట్లో ఏమీ కనిపించలేదు. వెనక్కి తిరిగి, “ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్—దీనిగురించి మాకేమీ తెలీదు. నార్త్ ఇండియా

పోలీసులనుంచి మాకేమీ సమాచారం అందలేదు. మిస్టర్ లాల్, వాళ్ళని మనం ఎలా ట్రేస్ చేస్తాం?" అన్నాడు.

"చెయ్యలేం—వాళ్ళు పొరపాట్లు చెస్తేతప్ప! వాళ్ళ పొరపాట్లు చేస్తారని ఆశించకండి! వాళ్ళది పటిష్టమైన ఆర్గనైజేషన్. ఆ మందును ప్రజలమీద ఎలా ప్రయోగించారో తెలుసుకోడం మీ తరంకాదు! వాళ్ళెక్కడా ఆధారాలు వదలరు.... మనం వెంటపడటానికి. అయినా మీ రొటీన్‌వర్క్ పూర్తి చేసుకోండి. మేం చేయగల్గిందేమీ లేదు!"

కృష్ణన్ నిట్టూర్చి ఫోన్‌వేపు కదిలాడు.

జాన్, లాల్ భుజం తడుతూ అన్నాడు:

"గడియారం....గోడగడియారం ఆగిపోయింది."

లాల్ తలెత్తి చూసాడు. గడియారం నాలుగ్గంటలకి ఆగిపోయింది. ముఖం చిట్లించి, "మనం దిలీప్‌తోమాట్లాడుతున్నప్పుడు నడుస్తోందా?" అన్నాడు.

"గమనించలేదు. నడుస్తుండాలి. ఆగిపోయే వీలులేదు. దాని 'కీ' వారంరోజులు వస్తుంది. ప్రతి ఆదివారం 'కీ' ఇస్తాను. ఇవాళ శుక్రవారం."

"అయితే యెవరో ఆపివుండాలి" అన్నాడు లాల్, "ఆ పని హంతకుడిది. గడియారం ఆపడంలో ఏమిటి వుద్దేశ్యం? నాలుగు గంటలకి హత్య జరిగిందని తెలియజేయడమా?"

జాన్ ఛటుక్కున నిలద్దాడు. "కాదు! హత్యా సమయాన్ని సూచించడం హంతకుడి లక్ష్యం కాదు. నాలుగు గంటలు....అంటే, నెంబర్ ఫోర్—మాస్టర్ కిల్లర్!"

54

మర్నాడు ఉదయం పత్రికలన్నీ 'ఫోర్ ఏసెస్ ఆర్గనైజెషన్'ని వెలుగులోకి తెచ్చాయి. ఇటీవల జరిగిన సంఘటన లన్నిటికీ ఈ ముఠా కారణమనీ, ఇదే ముఠా గత

రాత్రి సి.బి.ఐ. ఉద్యోగిని హత్య చెయ్యడం జరిగిందనీ వ్రాశాయి.

ప్రొఫెసర్ల హత్యకి కారణమైన ఫార్ములా శత్రువుల వశమైందనీ, ఆ ఫార్ములా ఏమిటో ఇంకా తెలియదనీ, (ఫార్ములా గురించి వివరాలు పోలీసులు సెన్సార్ చేశారు), అయితే అది చాలా ప్రమాదకరమైన ముందనీ వ్రాశాయి.

'ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్'లో మనుషుల వివరాలేమీ వెల్లడి చెయ్యలేదు. ఈ ముఠావి నాశనం చెయ్యడానికి పోలీసులూ, డిటెక్టివ్‌లూ చురుగ్గా పని చేస్తున్నట్లు వ్రాశాయి.

ప్రొఫెసర్ల హత్యా వివరాలు ముందు పేజీలో ప్రకటిస్తూ, లాల్ అండ్ జాన్‌ల ఫొటోలు చెరోవేపు ప్రచురించాయి.

ఉదయం పదిగంటలకు 'ట్విన్ సిటీస్ డిటెక్టివ్ ఏజెన్సీ' పార్ట్‌నర్స్ ఇద్దరూ ఆఫీసులో తమ కార్యక్రమం గురించి చర్చించుకుంటున్నారు.

ఆర్గనైజేషన్‌లోని నల్గురూ నాలుగు రకాలైనవారు. మొదటి మనిషి గజానంద్ భాటియా—అస్సామీ—ఆర్గనైజేషన్ హెడ్. ఆదేశాలన్నీ అతనే జారీ చేస్తాడు. రెండవమనిషి బొంబాయి పారిశ్రామికవేత్త. ఆర్గనైజేషన్‌కి ఆర్థిక సహాయం చేస్తాడు. మూడవ మనిషి కన్నడ స్త్రీ. ఆమె గురించి ఏమీ తెలియదు. నాలగవ మనిషి మాస్టర్ కిల్లర్. హత్యలు చెయ్యడంలో ప్రసిద్ధుడనని ప్రకటించుకుంటున్నాడు—రాత్రి చేసి చూపించాడు.

పోలీసులు బొంబాయి శాఖ సి.బి.ఐ.కి దిలీప్‌కుమార్ చావుగురించి తెలిపి, ఆర్గనైజేషన్ వివరాలు కోరారు. కానీ, ఆ వివరాలన్నీ దిలీప్‌కే తెలుసనీ, దిలీప్ ఈ కేసు చేపట్టి

నెలరోజులు గడిచినా ఎలాటి రిపోర్టు పంపలేదనీ, అతని జాడ కూడా తెలియదనీ, కాబట్టి తమదగ్గర ఆర్గనైజేషన్ గురించి ఫైలు లేదనీ అక్కడి అధికారులు తెలియజేశారు.

"వెల్, జాన్" లాల్ అన్నాడు, "ఫోర్ ఏసెస్‌లో ఒకడు ఇక్కడే తిరుగుతున్నాడని మనకు తెలుసు— నెంబర్ ఫోర్—మాస్టర్ కిల్లర్. రాత్రి ధైర్యంగా వచ్చి తెలివిగా హత్య చేశాడు. ఎక్కడా ఆధారాలు వదలలేదు. అతను 'సడెన్' కంటపడలేదంటే రాకపోకలు యెంత రహస్యంగా జరిపాడో వూహించు. అయితే మిస్టర్ భాటియా సిటీలో లేడని ఎందుకనుకోవాలి?"

"ముఠాకి నాయకత్వం వహించేవాళ్లు ఎక్కడబడితే అక్కడ తిరగరు. ఎక్కడో ఒకచోట రహస్యంగా, స్థిరంగా కూచొని తీగలు లాగుతుంటారు...." అన్నాడు జాన్.

"సాధారణంగా ఇలాంటి వ్యక్తులు సొసైటీలో పలుకుబడి, గౌరవం గలవారై వుంటారు. కాబట్టి వాళ్ళెక్కడికి వెళ్ళినా ఎవరూ అనుమానించరు!" అన్నాడు లాల్.

డిటెక్టివ్‌లు ఇలా వాదించుకుంటోండగా మధ్యలో ఫోను మోగింది.

లాల్ రిసీవర్ ఎత్తాడు!

"హల్లో లాల్! మీరన్నదే కరెక్టు. దేశద్రోహులంతా సమాజంలో గొప్ప మనుషులుగా చెలామణీ అవుతూంటారు" అంది అవతలి కంఠం.

లాల్ నిర్ఘాంతపోయాడు: "హల్లో మీరెవరు? నా మాట లెలా విన్నారు?" అన్నాడు కంగారుగా.

అవతల నవ్వు, "టేబుల్ సొరుగు లాగి చూడండి, తెలుస్తుంది."

లాల్ తటాలున సొరుగు లాగి చూశాడు—బంగారం రంగులో మెరుస్తున్న చిన్న కోటుబటన్ కన్పించింది.

"చూశారా?" అంది అవతలి కంఠం మళ్ళీ, "అది విని నాకు చెప్పండి."

లాల్ శక్తి కొద్దీ ఆ బొటన్‌ని బయటికి విసిరాడు.

"ఓ.కే. ఫ్రెండ్. అదిప్పుడు నీకేమీ చెప్పదు. నేను చెప్తాను! నువ్వు మా ఇంట్లోనూ, ఆఫీసులోనూ దొంగ తనంగా ప్రవేశించడం మాకు నచ్చలేదు దాగుడుమూత లాడక దమ్ములుంటే ముందుకు రా!"

అవతల నవ్వు: "నేను మీ ఎదుట వున్నా నన్ను గుర్తించలేరు! ఎందుకంటే నేనిప్పుడు గొంతు మార్చి మాట్లాడుతున్నాను—మాట తీరు కూడా. నేనిప్పుడు హిందీలో మాట్లాడుతోన్నా, నా మాతృభాష హిందీ కాదు- అయినా కంఠాన్నిబట్టి మనుషుల్ని వర్ణించడానికి మీరేమీ షెర్లాక్ హోమ్స్ కాదు!"

లాల్ కోపంగా అన్నాడు, "ఛాలెంజి చేస్తున్నావా? మాతో ఛాలెంజిచేసి, మమ్మల్ని చంపడానికి ప్రయత్నించిన మీ మనుష లేమయ్యారో తెలుసా?"

"మాస్టర్ కిల్లర్ ఛాలెంజ్ చెయ్యడు. తను చేసిన పనుల గురించి గొప్పగా చెప్పుకుంటాడు" అంది అవతలి కంఠం, "మిస్టర్ లాల్, నేనిప్పుడు ఫోన్ చేసింది మిమ్మల్ని హెచ్చరించడానికి. మా వ్యవహారాల్లో జోక్యం చేసుకోడం మీ ఇద్దరికీ మంచిది కాదు. మీరు మా కెంత దగ్గరగా వస్తూంటే అంత మృత్యువుకి దగ్గరవుతున్నారన్న మాట—ఈ విషయం గుర్తుంచుకోండి.

ప్రొఫెసర్ హంతకుల్ని పట్టుకుని మీరు చాలా పేరు సంపాదించారు. అది చాలు! ప్రొఫెసర్స్ విషయంలో

నన్ను సంప్రతించి వుంటే ఎవరూ పట్టుబడేవారు కాదు. నేను వేరే పనిమీద వేరేచోట వున్నాను అప్పుడు—హెడ్ క్వార్టర్స్‌నుంచి ఆర్డర్స్ రాలేదు. ఇప్పుడొచ్చాయి. ఆ ఆర్డర్స్‌ని పాటి స్తే మీ ప్రాణాల ండవు. దయచేసి ఈ కేసు వదులు కోండి. ఫోర్ ఏసెస్‌కి యెవరూ వ్యతిరేకంగా బ్రతికి వుండ లేదు. అసలు ఫోర్ ఏసెస్ గురించి చెప్పాలంటే—"

లాల్ అడ్డు తగిలాడు, "ఏమీ చెప్పనవసరంలేదు. మేమే తెలుసుకుంటాం. అతి త్వరలో మీ 'ఫోర్ ఏసెస్'ని 'ఫోర్ యాసెస్'గా మార్చేస్తాం ఆ శుభ ఘడియకోసం యెదురు చూస్తుండండి."

లాల్ ఫోన్ పెట్టేసి జాన్‌ని చూశాడు.

"ఎవరు?" జాన్ అడిగాడు.

"నెంబర్ ఫోర్" అన్నాడు లాల్, "కేసు వదులు కోమని బెదిరిస్తున్నాడు. నువ్వేమంటావు?"

"మాస్టర్ కిల్లర్!" జాన్ ఆశ్చర్యంగా అన్నాడు, "ఫోన్ చేసింది అతనా?"

"అవును. రాత్రి ఆఫీసులో ప్రవేశించి డ్రాయర్‌లో బగ్ పెట్టాడు. ఇందాక మన మాటలన్నీ యెక్కడో వుండి విన్నాడు. నేను దాన్ని బయటికి విసిరేశాను సరే, మనం కేసు వదులుకోకపోతే ప్రాణాలుండవట."

"మనం అతన్ని ట్రేస్‌చేసి పట్టుకోవాలి. ఎలా?"

"అది సులభంకాదు. వాళ్ళు తమ మూవ్‌మెంట్స్ చాలా గోప్యంగా వుంచుతారు."

"ఆ ఫార్ములా గురించి ఏమైతే చెప్పాడా?"

"లేదు. నేనడగలేదు. అతనూ చెప్పలేదు. బహుశ మళ్ళీ ప్రయోగించే ఆలోచన లేదనుకుంటాను."

మళ్ళీ ఫోను మోగింది. జాన్ ఉలికిపడి ముందుకి

వంగాడు. లాల్ అతన్ని వారించి రిసీవర్ అందుకున్నాడు:

"యస్?"

"మీ రెవరు?" అంది అవతలి కంఠం.

లాల్ ముఖం విచ్చుకుంది: "గుడ్ మార్నింగ్ కృష్ణన్, నేను లాల్ని."

"గుడ్ మార్నింగ్. మిస్టర్ లాల్, గుడ్ న్యూస్!"

"ఏమిటి?"

"ఇటీవల అస్సాం నుంచి ఒక రిటైర్డ్ పోలీస్ ఐ.జి. రావడం జరిగింది. రిటైరయ్యాక యిక్కడే నివాసం ఏర్పరచుకున్నాడు. అడ్రస్ చెప్తాను, వ్రాసుకోండి" కృష్ణన్ చెప్పాడు, "నాకు ఇప్పుడు తీరకలేదు మీరు వెళ్లి ఆయన్ని కలుసుకుంటే చాలా విషయాలు తెలియవచ్చు."

లాల్ అడిగాడు, "ఎలాటి విషయాలు?"

"ఫోర్ ఏసెస్‌లో నెంబర్ వన్-గజానంద్ భాటియా అస్సామీ. ఈ రిటైర్డ్ ఐ.జి. అస్సాంలో పని చేశారు."

"వెరీ వెల్!" అన్నాడు లాల్, "అయితే ఆయన, భాటియా గురించి వివరాలు చెప్తాడంటారా?"

"అవును. చెప్పవచ్చు—కనీసం పుట్టుపూర్వోత్తరాలు చెప్పవచ్చు"

"ఐ.జి. పేరేమిటి?"

"బిమల్ రాయ్. ఆయన బ్రహ్మచారి. బంగళాలో వంటరిగా వుంటున్నాడు. మీరు వెళ్లి కలవండి. ఆయన భాటియా గురించి ఏ కొంచెమైనా చెప్పగలడని నా వూహ. ఏమంటారు? ఆయన్ని కలిశాక నాకు ఫోన్ చెయ్యండి. గుడ్ లక్!"

అవతల కృష్ణన్ ఫోన్ పెట్టేశాడు.

లాల్ రిసీవర్ క్రేడిల్ చేపి కృష్ణన్‌తో సంభాషణ జాన్‌కి

చెప్పాడు.

జాన్ ఆసక్తిగా విని అన్నాడు, "ఇలాటి టిప్స్‌ని నిర్లక్ష్యం చెయ్యడం మంచిదికాదు. ప్రతి చిన్న ఇన్ఫర్మేషన్ మనకు చాలా ముఖ్యం. లెటజ్ గో."

55

పావుగంట తర్వాత ఇద్దరూ నాంపల్లిలో ఒక బంగళా ముందు కారు దిగారు.

గేటు జవాను నమస్కరించి ప్రశ్నార్థకంగా చూశాడు. అతని చేతిలో విజిటింగ్ కార్డుపెట్టి వెళ్ళమన్నట్టు సైగ చేశాడు. జవాను వెళ్ళిపోయాక సిగరెట్ వెల్గించి జాన్‌ని చూశాడు.

జాన్ సూటిగా గేటులోంచి బంగళాని చూస్తున్నాడు. ఒంటి అంతస్తు పురాతన బంగళా. గోడలకి సున్నం కూడా సరిగాలేదు. జవాను ఫర్లాంగుదూరం నడిచి మెట్లెక్కి బంగళాలో కెళ్లాడు. అయిదు నిమిషాల తర్వాత తిరిగి బయటికి వచ్చాడు.

కాస్సేపటికి గేటు దగ్గరికి వచ్చి రమ్మన్నట్టు చెయ్యి ఊపాడు. ఇద్దరూ లోనికెళ్ళారు.

అప్పుడే బంగళాముందు విశాలమైన వరండాలో ఒక ఆకారం ప్రత్యక్షమైంది—సుమారు 60 ఏళ్ళ మనిషి ఆకారం-వదులు ప్యాంట్, షర్టు ధరించాడు. కాళ్ళకి స్లిప్పర్స్ వున్నాయి. రెండుచేతులూ ప్యాంట్ జేబులో పెట్టుకుని, నిటారుగా నిలబడి, సూటిగా చూస్తున్నాడు.

డిటెక్టివ్‌లు అతన్ని చేరుకుని విష్‌చేసి కరచాలనం చేశారు. అతను చిరునవ్వుతో సాదరంగా ఆహ్వానించి వరండాలోనే వున్న పేము కుర్చీల్లో కూచోబెట్టాడు.

"ఐయాం వెరీ గ్లాడ్ టు మీటూ్య, మైడియర్ ఫ్రెండ్స్!"

అపరాధ పరిశోధన పోటీ-141

[ఫలితాలు]

ఏప్రెల్ '80 నెల "అపరాధ పరిశోధన పోటీ—141"కి సరియైన సమాధానాలు:

1. పెట్రోలు.
2. రాంగ్ నంబర్స్.
3. పందులు.
4. ప్రజాసేవ.
5. మోసగాడిని.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూలై '80 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ బి. ప్రకాష్,
C/o శ్రీ రాజరాజేశ్వర స్వామి రైస్ మిల్,
అంగడి బజార్,
నిజామాబాదు-503001.

(2) శ్రీ యరమాటి రాంజి,
జంగమరకల్లు గుడి-పోస్టు,
గంగావతి—తాలూకా,
రాయచూరు—జిల్లా,
(కర్ణాటక రాష్ట్రము)

అన్నాడతను కూచుంటూ, "ఈ మధ్య సిటీలో జరుగుతున్న సంఘటనల్లో మీ పేరు వింటున్నాను—మీ రిద్దరూ హంతకుల్ని పట్టుకోడంలో చాలా నేర్పు చూపారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌కి మీరు చాలా అవసరం!"

లాల్ నవ్వి అతని ముఖంలోకి చూశాడు.

రిటైర్డ్ ఐ.జి. బిమల్‌రాయ్ ముఖంలో అరవై ఏళ్లు వచ్చినా వృద్ధాప్యపు ఛాయలు లేవు.

"థాంక్యూ సర్. హంతకుల్ని పట్టుకున్నందుకు మాకు గర్వంగా వుంది కానీ—మేం సాధించవల్సింది యింకా చాలా వుంది."

"అవును." అన్నాడు రాయ్. "పత్రికల్లో చదివాను. ఈ హత్యలన్నిటి వెనకా ఒక ముఠా చేతిలోకి యేదో ఫార్ములా వెళ్ళినట్టు కూడా చదివాను."

"దటీజ్ రైట్ సర్. ఆ ముఠాని నాశనం చేసే బాధ్యత కూడా మేం తీసుకున్నాం."

"చాలా సంతోషం" అన్నాడు రాయ్, చిన్నగా నవ్వి. మరుక్షణం అతని ముఖంలో రంగులు మారాయి. డిటెక్టివ్‌లని అనుమానంగా చూశాడు.

అతని అనుమానం పసిగట్టి అన్నాడు లాల్, "ఈ కేసులో కొన్ని వివరాల కోసం మీ దగ్గరికి వచ్చాం."

"ఏం వివరాలు కావాలి?"

"మీరు అస్సాంలో ఐ. జి.గా పనిచేసి రిటైర్ అయ్యారు. మీ పదవీకాలంలో ఏ సందర్భంలోనైనా గజానంద్ భాటియా అనే మనిషి గురించి వినడం జరిగిందా?"

రాయ్ కళ్ళు ఉలికిపడ్డాయి. ఛటుక్కున జేబులోంచి సిగార్ తీసి ముట్టించాడు. గట్టిగా రెండు దమ్ములు లాగి,

అందానికి ఆపద?

(పాఠకుల పరిశోధన పోటీ-95 ఫలితాలు)

భారతి తన శీలరక్షణ కోసమే డాక్టరును హత్య చేసిందనటానికి ఆధారాలు ఇవి :

డాక్టరు తన దగ్గర 'బారల్‌గయిన్' టాబ్లెట్స్ వుండి కూడా వాటికోసమని వంటవాడిని బజారుకు పంపాడు. అంటే అక్కడ డాక్టరుద్దేశం స్పష్టమవుతూనే వుంది.

వంటవాడు వచ్చేసరికి భారతి కిటికీ దగ్గర ఏడుస్తూ నిలబడి వుంది. డాక్టరు యాక్సిడెంటల్‌గా మరణిస్తే భారతి ఏడుస్తూ నిల్చోక, చుట్టుప్రక్కల వారిని పిలవటానికి, పోలీసులకు ఫోన్ చేయటానికి ప్రయత్నించేది. అసలు ఆమె ఏడ్వవలసిన అవసరమే లేదు.

—పై ఆధారాలతో ఈ కేసును అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింద ఇరువురు పాఠకులకు చెరొక పాతిక రూపాయలు బహుమతిగా పంపుతున్నాము.

(1) శ్రీమతి వై. రేణుకాదేవి,
"సత్య నివాస్",
లక్ష్మినిలయం కాలనీ,
రామన్ మీనన్ రోడ్,
కాలికట్—2
(కేరళ రాష్ట్రము)

(2) శ్రీ ఏనుగు నర్సింహారెడ్డి,
ఇంటి నెం. 6-4-383,
భోలక్ పూర్,
సికింద్రాబాదు-500003.

సూటిగా ఆవరణలోకి చూశాడు.

ఆ తర్వాత అన్నాడు: "గజానంద్ భాటియా ...అతని గురించి చాలా విన్నాను."

"అతని గురించి మీకు తెలిసింది చెప్పగలరా'" లాల్ అన్నాడు ఆతృతగా. జాన్ చెవులు రిక్కించాడు.

రాయ్ కాస్సేపు ఆలోచించి, ఏదో నిర్ణయం చేసుకున్నట్టు తలాడించి అన్నాడు:—

"ప్రతిమనిషి గురించి చెప్పడానికి కొంతైనా వుంటుంది. గజానంద్ భాటియా గురించి నేను చాలా చెప్పగలను. కానీ ఏదీ యదార్ధమని నిరూపించలేను. గజానంద్ గురించి నేను యదార్థాలు సేకరించేలోపున రిటైర్‌మెంట్ వచ్చింది. ఇదే నన్ను చాలా బాధిస్తోంది. ప్రభుత్వం నన్ను విశ్రాంతి తీసుకోమని ఇంటికి పంపించిందిగానీ, నేనిక్కడా చాలా వ్యధ చెందుతున్నాను. ఒక్కొక్కప్పుడు నేను అసమర్థుడినా అన్పిస్తుంది....నా పదవిని సక్రమంగా నిర్వహించలేక పోయానన్పిస్తుంది....

"మిస్టర్ లాల్, గజానంద్ అస్సామీ. నేను విన్న కథలనుబట్టి అతను బాల్యమంతా దారిద్ర్యం అనుభవించాడు. యవ్వనంలో ప్రవేశించక ముందే అనాధ అయ్యాడు. అతని మీద పెత్తనం చెలాయించేవారెవరూ లేరు. ఇరవై ఏళ్ళ వయసులో అస్సాం విడిచి కాశ్మీర్ వెళ్లిపోయాడు. అక్కడొక ముఠా తయారుచేసి పాకిస్తాన్‌తో స్మగ్లింగ్ కార్యకలాపాలు నడిపాడు. త్వరలోనే ఆ ముఠా పట్టుబడింది. కానీ గజానంద్ యెక్కడికో అదృశ్యమైపోయాడు.

"అయిదేళ్ళవరకు అతని గురించి యెవరూ విన్లేదు. విదేశాలకు వెళ్లాడని కొందరు, ఏదో రైలుప్రమాదంలో

అపరాధ పరిశోధన పోటీ-143

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-6-'80 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '80 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. గత నెలలో ఈ దేశం 'స్వతంత్రదేశం'గా అవతరించింది—? (జింబాబ్వే, రొడీషియా.)

2. త్రాగుబోతులు కొందరు ఇలా ప్రవర్తిస్తారు—? (అసభ్యంగా, అహంకారంగా.)

3. నేటి నాగరిక ప్రపంచంలో ఇవి రోజు రోజుకు మృగ్యమవుతున్నవి—? (సాంప్రదాయాలు, మానవత్వ విలువలు.)

4. ఇది మనకు 'టైమ్' తెలుపుతుంది—? (గడియారం, రేడియో)

5. ఎండాకాలంలో వీటి అవసరం ఎక్కువగా వుంటుంది—? (ఫ్యాన్లు, చల్లని పానీయాలు.)

చనిపోయాడని కొందరు వూహించుకున్నారు. ఇంతలో, అయిదేళ్ల తర్వాత వున్నట్టుండి అస్సాంలోని డిస్పూర్‌లో ప్రత్యక్షమయ్యారు. అందరూ ఆశ్చర్యపడ్డారు. అతను చాలా మారిపోయాడు. అన్నాళ్ళూ ఎక్కడున్నాడో, ఏం చేశాడో యెవరికీ చెప్పలేదు.

"డిస్పూర్‌లోనే ఒక హోటల్ తెరిచి ఇరవై ఏళ్లు నడిపాడు. ఇప్పుడా హోటల్ పదంతస్తుల బిల్డింగ్. ఇరవై యేళ్ల తర్వాత, రెండేళ్లక్రితం మళ్లీ అదృశ్యమయ్యాడు."

"ఎక్కడికి?"

"తెలీదు. మళ్లీ ఏదో సీక్రెట్ బిజినెస్‌లో దిగాడని అందరూ అనుమానించారు. అది నిజం. అయితే ఆ బిజినెస్‌కి హెడ్ క్వార్టర్స్‌గా హోటల్‌నే యెన్నుకున్నాడు. ఆ బిజినెస్ ఏమిటో, అతనెక్కడుంటాడో మేం యెంత ప్రయత్నించినా తెలుసుకోలేకపోయాం."

"హోటల్‌లో ఎలాటి క్లూస్ దొరకవా?"

"దొరకవు. ఈమధ్య ఆ హోటల్ నుంచి హెడ్ క్వార్టర్స్ మార్చాడని విన్నాను. ఎక్కడో తెలీదు. అతని బిజినెస్ ఏమిటో ఎవరికీ తెలియకపోయినా ఒక్కటి మాత్రం చెప్పగలను: దేశంలో కల్లోలాలు సృష్టించడం."

"కానీ ఆధారాలు లేవు."

"లేవు. అది ఆ ముఠా ప్రత్యేకత. ఉదాహరణకి రెండునెలల క్రితం బీహార్‌లో జరిగిన అలజడులు. ఈ దహనకాండ వెనుక గజానంద్ హస్తముంది. బీహార్ సంఘటనల గురించి ఒక విలేఖరి తెలియజేస్తూ వాటిలో గజానంద్ భాగముందని ప్రస్తావించాడు. కానీ రుజువు లేదు. అయితే ఆ విలేకరి మాత్రం నడివీధిలో మిట్ట మధ్యాహ్నం హత్య చెయ్యబడ్డాడు."